సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 195
శనివారం 30-3-2024
SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'


కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయం
ఐపీఎల్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ ఓటమి - 11లో


టూరిజం జోష్
రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి.. లిస్టులో తిరుపతి, వారణాసి, అయోధ్య - 11లో


నా భర్తను దీవించండి
ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు నైతిక మద్దతునివ్వాలని ప్రజలకు ఆయన సతీమణి సునీత విజ్ఞప్తి చేశారు.
- వివరాలు 6లో


దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం
దక్షిణాఫ్రికాలో బస్సు లోయలో పడి 45 మంది చనిపోయారు. ఈస్టర్ జరుపుకునేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.
- వివరాలు 6లో


ఆర్జేడీకి 26.. కాంగ్రెస్‌కు 9
బిహార్‌లో 'మహాఘట్‌బంధన్'లో సీట్ల పంపిణీ కొలిక్కి వచ్చింది. ఆర్జేడీ 26 చోట్ల, కాంగ్రెస్ 9 చోట్ల పోటీ చేయనున్నాయి.
- వివరాలు 6లో



'విజిల్' ఊదేస్తున్నారు
'సీ-విజిల్' యాప్ ద్వారా ఓటర్లు 79 వేలకు పైగా ఫిర్యాదులు చేయగా.. 99 శాతానికి పైగా పరిష్కరించినట్టు ఈసీ తెలిపింది. .
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

డాక్టర్‌గా మారొద్దు.. మందులు రాయొద్దు



అర్హత లేకుండా ఎవరూ వైద్యం చేయకూడదని వైద్య, ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. ప్రథమ చికిత్స చేసే ఆర్‌ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని, చికిత్స కేంద్రం బోర్డులపై క్లినిక్, ఆసుపత్రి, నర్సింగ్ హోం, మెడికల్ సెంటర్ అనే పేర్లను ప్రదర్శించరాదని ఆదేశించింది.
- వివరాలు 3లో

కేసీఆర్ పాపాల వల్లే కరువు


'కేసీఆర్ చేసిన పాపాలే ఇప్పుడు ఆయన్ను చుట్టుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో అన్నీ కుంభకోణాలే. యాదగిరిగుట్ట పేరు మార్చడమే ఆయన చేసిన మొదటి తప్పు. దేవుడి పేరుపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి సర్వనాశనం చేశారు. ఈ కేసీఆర్ పాపాల వల్లే ఇప్పుడు కరువు వచ్చింది' అని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.
- వివరాలు 8లో

సిరిసిల్ల నేతన్నల సమ్మె విరమింపజేయాలి


సిరిసిల్ల నేతన్నల సమ్మెను విరమింపజేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి ప్రభుత్వమే కారణమని, వారికి రూ.270 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.
- వివరాలు 5లో

ఫ్యాకల్టీయే లైంగికంగా వేధిస్తే ఇంకెవరికి చెప్పను నాన్నా..

- తండ్రి సెల్‌కు మెసేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని
- విశాఖ కొమ్మాదిలోని చైతన్య కాలేజీలో ఘటన..

5 లో

ఇదేంజాతర్


టైం లేదట! టికెట్ ఇవ్వకుంటే డైరెక్టుగా టికెటిచ్చే పార్టీలోకి దూకుతాడట!

రాజీనామాయే ప్ర'దానం'!

దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాకే ఎంపీగా పోటీ
కాంగ్రెస్ అధిష్టానం స్పష్టీకరణ.. ససేమిరా అంటే బరిలో మరొకరు!

సీఎం రేవంత్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎంపీ కేకే

- కడియం శ్రీహరి నివాసానికి వెళ్లి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ, ఇతర నేతలు
- నేడు కాంగ్రెస్‌లో చేరనున్న కేకే కుమార్తె, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి
- కేకే, కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఎప్పుడు చేరతారన్నదానిపై అస్పష్టత..
- సుదీర్ఘంగా టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ భేటీ
- తుక్కుగూడ సభ ఏర్పాట్లు, లోక్‌సభ ఎన్నికల వ్యూహంపై చర్చ

రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్ కీలక నేతలు పార్టీని వీడుతుండటం కలకలం రేపుతోంది. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే సికింద్రాబాద్ ఎంపీగా పోటీకి దింపుతామని కాంగ్రెస్ అధిష్టానం తేల్చినట్టు వచ్చిన వార్తలు చర్చనీయాంశంగా మారాయి. దీనికితోడు మంత్రి కోమటిరెడ్డి కూడా దానం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ఎంపీగా పోటీ చేస్తే ఇబ్బందులు వస్తాయని వ్యాఖ్యానించారు. ఇక వచ్చే నెల 6న తుక్కుగూడలో నిర్వహించే సభ, లోక్‌సభ మేనిఫెస్టోపై చర్చించేందుకు టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ శుక్రవారం భేటీ అయింది. అంతకుముందు గాంధీభవన్ వేదికగా టీపీసీసీ ప్రచార కమిటీ భేటీ అయింది. ఇక బీఆర్ఎస్ సెక్రెటరీ జనరల్, ఎంపీ కె.కేశవరావు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మల్లు రవి, ఇతర నేతలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసానికి వెళ్లి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కె. కేశవరావు కుమార్తె, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి శనివారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కూడా చేరేందుకు రంగం సిద్ధమైంది. నర్సాపూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కూడా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు.

- సాక్షి, హైదరాబాద్


కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్యను కలిసిన దీపాదాస్ మున్షీ, మల్లురవి, సంపత్ కుమార్


సీఎం రేవంత్ రెడ్డితో కేశవరావు

రాజీనామా చేశాకే పోటీ!
దానం కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీచేసే విషయంలో ట్విస్ట్ 5లో

కలయికలు.. భేటీలు
- జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో రేవంత్‌ను కలిసిన కేకే 2లో
- కడియం శ్రీహరి ఇంటికి వెళ్లిన మున్షీ

'ఐటీఐఆర్' హామీ ఇద్దామా?
టీపీసీసీ భేటీలో చర్చ 8లో

'చాయ్ పే చర్చ'లో ప్రధాని మోదీ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్



డిజిటల్ టెక్నాలజీకి పెద్దపీట

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నాకు ఆసక్తి మెండు: మోదీ

- డిజిటల్ విప్లవానికి సామాన్య ప్రజలే నాయకత్వం వహించాలి
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో మోదీ 'చాయ్ పే చర్చ'
- టెక్నాలజీలో భారత్ మార్గదర్శిగా మారిందని బిల్‌గేట్స్ ప్రశంస

6 లో

టెక్నాలజీలో నేను నిపుణుడిని కాకపోయినా దానిపై చిన్నపిల్లలకు ఉండే ఉత్సుకత నాకూ ఉంది. అదే సమయంలో నేను టెక్నాలజీకి బానిసను కాలేదు. ఏఐతో సృష్టించే డీప్‌ఫేక్‌ల విషయంలో అప్రమత్తత అవసరం. ఏఐని అన్నీ సాధించిపెట్టే మంత్రదండంగా చూడొద్దు.
- ప్రధాని నరేంద్ర మోదీ

కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానివ్వం



పట్నం దంపతులు, రంజిత్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు

- కేకే, కడియం పెద్దవారు.. విమర్శలు వారి విజ్ఞతకే వదిలేద్దాం
- పార్టీ వీడే వారి విషయంలో కాలమే సమాధానం చెబుతుంది

మాజీ మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదు. కానీ అధికారం పోగానే స్వార్థం కోసం కొందరు నేతలు పార్టీలు మారుతున్నారు. రేపు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి వంటి వారు వచ్చి కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానిచ్చేది లేదు. పదేళ్లు అధికారం అనుభవించిన నాయకులు పార్టీ నుంచి బయటకు వెళ్లే ముందు రెండు రాళ్లు వేసి వెళతారు. కేకే, కడియం శ్రీహరి వయస్సురీత్యా పెద్దవారు.. వారినేమీ అనలేం..విజ్ఞతకే వదిలేద్దాం.. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ కీలక నేతలతో జరిగిన భేటీలో కేటీఆర్ ప్రసంగించారు. 'రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు పార్టీలో నీడలా ఉంటూనే వెన్నుపోటు పొడిచారు. ఆస్కార్ అవార్డుకు మించి నటిస్తే పిచ్చోళ్లలా నమ్మాం. బయటివాడు మోసం చేస్తే బాధ అనిపించదు. కానీ నీడలా తిరిగి, కష్టకాలంలో వెంట ఉండకుండా కేసీఆర్ కూతురు అరెస్టు అవుతున్న సమయంలో నవ్వుకుంటూ

మిగతా 5వ పేజీలో ▶


కర్నూలు జిల్లా పెంచికలపాడు వద్ద ఓ చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మోసగాళ్లను నమ్మొద్దు

వారి తోకలు కత్తిరించేలా మీరే స్టార్ క్యాంపెయినర్లు కావాలి
ఎమ్మిగనూరు సభలో ప్రజలకు ఏపీ సీఎం వైఎస్ జగన్ పిలుపు

- మీ బిడ్డ మంచి చేసి ఉంటే ఆ మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి
- ఆడబిడ్డల కష్టాలు కళ్లారా చూశా.. అందుకే విప్లవాత్మక పథకాలు
- దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు 50 శాతం నామినేటెడ్ పదవులు
- పిల్లల బంగారు భవిష్యత్ కోసం విద్యారంగంలో సంస్కరణలు
- అన్ని వర్గాల వారికి మంచి చేసిన ప్రభుత్వానికి రాఖీ కట్టండి
- మళ్లీ ఆ ముగ్గురు మోసాలు చేసేందుకు కూటమిగా వస్తున్నారు
- వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఓవైపు.. భూమి పుత్రుడైన మీ బిడ్డ మరోవైపు
- పేదల తలరాతలు మార్చే ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి

- వివరాలు 8లో

17 సీట్లూ మావే...

కమలదళం సరికొత్త నినాదం

- 2019లో 4 ఎంపీ సీట్లు గెలిపిస్తే రూ.9 లక్షల కోట్ల అభివృద్ధి
- ఇప్పుడు అన్ని సీట్లతో మరింత అభివృద్ధి అంటూ ప్రజల వద్దకు..
- ప్రతీ పోలింగ్ బూత్‌కో వాట్సాప్ గ్రూప్
- కార్యాచరణ అమలుకు బీజేపీ సిద్ధం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కమలదళం 'సారే కే సారా సత్రా హమారా' (17 ఎంపీ సీట్లకు 17 సీట్లు మనవే) నినాదంతో ముందుకెళ్లాలని నిర్ణయించింది. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ గెలుపొందుతుందనే ధీమాతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకెళ్లాలని జాతీయనాయకత్వం దిశానిర్దేశం చేసింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీని 4 ఎంపీ సీట్లలో గెలిపిస్తే రూ. 9 లక్షల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, వచ్చే ఎన్నికల్లో అన్ని ఎంపీ స్థానాల్లో గెలిపిస్తే అంతకు మించి అభివృద్ధి చేస్తామంటూ ప్రజల వద్దకు వెళ్లాలని సూచించినట్టు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల కార్యాచరణ అమలుకు సిద్ధమైంది. ఇందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో బీజేపీ తరఫున పోటీలో ఉన్న 17 మంది ఎంపీ అభ్యర్థులు రోజూ క్రమం తప్పకుండా పర్యటనలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ ముఖ్యనాయకులతో సమావేశం కావడం, నాయకులు, కార్యకర్తల మధ్య మెరుగైన సమన్వయం

మిగతా 2వ పేజీలో ▶

పార్టీ ఎన్నికల విభాగాలన్నీ చురుగ్గా పనిచేయాలి
- బీజేపీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సూచన 2లో

సీఎం రేవంత్ బెదిరింపు రాజకీయాలు: కిషన్‌రెడ్డి 2 లో


బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశంలో పాల్గొన్న లక్ష్మణ్ తదితరులు

ఇది ఆకులు రాలే కాలం కొత్త చిగురు ఖాయం



పనికి రాని ఆకుల మాదిరిగా పార్టీని వీడుతున్నారు
సిద్దిపేటలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు వ్యాఖ్యలు

సాక్షి, సిద్దిపేట: 'కొంత మంది నాయకులను కాంగ్రెస్ పార్టీ కొనవచ్చు.. కానీ ఉద్యమకారులను, బీఆర్ఎస్ కార్యకర్తలను కొనలేదు. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులే పార్టీని వీడుతున్నారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్లే' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు దుబ్బాక, సిద్దిపేటల్లో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇప్పుడెవరైతే పార్టీ నుంచి వెళ్లారో.. రేపు కాళ్లు మొక్కినా మళ్లీ చేర్చుకునేది లేదన్నారు. ఇది ఆకులు రాలే కాలమని, ఆకులు పోయాక కొత్త చిగురు వచ్చి చెట్టు వికసిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. పనికిరాని ఆకుల మాదిరిగా పార్టీని వీడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉన్నంతకాలం బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

వాళ్లే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలి

కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో రూ. 2లక్షల రుణ మాఫీ, ఆసరా పెన్షన్ రూ. 4 వేలు, మహిళలకు రూ. 2,500, రైతుబంధు రూ. 15 వేలు, క్వింటాలు వడ్లకు బోనస్ రూ. 500 వచ్చిన వారే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, మిగతా వారందరూ కారుకు ఓటు వేయాలని పిలుపునిచ్చిన హరీశ్‌రావు ఆ మేరకు గ్రామాల్లో చర్చ పెట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. వంద రోజుల పాలన రెఫరెండం అని

మిగతా 5వ పేజీలో ▶


కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసులు
6 లో

రూ.1,823 కోట్లు చెల్లించండి

ఐటీ నోటీసులు వచ్చాయన్న కాంగ్రెస్ నేతలు
ఐటీ చట్టాలను బీజేపీ విచ్చలవిడిగా ఉల్లంఘిస్తోందని నేతల ఆగ్రహం
బీజేపీ నుంచి రూ.4,617 కోట్లు వసూలు చేయాలని డిమాండ్

- ఐటీ విభాగం బీజేపీ జేబు సంస్థగా మారిందని ఆక్షేపణ
- నేడు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు


ఈసారి ఐరాస వంతు
6 లో

కేజ్రీవాల్ అరెస్టుపై స్పందించిన ఐరాస

ప్రజల రాజకీయ, పౌర హక్కులకు భద్రత ఉండాలని వ్యాఖ్య

ఈసీ 'మెనూ' కార్డు

- ఒకే ఐటం.. ప్రాంతానికో రేటు
- అభ్యర్థులకు రేట్లు నిర్ధారించిన ఈసీ
- ఆసక్తికరంగా ఈసీ 'మెనూ కార్డు'
- కిలో మటన్ కేవలం రూ. 500
- కిలో చికెన్ మాత్రం రూ. 250

- వివరాలు 6లో


ఫోన్ ట్యాపింగ్ కేసు
5 లో

జ్యుడీషియల్ రిమాండ్‌కు రాధాకిషన్‌రావు

పోలీసు కస్టడీకి భుజంగరావు, తిరుపతన్న
శుక్రవారం ముగ్గురినీ కలిపి విచారించిన సిట్

- రాధాకిషన్‌రావుకు గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- న్యాయమూర్తి ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు
- రాధాకిషన్‌రావుతో పాటు తిరుపతన్న, భుజంగరావుపై ఏసీబీ కేసు!


జనగామ, సూర్యాపేట, నల్లగొండ
31న మూడు జిల్లాల్లో పర్యటన

రేపు పంటల పరిశీలనకు కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/హైదరాబాద్: ఎండుతున్న పంటలను పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఆదివారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. రాష్ట్రంలో సాగునీరు లేక, భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో కేసీఆర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల స్థితిగతులు తెలుసుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటిస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండిపోతున్న వరిపంటలపై ఇటీవల కేసీఆర్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ జిల్లాల పర్యటనకు వస్తున్నారు.

క్లుప్తంగా...

కోర్టు ఆదేశాలు పాటించడం లేదు

ప్రత్యేక కోర్టులో ఎమ్మెల్సీ కవిత పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం విధానం కేసులో జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైలు అధికారులు కోర్టు ఆదేశాలు పాటించడం లేదని ప్రత్యేక కోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిటిషన్ దాఖలు చేశారు. కవితను జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశాలిస్తూ ఇంటి భోజనం, మేట్రస్, చెప్పులు, బట్టలు, బెడ్‌షీట్లు, పుస్తకాలు, బ్లాంకెట్, పెన్ను పేపర్, ఆభరణాలు, ఔషధాలు అనుమతించాలని న్యాయమూర్తి కావేరి బవేజా జైలు అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే తనకు కనీసం కళ్లజోడు వినియోగించుకునే అవకాశం కూడా అధికారులు ఇవ్వలేదని కవిత ఆరోపించారు. దీంతో కవిత పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు.

శ్రీహరిని ఛీ కొడుతున్నరు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ధర్మసాగర్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని నియోజకవర్గ ప్రజలు ఛీకొడుతున్నారని, రాబోయే రోజుల్లో గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమి కొడతారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడియం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీ మారాలని డిమాండ్ చేశారు. 'ఆనాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచావు.. ఇప్పుడు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచావు. నీ బిడ్డ కోసం కడుపులో తన్ని పోతున్నవు. ఈ ముసలితనానికి ఇంకా డబ్బులు కావాలని చూస్తున్నవు. నీకు సిగ్గు అనిపించడం లేదా?' అని శ్రీహరిని ప్రశ్నించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎవరూ భయపడాల్సిన పనిలేదని, అందరికీ అందుబాటులో ఉంటానని రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

జేపీ నడ్డాను కలిసిన సోయం బాపూరావు



సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్ ఎంపీ సీటు ఆశించి భంగపడిన సోయం బాపూరావు శుక్రవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. కంటి శస్త్రచికిత్స కోసం రెండు రోజుల క్రితం ఢిల్లీకి వచ్చిన ఆయన పార్టీ ప్రధాన కార్యాలయంలో నడ్డాను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా...అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, కారణాలు తదితర అంశాలను నడ్డాకు వివరించారు. సిట్టింగ్ స్థానాన్ని తనకు కాకుండా ఇతర పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి ఇవ్వడంపై బాపూరావు ఆవేదన వ్యక్తం చేశారు. తాను నిరాశ చెందినప్పటికీ పార్టీతోనే ఉంటానని, కార్యకర్తలందరితో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషిచేస్తానని నడ్డాకు తెలిపారు. ఈసారి అధికారంలోకి రాగానే తగిన నామినేటెడ్ పోస్టు ఇస్తామని బాపూరావుకు నడ్డా భరోసా ఇచ్చారు. నడ్డాతో భేటీ అయిన వారిలో మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే కె.రామ్ భీమ్‌రావు కూడా ఉన్నారు.

దొంగలంతా ఒక్కటై నన్ను బలహీనపర్చాలని చూస్తున్నారు

- పాలమూరుకు ఏమీ చేయని బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓట్లు ఎందుకు వేయాలి
- బోయలకు న్యాయం చేస్తాం.. కేసీఆర్‌లాగా మాట ఇచ్చి మోసం చేయం: సీఎం రేవంత్‌రెడ్డి
- గాంధీభవన్‌లో మహబూబ్‌నగర్ జిల్లా వాల్మీకిబోయ పెద్దలతో భేటీ



సాక్షి, హైదరాబాద్: 'అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 స్థానాలకుగాను 12 చోట్ల గెలిచాం. గద్వాలలో కూడా కాంగ్రెస్ కచ్చితంగా గెలిచేది. కానీ చివర్లో బీజేపీ అరుణమ్మ అల్లుడికి ఓట్లు వేయించింది. అక్కడ దొంగదెబ్బ తీశారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారు. దొంగలంతా ఒక్కటై నన్ను రాజకీయంగా బలహీనపర్చాలని చూస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు లోక్‌సభ అభ్యర్థులు వంశీ, మల్లురవిల మీద కోపం లేదు. ఉన్నదంతా నా మీదనే. నన్ను దెబ్బతీస్తే సొంత జిల్లాలో గెలవలేని వ్యక్తి రాష్ట్రమంతా ఏం చేస్తాడని ప్రశ్నించవచ్చనేది వారి ఆలోచన' అని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరుకు ఏమీ చేయని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఏం మొహం పెట్టుకొని ఓట్లడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవి తెచ్చుకున్న డీకే అరుణ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించిన రేవంత్ పదేళ్లలో పాలమూరుకు ఏమీ చేయని మోదీ ఇప్పుడేం చేస్తారని..ఇప్పుడు ఓటేస్తే మోదీ చంద్రమండలానికి రాజవుతాడా అని వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం గాంధీభవన్‌లో ఆయన మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన వాల్మీకిబోయ సామాజికవర్గ పెద్దలతో సమావేశమయ్యారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో బోయలకు రిజ్వర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్సే

'వాల్మీకిబోయలపై కాంగ్రెస్‌కు అభిమానం ఉంది. కర్ణాటకలో బోయలకు రిజర్వేషన్లు ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనే. తెలంగాణలో ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత వాల్మీకిబోయల డిమాండ్లపై నిర్ణయం తీసుకుంటాం. సంక్షేమం, అభివృద్ధి, విద్య, ఉద్యోగాల్లో సముచిత స్థానం కల్పిస్తాం. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి మీ సమస్యలు ఎలా తీర్చాలో చెప్పండి. మీ సమస్యలపై మాకు అవగాహన ఉంది. వాటిని తీర్చే బాధ్యత నాది. ఎన్నికల తర్వాత నేనే మీతో మళ్లీ సమావేశమవుతా. మీరు కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వండి. మేం కచ్చితంగా బోయలకు న్యాయం చేస్తాం. కేసీఆర్‌లాగా మాట ఇచ్చి మోసం చేయం. వంద రోజుల పాలనలో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. ఆరు గ్యారంటీలను అమలు చేశాం. అధికారంలోకి 100 రోజుల్లో విశ్వాసం కల్పించాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

కేటీఆర్ ఫలితం అనుభవిస్తారు

'కొంతమంది ఫోన్లు ట్యాప్ చేశారు. చేస్తే ఏమవుతుందని కేటీఆర్ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. తప్పుడు పనులు చేసిన అధికారులు ఇప్పుడు చిప్పకూడు తినాల్సి వస్తోంది. వాళ్ల దుర్మార్గులు, వాళ్ల మాటలు వినొద్దంటే ఆ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కేటీఆర్ ఆంబోతులా బరితెగించి మాట్లాడుతున్నాడు. ఫలితం అనుభవిస్తాడు. ట్యాపింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మంది సంసారాల్లో తొంగి చూడడానికి వీళ్లకేం పని. భార్యాభర్తలు మాట్లాడుకునే మాటలు కూడా విన్నారు. గతంలో ఫోన్ మాట్లాడాలంటేనే భయంగా ఉండేది. ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితి తీసుకొచ్చాం. ఓటు విలువ నాకు తెలుసు కాబట్టే కొడంగల్‌కు వచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేశా. అక్కడ కూడా కచ్చితంగా గెలవబోతున్నాం. 200 ఓట్లతో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌ను కలిసిన కేకే

- జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి సుదీర్ఘ భేటీ
- కడియం శ్రీహరి ఇంటికి వెళ్లిన మున్షీ, మల్లు రవి, ఇతర నేతలు
- నేడు కాంగ్రెస్‌లోకి ఇద్దరు బీఆర్ఎస్ నేతలు, వారి కుమార్తెలు
- సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో మదన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ జనరల్, ఎంపీ కె.కేశవరావు శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన కేకే చాలాసేపు రేవంత్‌తో భేటీ అయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, కేకే కుమారుడు వెంకట్ కూడా ఈ సమయంలో అక్కడే ఉన్నారు. మరోవైపు స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించేందుకు దీపాదాస్ మున్షీ, ఇతర నేతలు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. సీనియర్ నేతలు మల్లు రవి, ఎస్.సంపత్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు మున్షీ వెంట ఉన్నారు. వారు కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్యతో భేటీ అయి కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఆహ్వానించారు.

నేడు చేరికలు!

ఎంపీ కేకే కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి శనివారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. కేకే, కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఎప్పుడు చేరుతారనేది స్పష్టతలేదు. ఇక నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి కూడా శుక్రవారం రేవంత్‌ను కలిశారు. ఈ ఇద్దరు కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

నిజామాబాద్ జిల్లా నేతలు కూడా..

నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, ఆ జిల్లాకు చెందిన నేతలు షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కలసి క్యాంపు కార్యాలయానికి వచ్చి సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు రేవంత్ పలు సూచనలు చేశారు. ఇక తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, ఆమె కుమారుడు భరత్‌సాయిరెడ్డి సీఎంను కలిశారు. తనకు కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన చిత్తరంజన్ దాస్

కల్వకుర్తి రూరల్: మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, మళ్లీ సొంతగూటికి వచ్చినందుకు సంతోషంగా ఉందని చిత్తరంజన్ దాస్ పేర్కొన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి


తిరిగి బీఆర్ఎస్ గూటికి రాజయ్య?



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ తరఫున వరంగల్ ఎంపీ స్థానానికి బలమైన అభ్యర్థిని బరిలో దించేదిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య పోటీ నుంచి తప్పుకొని తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తి చెంది, బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే పార్టీకి దూరమైన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో బీఆర్ఎస్ వర్గాలు సంప్రదింపులు ప్రారంభించినట్టు తెలిసింది. అయితే తన అనుచరులతో భేటీ అయిన తర్వాత తిరిగి పార్టీలోకి రావడంపై స్పష్టత ఇస్తానని రాజయ్య చెప్పినట్టు సమాచారం. ఓ వైపు రాజయ్యను తిరిగి పార్టీలోకి తీసుకొని ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపడంపై కసరత్తు చేస్తూనే, మరోవైపు ఇతర ప్రత్యామ్నాయాలను కేసీఆర్ అన్వేషిస్తున్నట్టు సమాచారం. పార్టీ తరఫున టికెట్ ఆశించిన బోడ డిన్న, నిరంజన్, జింక రమేశ్ తదితరులు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య, జెడ్పీటీసీ సభ్యురాలు పెద్ది స్వప్న తదితరుల పేర్లు కూడా తెరమీదకు వస్తున్నాయి. ఇదిలాఉంటే తన అనుచరులతో కడియం శ్రీహరి శనివారం హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కూడా స్టేషన్‌ఘనపూర్ నేతలతో నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసింది.

స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయవచ్చా?

- 'దానం' కేసులో పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- గతంలో తీర్పులుంటే తమ ముందుంచాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పార్టీ మారిన ఖైరతాబాద్ ఎమ్మెల్యేని అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఒక ఓటర్ పిటిషన్ వేయవచ్చా? దీనిపై స్పీకర్ విధుల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చా? ఆయన ముందు వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని చెప్పవచ్చా? అలా గతంలో ఏవైనా తీర్పులుంటే తమ ముందు ఉంచాలని ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేసు దాఖలు చేసిన పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. '2023, నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేశారు. దీంతో నేను ఆయనకు ఓటు వేశాను. ఆ ఎన్నికల్లో గెలిచిన దానం.. ఎమ్మెల్యేగా రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాదు సికింద్రాబాద్ నుంచి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి.. మరో పార్టీలో చేరిన దానంను అనర్హుడిగా ప్రకటించాలని మార్చి 23న స్పీకర్‌కు ఈ–మెయిల్ ద్వారా వినతిపత్రం సమర్పించాం. ఇంకా దానిపై ఆయన నిర్ణయం తీసుకోలేదు. స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకుని దానంను అనర్హుడిగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వండి' అని కోరుతూ ఖైరతాబాద్‌కు చెందిన బొల్లబోయిన రాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ రిట్ పిటిషన్‌ను దాఖలు చేయడంలో పిటిషనర్‌కు ఎలాంటి అర్హత ఉందని అతని తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ప్రశ్నించారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి మూడు నెలలు తిరగకుండానే కాంగ్రెస్‌కు విధేయుడిగా మారిన ఎమ్మెల్యేకు పిటిషనర్ ఓటేశారని న్యాయవాది చెప్పారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడం ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తుందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గత తీర్పుల కాపీలుంటే తమ ముందు ఉంచాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

కాంగ్రెస్ పోరాటం బీజేపీతోనే కాదు

- రాజ్యాంగ హక్కులను కాపాడే దిశగా ఉద్యమం
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వ్యాఖ్య
- రేవంత్ 100 రోజుల ప్రజాపాలన పోస్టర్ ఆవిష్కరణ



సమావేశంలో దీపాదాస్ మున్షీ, మధుయాష్కీ గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పోరాడుతోంది కేవలం బీజేపీతో మాత్రమే కాదని, ప్రమాదంలో పడిన రాజ్యాంగ హక్కులను కాపాడే దిశగా పోరాటం కొనసాగుతోందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించాలని, ఆ దిశలో పార్టీ నేతలు కృషి చేయాలని ఆమె కోరారు. శుక్రవారం టీపీసీసీ ప్రచార కమిటీ సమావేశం చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రచార వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు గాను రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో టీపీసీసీ ప్రచార కమిటీ ప్రతినిధులు పనిచేయాలని, పదేళ్ల బీఆర్ఎస్ రాక్షస పాలన, మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా కేసీఆర్, మోదీల పదేళ్ల దుర్మార్గ పాలన, రేవంత్ 100 రోజుల ప్రజాపాలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి పవన్, ప్రచార కమిటీ కో కన్వీనర్ తీన్మార్ మల్లన్న, సభ్యులు రమ్యారావు, ఆనంద్, వజీర్ ప్రకాష్ గౌడ్, దయాకర్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ బెదిరింపు రాజకీయాలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో చేరకపోతే అక్రమ దందా వ్యవహారాలు బయటపెడతామంటూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో శుక్రవారం పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ చిత్తశుద్ధితో జరగడం లేదన్నారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారులను, కాంట్రాక్టర్లను డొనేషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన పాపానికి రాష్ట్రంలో రాహుల్ గాంధీ ట్యాక్స్‌ను విధిస్తున్నారని నిందించారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పార్టీ పయనిస్తోందని, న్యాయ విచారణ పేరుతో కాళేశ్వరం దర్యాప్తును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

నా సోదరి పార్టీకి వెన్నుపోటు పొడిచింది

- బీఆర్ఎస్ కష్టాల్లో ఉన్నప్పుడు నా తండ్రి పార్టీని వీడటం బాధాకరం
- పదవులకు వారిద్దరూ రాజీనామా చేసి వెళ్లాలి
- బీఆర్ఎస్‌ను వీడను: విప్లవ్‌కుమార్




సాక్షి, హైదరాబాద్: పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అధినేత కేసీఆర్‌కు అండగా నిలవాల్సిన తన తండ్రి కె. కేశవరావు (కేకే) పార్టీని వీడటం బాధాకరమని ఆయన కుమారుడు, బీఆర్ఎస్ నేత విప్లవ్ కుమార్ పేర్కొన్నారు. పార్టీ నేత దాసోజు శ్రవణ్‌తో కలసి శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్‌ను వీడిన సమయంలో దుర్భాషలాడిన సీఎం రేవంత్‌రెడ్డి తన తండ్రిని పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. పార్టీ అధికారం కోల్పోయిన నేపథ్యంలో కేడర్‌లో ఆత్మస్థైర్యం నింపేందుకు కేకే తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని సూచించారు. అలాగే తన సోదరి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి.. పార్టీకి వెన్నుపోటు పొడిచిందని విప్లవ్ మండిపడ్డారు. ఆమెకు మేయర్ పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని గుర్తు చేశారు. తన తండ్రి, సోదరి బీఆర్ఎస్ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానంటూ తన సోదరి చేసిన వ్యాఖ్యలను విప్లవ్ తప్పుబట్టారు. కాంగ్రెస్‌లో చేరకుంటే విపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలను సీఎం అభివృద్ధి చేయరా? అని ప్రశ్నించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని... ఎట్టిపరిస్థితుల్లోనూ తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని విప్లవ్ స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి తమ కుటుంబాన్ని చీల్చుతున్నాడని తానూ ఆరోపణలు చేయగలనని పేర్కొన్నారు.

దానం.. ఆత్మగౌరవం ఇప్పుడు గుర్తుకొచ్చిందా?: దాసోజు

బీఆర్ఎస్‌లో ఆత్మగౌరవం లేదని తమ పార్టీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యానించడాన్ని ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్ తప్పుబట్టారు. ఎన్నికల ప్రచారంలో తీవ్రంగా అవమానించిన రేవంత్‌రెడ్డి దగ్గర ఆత్మగౌరవం దొరుకుతుందా? అని ప్రశ్నించారు. దానం ఎన్నోమార్లు కేసీఆర్‌కు పాదాభివందనం చేశారని, ఆయన ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఎందుకు కాళ్లు మొక్కారని నిలదీశారు. బాత్రూంలో జారిపడటంతో ఆసుపత్రిపాలైన కేసీఆర్ తాత్కాలికంగా ఉండేందుకు తన ఇళ్లను ఇచ్చేందుకు దానం ముందుకొచ్చారన్నారు. కేశవరావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్ తమ పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని దాసోజు డిమాండ్ చేశారు. లౌకికవాదం కోసమే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు దానం చెప్పడాన్ని పెద్ద జోక్‌గా ఆయన అభివర్ణించారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, బైండ్ల విజయ్‌కుమార్, నారాయణ పాల్గొన్నారు.

పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు వచ్చిన వార్తలు అవాస్తవం

ఎంపీ మాలోత్ కవిత.. సోషల్ మీడియాలో పోస్ట్



మహబూబాబాద్: మానుకోట ఎంపీ స్థానం నుంచి తాను తప్పుకుంటున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత స్పష్టంచేశారు. ఈ మేరకు శుక్రవారం పలు వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొంత మంది అగ్రనేతలు పార్టీల ఫిరాయింపుల నేపథ్యంలో మానుకోట ఎంపీ మాలోత్ కవిత ఎంపీ బరిలో నుంచి తప్పుకుంటున్నట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని కవిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె ఒక నోట్‌ను పంపారు. దాన్ని పార్టీ కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ ఎన్నికల గ్రూపు, కవిత ఫాలోవర్స్ గ్రూపుతో పాటు పలు గ్రూపులలో పోస్ట్ చేశారు. ఆ పోస్ట్‌లో 'కొట్లాట నా రక్తంలోనే ఉంది. కదన రంగంలో దూసుకెళ్లడమే నా అలవాటు. నన్ను, బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేకనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయి. ప్రజా ఆశీర్వాదంతో బీఆర్ఎస్ కార్యకర్తల బలంతో గులాబీ దళపతి కేసీఆర్ మార్గదర్శకంలో మానుకోటలో గులాబీ జెండా ఎగురవేస్తాం' అని పేర్కొన్నారు.

17 సీట్లూ మావే..

మొదటి పేజీ తరువాయి

సాధించడంపై దృష్టి పెట్టాలని అభ్యర్థులకు సూచించారు.

ప్రతీ బూత్‌కో వాట్సాప్ గ్రూప్!

ఎన్నికల మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. పోలింగ్‌బూత్‌లే కేంద్రంగా కార్యాచరణను అమలుచేస్తోంది. ఇక్కడి 17 ఎంపీ సీట్లు, వాటి పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్‌బూత్‌లే కేంద్రంగా క్షేత్రస్థాయి నుంచి పని విధానాన్ని ఖరారు చేసింది. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రతీ పోలింగ్‌బూత్‌కు ఒక వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బూత్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, బూత్ లెవల్ ఆర్గనైజర్, బూత్ కో–ఆర్డినేటర్ల నియామకం ద్వారా పోలింగ్‌బూత్ స్థాయిలో రోజువారీ కార్యక్రమాల పర్యవేక్షణ, నాయకులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అన్ని బూత్‌లలో కమిటీల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల కమిటీలు, బేటీ బచావో బేటీ పడావో కమిటీ, ఒక్కో పోలింగ్‌బూత్‌లోని ఓటర్ల సమాచారం, బూత్‌ల పరిధిలోనే ప్రతిరోజు బైక్‌లపై కార్యకర్తల పర్యటనలు, పార్టీపరంగా చేపడుతున్న పనులపై పర్యవేక్షణ వంటివి చేపట్టనున్నారు. దీంతో పాటు ఒక్కో లోక్‌సభ స్థానానికి విడిగా కాల్‌సెంటర్ ఏర్పాటు ద్వారా బూత్‌కమిటీలపై పర్యవేక్షణతో పాటు కేంద్ర పథకాల లబ్ధిదారుల నుంచి క్రమం తప్పకుండా ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించారు.

ఇక ముందూ అదే జోష్‌తో..

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల కంటే ముందుగా అభ్యర్థుల ఖరారుతో పాటు తొలి విడత ప్రచారాన్ని పూర్తి చేసిన జోష్‌ను ఇక ముందూ కొనసాగించాలని నాయకత్వం నిర్ణయించింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఇతర పార్టీల నుంచి చేరికలు, పోలింగ్‌బూత్‌స్థాయి వరకు పార్టీ కార్యక్రమాల వికేంద్రీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే ప్రధాని మోదీ రాష్ట్రంలో మొదటి విడత ఎన్నికల ప్రచారాన్ని చేయగా, మరో విడతలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్‌గడ్కరీ ఇతర ముఖ్యనేతల పర్యటనలు చేపట్టనున్నారు.

పార్టీ ఎన్నికల విభాగాలన్నీ చురుగ్గా పనిచేయాలి

బీజేపీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సూచన

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత కోసం ఏర్పాటు చేసిన 32 విభాగాలు మరింత చురుకుగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ఆదేశించింది. ప్రచారంలో అన్ని విభాగాలు వేగం పెంచాలని సూచించింది. శుక్రవారం పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ అధ్యక్షతన కమిటీ సమావేశమైంది. ఈ భేటీలో బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), దుగ్యాల ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, వివిధ విభాగాల అధ్యక్షులు జి. మనోహర్‌రెడ్డి, ఎస్. ప్రకాశ్‌రెడ్డి, కొల్లి మాధవి పాల్గొన్నారు. మరోవైపు బీజేపీ తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన అభయ్ పటేల్ శనివారం తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 17 ఎంపీ స్థానాల్లో పార్టీ పరంగా సాగుతున్న ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించనున్నారు. మెజారిటీ సీట్లు గెలిచే లక్ష్యంతో చేపడుతున్న పార్టీ కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజలు దూరమవుతున్నందునే..

పార్టీని వీడాలన్న నిర్ణయంపై కడియం శ్రీహరి

సాక్షి, హైదరాబాద్: క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్ పునాదిని కోల్పోతోందని, వివిధ కారణాలతో ప్రజలు పార్టీకి దూరమవుతున్నారని మాజీ మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌ను వీడాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్‌లో చేరడం, వరంగల్ ఎంపీగా తాను గానీ, తన కుమార్తె కావ్యగానీ పోటీచేసే విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ నేతలు తన నివాసానికి వచ్చి భేటీ అయిన అనంతరం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేదిశగా కలసి పనిచేయాలని తనను ఆహ్వానించారని.. అనుచరులు, కార్యకర్తలతో చర్చించి ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం వెలువరిస్తానని తెలిపారు. కాగా.. వ్యక్తిగత లాభం కోసం కడియంను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడంలేదని టీపీసీసీ ప్రతినిధి మల్లు రవి అన్నారు. బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలతో ప్రజలు దూరమవుతున్నారని పేర్కొన్నారు.


ప్రేమతోనే కాంగ్రెస్‌లో చేరుతున్నా..

బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని ప్రజలు అనుకుంటున్నారు: ఎంపీ కేకే

- కేసీఆర్ బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని మాట తప్పారని వ్యాఖ్య
- తెలంగాణ అభివృద్ధి, పునర్నిర్మాణంలో కేసీఆర్ పాత్ర ఎంతో ఉందని కితాబు

బంజారాహిల్స్ (హైదరాబాద్): అవకాశవాద రాజకీయాల కోసం తాను బీఆర్ ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు వస్తున్న విమర్శలు సరికావని ఎంపీ కె.కేశవరావు పేర్కొన్నారు. తన వయసు 85 ఏళ్లు అని.. 55 ఏళ్లు కాంగ్రెస్‌లో కొన సాగానని, 13 ఏళ్లు బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పారు. తనకు రాజకీయ జీవితం ఇచ్చిన కాంగ్రెస్‌పై ప్రేమతోనే మళ్లీ చేరుతున్నానన్నారు. ఇది తనకు తీర్థయాత్ర తర్వాత సొంతింటికి వస్తున్నట్టుగా ఉందన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో మొదటిసారి రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ ఓటు వేయడం వల్లే గెలిచానని, తర్వాత కేసీఆర్ తనకు మరో చాన్స్ ఇచ్చారని కేకే చెప్పారు. తన మాటకు చాలా విలువ ఇచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణను దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని.. రాష్ట్ర సాధనలో, పునర్నిర్మాణంలో ఆయన పాత్ర ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. అయితే బీఆర్ఎస్‌ను కుటుంబ పాలన నడిపిస్తోందని ప్రజలు అనుకుంటూ ఉండేవారని.. ఆ సమయంలో బాల్క సుమన్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వంటి నేతలు పార్టీని నడిపిస్తే బాగుండేదని తాను అనుకున్నానని చెప్పారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్)ను విలీనం చేస్తానని సోనియాగాంధీకి కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కష్టకాలంలో ఉందని, అందుకే తాను ఆ పార్టీలో చేరుతున్నానని చెప్పారు. బీజేపీని ఎదుర్కోవాలంటే ఇలాంటి నిర్ణయం తప్పదన్నారు. తాను గురువారం కేసీఆర్‌ను కలిశానని, తాను పార్టీని వీడుతుండటం పట్ల ఆయన బాధపడ్డారని కేకే చెప్పారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ తనను తిట్టారని కొందరు తన దృష్టికి తీసుకువచ్చారని.. దీనిని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి కొనసాగించడానికే అధికార పార్టీలోకి.: విజయలక్ష్మి



గ్రేటర్ హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధిని ఇలాగే కొనసాగించడానికి తాను అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఏమేం అభివృద్ధి పనులు కావాలో త్వరలోనే సీఎంతో మాట్లాడి చెబుతానన్నారు. తనతో పాటు 150 మంది కార్పొరేటర్ల సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. కొందరు బీఆర్ఎస్ నేతలు తన సోదరుడు, బీఆర్ఎస్ నేత విప్లవ్‌కుమార్‌ను తెరపైకి తీసుకొచ్చి తమ కుటుంబంలో కలహాలు రేపుతున్నారని ఆరోపించారు. కాగా.. సీఎం రేవంత్‌రెడ్డి శనివారం విజయలక్ష్మి నివాసానికి రానున్నట్టు తెలిసింది. సీఎం ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నట్టు సమాచారం.

డాక్టర్‌గా మారొద్దు.. మందులు రాయొద్దు

అర్హత లేకుండా వైద్యం చేయొద్దు
- సూచిక బోర్డుపై క్లినిక్, మెడికల్ సెంటర్, నర్సింగ్ హోం పేర్లు వాడొద్దు
- ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే పెట్టుకోవాలి
- ఆర్‌ఎంపీలకు స్పష్టం చేసిన వైద్య, ఆరోగ్యశాఖ

సాక్షి, హైదరాబాద్: అర్హత లేకుండా ఎవరూ వైద్యం చేయకూడదని వైద్య, ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్–2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్‌ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించింది. ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నట్లు అనేక ఆరోపణలు వస్తున్నాయని... వారి వైద్యం వల్ల కొందరు రోగులు మృతిచెందినట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపింది. కాబట్టి ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ సూచించింది. ఆర్‌ఎంపీలు తమ చికిత్స కేంద్రం ముందు సూచిక బోర్డులపై ఫస్ట్ అయిడ్ సెంటర్ లేదా ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ప్రదర్శించాలని... క్లినిక్, ఆసుపత్రి, నర్సింగ్ హోం, మెడికల్ సెంటర్ లేదా మరే ఇతర పేర్లతో సూచిక బోర్డులను ప్రదర్శించరాదని పేర్కొంది. ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు సర్కారు సూచనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఆర్‌ఎంపీలకు సూచనలివీ...
- ఆర్‌ఎంపీలు స్వయంగా రోగ నిర్ధారణ చేసి మందులు ఇవ్వడం లేదా ఇంజెక్షన్లు చేయడం వంటివి చేయరాదు.
- రోగులకు వైద్య మందుల చీటీని (ప్రిస్క్రిప్షన్) రాయకూడదు.
- రోగులకు సెలైన్ బాటిల్స్ ఎక్కించరాదు.
- ఇన్–పేషెంట్ వైద్యం చేయకూడదు, ల్యాబ్‌లను నిర్వహించరాదు.
- అబార్షన్లు, కాన్పుల వంటి హైరిస్క్ చికిత్సలు చేయరాదు.
- రోగులను ప్రలోభపెట్టి వైద్యం కోసం ఆసుపత్రులకు సిఫార్సు చేయడం లేదా బలవంతంగా పంపించడం చేయరాదు.

జాతీయ జెండాకు జై

- పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్టు, స్మారక సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పతాకం ఆవిర్భావ దినోత్సవాలు
- రేపటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహణ

లక్డీకాపూల్: 'మన జెండా పుట్టిన రోజును మనమంతా వేడుకగా జరుపుకొందాం..' అంటూ పిలుపునిచ్చారు స్త్రీ శక్తి పురస్కార గ్రహీత కె.హెచ్.ఎస్.జగదాంబ. రామ్‌నగర్‌కు చెందిన జగదాంబ మన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య గురించి ఎన్నో విషయాలు సేకరించారు. వాటిని పిల్లలకు అర్థమయ్యేలా అక్షరీకరించారు కూడా. ఈ నేపథ్యంలోనే ఆది, సోమ వారాల్లో జాతీయ జెండా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆమె 'సాక్షి'కి తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. 'పింగళి వెంకయ్య కుటుంబం అనేక ఇబ్బందులు పడుతున్న విషయం పాతికేళ్ల కిందట కాకతాళీయంగా నా దృష్టికి వచ్చింది. ఆ క్షణంలోనే అనేక ప్రశ్నలు ఉద్భవించాయి. మన దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజును, గాంధీ జయంతి, తదితర జాతీయ పర్వదినాలను వేడుకగా చేసుకుంటున్నాం. అలాగే మన దేశానికి, భారతజాతికి ప్రతీక అయిన జెండా పండుగను ఎందుకు నిర్వహించకూడదని అనుకున్నాను. అప్పటి నుంచి పింగళి వెంకయ్య జీవితంపై సమగ్రంగా అధ్యయనం చేశాను. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థను స్థాపించి ఆయన పుట్టిన రోజు ఆగస్టు 2వ తేదీ, జాతీయ పతాకం పుట్టిన రోజు మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీల్లో స్కూలు పిల్లలకు జాతీయ పతాకం ప్రాధాన్యం, పతాకం రూపుదిద్దుకున్న వివరాలను తెలియచేస్తున్నా. 2021లో జెండా పుట్టిన వందేళ్ల పండుగను ఘనంగా నిర్వహించాం. ఈ ఏడాది '103వ జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం' వేడుకలను ఈ నెల 31న అంబర్‌పేట వెంకటేశ్వర నగర్‌లోని 'పూర్ణ శాంతిశీల హోమ్స్'లో నిర్వహిస్తున్నాం. ఏప్రిల్ 1న రాంనగర్‌లోని ట్రస్ట్ హెడ్‌ఆఫీస్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశాం.'


కె.హెచ్.ఎస్.జగదాంబ

మన జెండా పుట్టింది ఇలా..

అది..1921 మార్చి 31వ తేదీ. విజయవాడ, గాంధీనగర్‌లో రెండు రోజుల అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలు గాంధీజీ అధ్యక్షతన మొదలయ్యాయి. దేశనాయకులు, రాష్ట్ర నాయకులతోపాటు జాతీయోద్యమంలో పాల్గొంటున్న దేశభక్తులు దాదాపు రెండు లక్షల మంది హాజరయ్యారు. పింగళి వెంకయ్య బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం చేసేవారు. ఆయన కూడా ఆ సమావేశాల్లో కీలక పాత్ర వహిస్తున్నారు. ఆ సమయంలో గాంధీజీ మాట్లాడుతూ 'పింగళి వెంకయ్య దేశదేశాల జాతీయ పతాకాల మీద అధ్యయనం చేసి ఉన్నారు. విద్యార్థులకు ఆయా దేశాల పతాకాల గురించి సమగ్రంగా వివరిస్తుంటారు. మన దేశం కోసం పతాకాన్ని రూపొందించే బాధ్యత ఆయనే చేపడితే బాగుంటుంది' అన్నారు. అలా అడిగిన రోజు ఏప్రిల్ 1. గాంధీజీ అడిగిన మూడు గంటల్లో పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని రూపొందించి, రంగులకు భావాన్ని, భాష్యాన్ని చెప్పారు. సభ ఆమోదం పొందడం, అధికారికంగా ప్రకటించడం కూడా అదే రోజు జరిగిపోయాయి.

గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌కు తెలంగాణదే బాధ్యత

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్

దుమ్ముగూడెం: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌కు తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులే బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పేరిట పార్టీ శుక్రవారం ఓ లేఖ విడుదల చేసింది. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్.. బీజేపీతో చేతులు కలిపి విప్లవ ప్రతి ఘాతుక కగార్ (అంతిమ దశ) ఆపరేషన్ కొనసాగిస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే ఈనెల 19న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్ పేరిట నలుగురిని హత్య చేశారని పేర్కొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు భేష్

సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీవీ నాగరత్న

భూదాన్ పోచంపల్లి: అంతర్జాతీయంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు సంప్రదాయకంగా ఉంటూ ఎంతో బాగున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ప్రశంసించారు. యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, కొండా లక్ష్మణ్ బాపూజీ కాంప్లెక్స్‌లోని వస్త్ర దుకాణాలను శుక్రవారం ఆమె సందర్శించారు. కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్లో సిల్క్ దారం తయారీ, కండెలు చుట్టడం, రంగుల అద్దకం, చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఉన్నత విద్యావంతుడైన సాయిని భరత్ సంప్రదాయ చేనేత వృత్తికి ఆధునిక సొబగులు జోడిస్తూ మరో తరానికి ఈ వృత్తిని అందిస్తున్న తీరును అభినందించారు. అనంతరం రత్నా హ్యాండ్లూమ్ షాపులో పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరలను తిలకించడంతో పాటుగా టూరిజం సెంటర్‌ను ఆచార్య వినోబాభావే, వెదిరె రామచంద్రా రెడ్డి విగ్రహాలను సందర్శించారు. ఆమె వెంట యాదాద్రి భువనగిరి జిల్లా జడ్జి జయరాజ్, న్యాయవాదులు ఉన్నారు.


ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న జస్టిస్ నాగరత్న

నేత్రపర్వం.. రథోత్సవం


ధర్మపురిలో స్వామివార్ల రథోత్సవాలు

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యఘట్టమైన రథోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహ, వేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వరులను రథాలపై ఆసీనుల్ని చేసి ఆలయం నుంచి నందికూడలి వరకు భక్తజన సందోహం మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వేడుకకు సుమారు 50 వేల మంది భక్తులు తరలి వచ్చారు.

కాంగ్రెస్‌లోకి గౌడ్ సంఘాల నేత పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్


మధుయాష్కీ, మున్షీ, పొన్నంలను గజమాలతో సత్కరిస్తున్న పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గౌడ్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, గౌడ్ హాస్టల్ మాజీ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ల సమక్షంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ మాజీ మేయర్ ఆకుల సుజాత కూడా గాంధీభవన్ వేదికగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెతో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు కూడా చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు హాజరయ్యారు.


రామాయణ కల్పవృక్షం నృత్య మహోత్సవం ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో రామాయణ కల్పవృక్షం సంగీత, నృత్య మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాలను ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనందశంకర్ జయంత్, భారతప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ శంకరానంద కళాక్షేత్ర నాట్యారంభ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కళాకారులు వక్తలు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్లాసికల్, పాపులర్, చర్చలు, వర్క్‌షాపులు, సంస్కృతం, డిజిటల్ కళలు, , పుస్తకావిష్కరణలు ఉంటాయన్నారు. 'శ్రీ రామ నామం ఎంతో రుచిరా' నృత్యాన్ని ప్రదర్శించి సందర్శకులను అలరించారు.

ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: నగరంలోని వివిధ మార్గాల్లో నడిచే ఎంఎంటీఎస్ రైళ్లను ఏప్రిల్ 2వ తేదీ వరకు రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ నిర్వహణ పనుల దృష్ట్యా సికింద్రాబాద్–లింగంపల్లి, నాంపల్లి–లింగంపల్లి రూట్‌లలో నడిచే రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రపంచమే ఓ రంగస్థలం


మల్లాది గోపాలకృష్ణను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, ఆకృతి సుధాకర్ తదితరులు

జస్టిస్ చంద్రకుమార్

వనస్థలిపురం: ప్రపంచమే ఓ రంగస్థలమని, మనమంతా అందులో పాత్రధారులమని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో వనస్థలిపురం హిల్ కాలనీలో ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లాది గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రంగస్థల నటుడిగా ప్రత్యేకతను చాటుకున్న మల్లాది గోపాలకృష్ణను సన్మానించడం అభినందనీయన్నారు. గోపాలకృష్ణ తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మార్గదర్శిగా, ఆహార్యం విభాగంలో అధ్యాపకులుగా సేవలు అందిస్తున్నారన్నారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాది శేష మాట్లాడుతూ రంగస్థల కళల విస్తృతికి గోపాలకృష్ణ చేస్తున్న కృషి ఎనలేనిదని, ఆయన ఐదు నంది అవార్డులను స్వీకరించారన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మదర్ థెరిసా ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.5 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా వేదికగా ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వృద్ధున్ని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన వృద్ధుడిని టెలిగ్రామ్ యాప్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. వారు పంపిన లింక్ ద్వారా క్యాపిటాలిక్స్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. మొదట అతను 200 డాలర్లు పెట్టుబడి పెట్టడంతో యాప్‌లో భారీగా లాభాలు చూపించారు. అదే విధంగా లాభాలు వస్తాయని నమ్మించి అతడి నుంచి విడతల వారిగా రూ.5 లక్షలు కాజేశారు. ఆ డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

జంటపై దౌర్జన్యం కేసులో నిందితుల అరెస్టు

చార్మినార్: రంజాన్ మార్కెట్‌కు వచ్చిన జంటపై దౌర్జన్యానికి పాల్పడిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సంఘటనపై ఈ నెల 26న చార్మినార్ ఎస్‌ఐ ఖలీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చార్మినార్ పోలీసులు సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. వివరాల్లోకి వెళితే. ఈ నెల 26న ఓ జంట చిన్నారితో సహా రంజాన్ మార్కెట్‌కు వచ్చారు. మక్కా మసీదు రోడ్డులోని ఫుట్‌పాత్ వద్ద నలుగురు యువకులు వారిని అడ్డుకుని మతం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో సదరు యువతి తన భర్తను కొట్టవద్దని వేడుకున్నా వారు వదిలి పెట్టలేదు. తండ్రి చేతుల్లో చిన్నారిని లాక్కునేందుకు సైతం ప్రయత్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఎస్‌ఐ ఖలీల్ ఫిర్యాదుతో చార్మినార్ పోలీసులు సుమోటో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను బార్కాస్ ప్రాంతానికి చెందిన షేక్ అయాన్ ఎలియాస్ అలీ, బాలాపూర్‌కు చెందిన సయ్యద్ ఫిర్‌దౌస్, బండ్లగూడకు చెందిన మహ్మద్ షెహబాజ్, శాలిబండకు చెందిన మహ్మద్ ఫర్హాన్‌గా గుర్తించారు. శుక్రవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్, ఎస్‌ఐ బి.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ చికిత్సలో నొప్పి నివారణ కీలకం



సాక్షి, హైదరాబాద్: కేన్సర్ చికిత్సలో నొప్పి నివారణ కీలకమని కేన్సర్ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ విజయ్ భాస్కర్ బండికట్ల అన్నారు. ఇండో–బ్రిటిష్ అడ్వాన్స్‌పెయిన్ క్లినిక్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో 'కేన్సర్ రోగుల్లో నొప్పి నివారణ–ఆధునిక పరిశోధనలు' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కేన్సర్‌తో పోరాడుతున్న వ్యక్తుల్లో నొప్పి నిర్వహణ అనేది చాలా కీలకమైన అంశమన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న పలువురు వైద్యులు, నిపుణులు, ఆంకాలజిస్టులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కేన్సర్ బాధితుల్లో అత్యధికులు తీవ్రమైన నొప్పిని అనుభవిస్తున్నారని, వ్యాధి అడ్వాన్స్ దశలో ఉన్నవారికి ఈ సమస్య ఎక్కువగా ఉంటుందన్నారు. వ్యాధి నియంత్రణలో కొత్త తరహా కియోథెరపీ పాత్ర కీలకమని, అయితే దీని వల్ల నరాలు దెబ్బతినడం, నొప్పి పెరగడం వంటి దుష్పరిణామాలు ఉంటాయని డాక్టర్ సెంథిల్ పేర్కొన్నారు.

పట్టపగలు దారి దోపిడీ

- వృద్ధుడిపై దాడి
- మెడలో గొలుసు చోరీ

సైదాబాద్: ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే ఆగంతకులు ఇప్పుడు వృద్ధులను కూడా వదలటం లేదు. సైదాబాద్‌లో రహదారిపై ఆటో కోసం వేచి ఉన్న వృద్ధుడి మెడలోని బంగారు గొలుసును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లిన సంఘటన శుక్రవారం సాయంత్రం సైదాబాద్ రహదారిపై చోటుచేసుకుంది. సైదాబాద్ పీఎస్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ కె.కొండల్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుర్మగూడ డివిజన్ సాయిలాల్‌తోటకు చెందిన బూరుగ్ల ప్రకాష్‌గౌడ్ వెల్డింగ్‌పని చేసేవాడు. శుక్రవారం సాయంత్రం అతను శంకుశ్వర బజార్‌లోని పెట్రోల్‌బంక్ వద్ద నిలుచుని ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. అప్పుడే అటుగా వచ్చిన ఆటోలో దిగిన ఖాకీ చొక్కా, నీలం ప్యాంట్ ధరించిన వ్యక్తి ప్రకాష్‌గౌడ్ వద్దకు వచ్చి అతడి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కున్నాడు. దీంతో నివ్వెరపోయిన ప్రకాష్‌గౌడ్ ఆగంతకుడి చొక్కా పట్టుకోగా అతను కాలితో తన్ని కింద పడేసి ఆటోలో ఎక్కి డ్రైవర్‌తో సహా పరారయ్యాడు. దీనిని చూసిన విద్యార్థి శ్రీకాంత్, జీహెచ్‌ఎంసీ డ్రైవర్ మనోహర్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయారు. ఆగంతకుడి దాడిలో ప్రకాష్ గౌడ్ కుడి కన్ను, ఇతర శరీర భాగాలకు గాయాలు కావడంతో ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు దోపిడికి పాల్పడిన వ్యక్తులలో ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.


గాయపడిన ప్రకాష్‌గౌడ్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఇద్దరు యువకులు నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.2 లక్షలు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ వాజిద్ అనే యువకుడు తన స్నేహితులు వినోద్, లక్ష్మణ్‌లతో కలిసి వెంగళరావునగర్ హాస్టల్‌లో ఉంటున్నాడు. వారికి అదే హాస్టల్‌లో ఉంటున్న ప్రవీణ్ అనే వ్యక్తి అనంతపురానికి చెందిన సిద్దార్థను పరిచయం చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని, అయితే అందుకు కొంత నగదు చెల్లించాలని సిద్దార్థ వారితో చెప్పాడు. దీంతో గత ఏడాది సెప్టెంబర్‌లో వినోద్ రూ.20వేలు, వాజిద్ రూ.10వేలు ప్రవీణ్‌కు పంపారు. వాటిని తీసుకుని అతను వారికి ఫేక్ ఆఫర్ లెటర్ పంపాడు. ఆ తర్వాత కూడా వారు పలు దఫాలుగా రూ.2 లక్షలు చెల్లించారు. జాయినింగ్ లెటర్ ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు సిద్దార్థను, ప్రవీణ్‌లను నిలదీయగా డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పారు. పదే పదే డబ్బులు అడగటంతో తమను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. ఉద్యోగం ఇవ్వకపోగా తమపైనే బెదిరింపులకు దిగడంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: ప్రేమ విఫలమై ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండ్లపోచంపల్లికి చెందిన సందీప్ కుషాహా (24) పెయింటర్‌గా పని చేసేవాడు. కొంతకాలంగా అతను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం సదరు యువతికి వేరే వ్యక్తితో వివాహం జరగడంతో మనస్తాపానికి లోనైన శుక్రవారం సందీప్ గుండ్లపోచంపల్లి–మేడ్చల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బాలిక దారుణ హత్య...

రాజేంద్రనగర్: ఓ బాలిక దారుణ హత్యకు గురైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జల్‌పల్లి శ్రీరాంనగర్ కాలనీకి చెందిన బాలిక కుటుంబం గతంలో అత్తాపూర్ హసన్‌నగర్ ప్రాంతంలో మోయిన్ అనే యువకుడి కుటుంబానికి చెందిన ఖాళీ స్థలంలో నివాసం ఉండేది. ఇద్దరు పిల్లల తండ్రి అయిన మోయిన్ తరుచూ సదరు బాలిక వెంట పడుతుండటంతో ఆమె కుటుంబం అక్కడ ఇల్లు ఖాళీ చేసి శ్రీరాంనగర్ కాలనీకి మకాం మర్చింది. అయినా మొయిన్ ఆమెను వేధిస్తూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమెను కాటేదాన్ ప్రాంతానికి పిలిపించాడు. అనంతరం ఆమెను కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బండరాయితో మోది హత్య చేసి అక్కడినుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం వాకింగ్ చేసేందుకు వచ్చిన స్థానికులు బాలిక మృతదేహాన్ని గుర్తించి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహన్ని మార్చురీకి తరలించారు. బాలిక తల్లిదండ్రుల ఆచూకీని గుర్తించిన పోలీసులు ఆమె తల్లిదండ్రులను విచారించగా హసన్‌నగర్‌కు చెందిన మోయిన్‌పై అనుమానం వ్యక్తం చేశారు.

వ్యవసాయ మోటార్లే టార్గెట్

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- సైబరాబాద్ పరిధిలో 18 చోరీలకు పాల్పడినట్లు గుర్తింపు

శామీర్‌పేట్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను శామీర్‌పేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, విద్యుత్ వైర్లు, వాహనాల బ్యాటరీలు చోరీకి గురవుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో శామీర్‌పేట పోలీసులు ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉప్పరిపల్లి పరిధిలోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డుపై ఆటోలో వెళుతున్న ఖాదర్, ఖయూమ్, నయీమ్, మహమ్మద్, రహీమ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 18 చోరీలకు పాల్పడ్డామని, ఇందులో శామీర్‌పేట పీఎస్ పరిధిలో 6 చోరీలు చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి ఆటో, పానర్లు, హ్యాండ్ గ్లౌజ్‌లు తదితర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.


పోలీసుల అదుపులో నిందితులు

జల్సాలకు అలవాటు పడి...

జల్సాలకు అలవాటు పడిన వీరు ముఠాగా ఏర్పడి గ్రామ శివారులోని పొలాల వద్ద బోరు మోటార్లు, వాహనాల బ్యాటరీలను చోరీ చేసి స్క్రాప్ దుకాణాల్లో విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుంటారు.

బలహీన ప్రతిపక్షమే మోదీ బలం

- సీనియర్ పాత్రికేయుడు, సీ ఓటర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఈడీ సుతను గురు



లక్డీకాపూల్ : ఎన్నో సమస్యలతో దేశ ప్రజలు సతమతం అవుతున్నది ఎంత నిజమో, ప్రజల్లోని అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోగల ప్రతిపక్షం లేకపోవడం కూడా అంతే నిజమని సీనియర్ పాత్రికేయుడు, సీ ఓటర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుతను గురు అన్నారు. 'ఇండియా టు భారత్ పేరిట' 90– రోజుల దేశయాత్ర చేస్తున్న ఆయన శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నియో సైన్స్ హబ్ – సైన్స్ అండ్ టెక్నాలజీ మాసపత్రిక, స్మార్ట్ లాబ్ టెక్ ఏర్పాటు చేసిన ప్రెస్ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుతను మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి అవకాశాలు లేవని, ప్రభుత్వోద్యోగాల ఊసే లేదన్నారు, జీవన స్థితిగతులు అస్తవ్యస్తమయ్యాయన్నారు. అయినా సగటు ఓటరు మాత్రం మళ్లీ నరేంద్ర మోదీకే మొగ్గుచూపవచ్చునని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలపై నమ్మకం లేకపోవడమే అందుకు కారణంగా పేర్కొన్నారు. తాను చేస్తున్న 'ఇండియా టు భారత్ యాత్ర' – రాజకీయాలకు అతీతం కాకపోయినా.. రాజకీయ నాయకులకు మాత్రం ఎంతో దూరమన్నారు. 60 రోజులుగా కొనసాగుతున్న ఈ యాత్రలో ఒక్క రాజకీయనాయకుడిని కూడా కలవలేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని సామాన్యుడి ఆలోచనలు తెలుసుకుంటూ, అభిప్రాయాలు పంచుకుంటూ, ఆకాంక్షల్ని అర్థం చేసుకోవడమే తన యాత్ర ఉద్దేశమన్నారు. ఏ పార్టీ అవినీతికి అతీతం కాదనే స్పష్టత ప్రజలందరికీ ఉందని.. అవినీతి ఎన్నికల్లో అంశం కావడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక అవసరాలు తీర్చే నాయకులకే ఓట్లు వేసుకునే చైతన్యం ప్రజల్లో వచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు ఉత్తరాదికి కొత్తే అయినా, దక్షిణాది రాష్ట్రాల్లో ఎప్పటి నుంచో ఉన్నందున మోదీ సంక్షేమ పథకాల మంత్రం దక్షిణాది రాష్ట్రాల్లో పనిచేయడం లేదన్నారు. ఎన్ ఎస్ హెచ్ – మీడియా ఏర్పాటు చేసిన సమావేశంలో తన అనుభవాలు పంచుకునేందుకు అంగీకరించిన సుతనుకి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట సత్యప్రసాద్ పోతరాజు కృతజ్ఞతలు తెలిపారు. నవతరానికి సైన్స్ అండ్ టెక్నాలజీ పట్ల ఆసక్తిని కల్పిస్తూ, వారిలో శాస్త్రీయ భావాలని పెంపొందించాలనే ఆదర్శంతోనే నియో సైన్స్ హబ్ మీడియాను స్థాపించామన్నారు. సమావేశానికి సీనియర్ పాత్రికేయుడు, రచయిత, రాకా సుధాకర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఎన్ ఎస్ హెచ్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సుబ్రమణియన్ అయ్యర్ తొలిపలుకులతో మొదలైన ఈ సమావేశం, రెష్మీ కుమారి వందన సమర్పణతో ముగిసింది.

విశ్వరూపుడు, సర్వజ్ఞుడు, సర్వధారి, జ్యోతిర్మయుడు,
అద్వితీయుడు అయిన సహస్ర కిరణ సూర్యుడే వందలు,
వేల రీతుల్లో చరిస్తూ, సమస్త జీవులకు జీవనప్రదాతగా ఉదయిస్తుంటాడు.
– ప్రశ్నోపనిషత్తు

సాక్షి
శనివారం, 30 మార్చి 2024

నిందలూ... నిజాలూ

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు ఉదంతంపై అంతర్జాతీయంగా వచ్చిపడుతున్న వ్యాఖ్యానాలు, విమర్శలు ఇప్పట్లో ఆగేలా లేవు. తాజాగా ఐక్యరాజ్యసమితి ప్రకటనతో ఈ సంగతి రుజువవుతోంది. మొదట జర్మనీ, ఆ తర్వాత అమెరికా చేసిన వ్యాఖ్యానాలపై మన దేశం ప్రతిస్పందిస్తుండగానే ఐక్యరాజ్యసమితి అధికార ప్రతినిధి సైతం కేజ్రీవాల్ కేసులో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించటం సాధారణ విషయం కాదు. పైగా ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్త గ్లోరియా బెర్బేనాను విదేశాంగ శాఖ కార్యాలయానికి పిలిపించి మన అసంతృప్తిని, అభ్యంతరాన్ని తెలియజేసి 24 గంటలు గడవకుండానే రెండోసారి కూడా కేజ్రీవాల్ కేసులో అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. దాంతోపాటు కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయటాన్ని కూడా ప్రస్తావించింది. ఇక అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటన సరేసరి. అన్నిటికీ అతీతమని భావించుకునేవారు సైతం అనుకోకుండా వచ్చిపడే పొగడ్తలకు లోలోన సంతోషపడకుండా వుండలేరు. అలాగే విమర్శలొచ్చినప్పుడూ, తప్పును ఎత్తిచూపినప్పుడూ పౌరుషం పొడుచుకురావటం కూడా సహజం. పాశ్చాత్య దేశాలు అవసరార్థమో, అనివార్య పరిస్థితుల్లోనో మన దేశాన్ని ప్రశంసలతో ముంచెత్తిన ఉదంతాలు కోకొల్లలు. అయితే వాటినుంచి వచ్చే విమర్శలు అలా కాదు. అవి అరుదే కావొచ్చుగానీ ఆలోచించదగినవి. ఇందిరాగాంధీ దేశంలో ఆత్యయిక పరిస్థితి ప్రకటించి దేశాన్నే జైలుగా మార్చినప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు చెలరేగాయి. అనంతరకాలంలో మేధావులనూ, పౌరహక్కుల సంస్థల నేతలనూ అరెస్టు చేసిన సందర్భాల్లో పాశ్చాత్య ప్రపంచం స్పందించకపోలేదుగానీ... ఇప్పుడు కేజ్రీవాల్ అరెస్టుపై వెలువడుతున్న స్పందన తీవ్రత అధికం.

ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల ద్వారా ఏర్పడే ప్రభుత్వాలకూ, అవి ప్రాతినిధ్యం వహించే రాజ్యాలకూ అంతర్జాతీయంగా ఆమోదనీయత, విశ్వసనీయత వుంటాయి. అయితే అసమ్మతి విషయంలో వాటి వైఖరి ఎలావుందన్నదాన్నిబట్టి ఆ ప్రభుత్వాల నైతిక స్థితి నిర్ణయమవుతుంది. దాన్ని పొందాలంటే సంయమనం పాటించటం, విమర్శలను హుందాగా స్వీకరించటం, పాలనలో పారదర్శకంగా వుండటం అవసరమవుతాయి. అగ్రరాజ్యాలు అన్నాయని కాదుగానీ, మన దేశంలో అంతా సవ్యంగానే వున్నదని భావించగలమా? కేజ్రీవాల్ అరెస్టు వ్యవహారమే తీసుకుంటే దాదాపు రెండేళ్లనుంచి మద్యం కుంభకోణం గురించీ, అందులో కేజ్రీవాల్‌తోపాటు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేరు వినిపిస్తూనే వుంది. కానీ తనను తక్షణం విడుదల చేయాలన్న కేజ్రీవాల్ వాదనకు జవాబిచ్చేందుకు మూడు వారాల వ్యవధి కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) న్యాయస్థానాన్ని కోరటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయన వాదనను పూర్వపక్షం చేసే పకడ్బందీ ఆధారాలు ఆ సంస్థ వద్ద ఉంటే వాటిని న్యాయస్థానం ముందుంచి ఈ కారణాల రీత్యా కేజ్రీవాల్ వాదన చెల్లదని వెనువెంటనే చెప్పలేని స్థితిలో వుండటం ఈడీ తీరుతెన్నులపై అనుమానాలు రేకెత్తించదా? అమాత్య మనీశ్ సిసోడియా విషయంలోనూ ఇలాగే జరిగింది. ఆయనపై అప్రూవర్‌లు ఇచ్చిన ప్రకటనలు మినహా తమ వద్ద వేరే ఆధారాల్లేవని సుప్రీంకోర్టు ముందే ఆ సంస్థ అంగీకరించింది. ఇప్పుడు కేజ్రీవాల్ ఆ అంశంపైనే నిలదీస్తున్నారు. ఒక ముఖ్యమంత్రిపై ఎవరో ఆరోపణలు చేస్తే కేవలం వాటి ఆధారంగా అరెస్టు చేయటం సబబేనా అని న్యాయస్థానం ముందు వినిపించిన వాదనల్లో ఆయన ప్రశ్నించారు. దేనికైనా సమయం, సందర్భం చూసుకోవాలంటారు. ఒకపక్క సార్వత్రిక ఎన్నికలు ముంగిట్లో వున్నాయి. అన్ని పార్టీలూ తమ తమ సత్తా చాటేందుకు పొత్తులు ఖరారు చేసుకుని వ్యూహరచనలో మునిగాయి. ఇలాంటి సమయంలో విపక్ష కూటమి అధినేతను అరెస్టు చేయటం విమర్శలకు ఆస్కారమిస్తుందని తెలియనంత అమాయకత్వంలో ఈడీ వున్నదంటే నమ్మలేం. మరో మూడు నాలుగు నెలలు ఆగితే ఇందులో కొంపమునిగేది ఏముందన్న ప్రశ్నకు ఆ సంస్థ దగ్గర జవాబులేదు. నేరం నిరూపణయ్యేవరకూ నిందితుడు నిర్దోషేనని న్యాయశాస్త్రం చెబుతుంది. అలాగే అసాధారణ పరిస్థితుల్లో తప్ప నిందితులను జైలుకు పంపరాదని ఇటీవల సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కింది కోర్టులకు హితవు పలికారు. పౌరులకు రాజ్యాంగం కల్పించే ఈ రక్షణలను విస్మరించటం, నీరు కార్చటం బాహాటంగా కనిపిస్తుంటే విమర్శలు రావా? మన దేశంలో ఇప్పటికీ ఇతర వ్యవస్థలతో పోలిస్తే న్యాయవ్యవస్థకు విశ్వసనీయత అధికం. దాన్ని మరింత పెంచేలా ప్రభుత్వ విభాగాల వ్యవహారశైలి వుండాలి. దానికి విఘాతం కలిగితే పాలకపక్షం సంగతలావుంచి దేశ పరువుప్రతిష్ఠలకే భంగం వాటిల్లుతుంది.

అమెరికా రెండోసారి కూడా అన్నదనో, జర్మనీ విమర్శించిందనో, ఐక్యరాజ్యసమితి సైతం మాట్లాడిందనో కాదు... చట్టం ముందు పౌరులంతా సమానమన్న రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరిస్తున్నామా లేదా అన్న అంశంలో ఆత్మవిమర్శ చేసుకోక తప్పదు. సహ ప్రజాస్వామిక దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం విషయంలో బాధ్యతతో మెలగాలనీ, దాన్ని విస్మరించటం సరికాదనీ మన విదేశాంగ శాఖ హితవు పలికింది. కానీ మానవహక్కుల ఉల్లంఘనల అంశంలో మనం కూడా వేరే దేశాల తీరుతెన్నులను విమర్శించిన సందర్భాలున్నాయని గుర్తించాలి. మనం అన్ని విషయాల్లోనూ సక్రమంగానే వున్నామన్న భావన ఇంటా బయటా కలగజేయటం ప్రభుత్వ బాధ్యత. దానికి భిన్నమైన పరిస్థితులుంటే అవి ఎందుకు తలెత్తాయో సమీక్షించుకోవటం అవసరం.

స్వేచ్ఛా మార్కెట్ పరిష్కారం కాదు!

విశ్లేషణ



దేవీందర్ శర్మ

గతేడాది కనీసం 65 దేశాలలో రైతులు నిరసనలు చేపట్టారు. ఖండాంతరాలలో జరిగిన ఈ నిరసనలు ప్రధానంగా పంటల ధరలు, అధిక ఉత్పత్తి వ్యయం, చౌకైన దిగుమతులు, ప్రోత్సాహకాల ఉపసంహరణ, స్థానిక సమస్యలకు వ్యతిరేకంగా సాగాయి. నిజానికి వ్యవసాయ సంక్షోభం కొనసాగడానికి స్వేచ్ఛా మార్కెట్లే కారణం. మార్కెట్లకు విజ్ఞత ఉంటే, రైతులు నష్టపోవడానికి కారణమే లేదు. ఆర్థిక వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉందో చెప్పడానికి రైతుల నిరసనలు నిదర్శనం. చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అనేది భారతీయ రైతులకే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాగుదారులకు కూడా అనుసరణీయ మార్గం. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా పేదరికంలో ఉంచిన ఆర్థిక రూపకల్పనను సమూలంగా సరిదిద్దడానికి ఇదే సమయం.

భారతదేశంలో, ఐరోపాలోని కొన్ని ప్రాంతాల్లో రైతుల తిరగబడటాన్ని ప్రపంచం గమనిస్తోంది. 2023 జనవరి నుండి కనీసం 65 దేశాలలో రైతులు నిరసనలు చేపట్టారు. కనీవినీ ఎరుగని నిరసనల వెల్లువ వెనుక కారణాలు వేరువేరుగా ఉన్నప్పటికీ, వాటన్నింటినీ కలిపే సాధారణ సూత్రం ఒకటే: నియంత్రణ లేని మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వైఫల్యం.

రైతులు తమ అసంతృప్తిని వెళ్లగక్కేందుకు ఉపయోగించే పదాలు ఒక దేశం నుండి మరొక దేశానికి భిన్నంగా ఉండవచ్చు. కానీ అంతర్లీన సందేశం ఒకటే: వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో మార్కెట్లు విఫలమయ్యాయి. భారతదేశ రైతులు కనీస మద్దతు ధరను చట్టబద్ధమైన హక్కుగా కోరుకుంటుండగా, యూరోపియన్ రైతులు తమ ఉత్పత్తులకు సరైన విలువను డిమాండ్ చేస్తున్నారు. కెన్యాలో బంగాళదుంపల ధర పతనం, నేపాల్‌లో కూరగాయల ధరలు తక్కువగా ఉండటంతో పాటు జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియంతో సహా యూరప్‌లోని అనేక దేశాలలో ఉత్పత్తి వ్యయం పెరగడం, చౌక దిగుమతులు, ఉత్పత్తి ధరలు పడిపోవడాన్ని కూడా నిరసనలు హైలైట్ చేశాయి.

స్పెయిన్‌లోని రైతులు నాలుగు లక్షల లీటర్ల పాలను వీధుల్లో పారబోశారు. మలేషియా సాగుదారులు తక్కువ వరి ధరలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఫ్రాన్స్‌లో, అధ్యక్షుడు మాక్రాన్‌తో ఇటీవల జరిగిన సమావేశంలో చిన్న రైతుల ప్రముఖ సంస్థ అయిన 'కాన్ఫెడరేషన్ పేసన్'... రైతులకు సామాజిక రక్షణ కల్పించడంతో సహా హామీ ఇవ్వబడిన వ్యవసాయ ధర కంటే తక్కువ ధరకు కొనుగోళ్లను అనుమతించకూడదనే వాగ్దానాన్ని కోరింది. వాణిజ్య సరళీకరణను కూడా రైతులు వ్యతిరేకించారు.

జర్మనీ, ఫ్రాన్స్, రొమేనియా, ఇటలీ, పోలాండ్‌లలో రైతులు ఉక్రెయిన్ నుండి వచ్చే చౌక దిగుమతులకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించారు. పైగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను సమీక్షించాలని కోరుతున్నారు. వారు హైవేలను అడ్డుకున్నారు, దిగుమతి చేసుకున్న వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళుతున్న ట్రక్కులను నిలిపివేశారు, చాలా చోట్ల దిగుమతి చేసుకున్న ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. ఫ్రాన్స్‌లో, చౌకైన చేపల దిగుమతులకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, మత్స్యకారులు ఓడరేవుల వద్ద నిరసన తెలిపారు. ఇది వ్యవసాయ జీవనోపాధిని నాశనం చేస్తుందని వారు చెప్పారు. భారతదేశం విషయానికి వస్తే, ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ వైదొలగాలని నిరసన తెలుపుతున్న రైతులు తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.

'డౌన్ టు ఎర్త్' మ్యాగజైన్ సంకలనం ప్రకారం, యూరప్‌లోని 24 దేశాలు రైతు నిరసనలను ఎదుర్కొంటుండగా, ఆఫ్రికాలో 12, ఆసియాలో 11, దక్షిణ, ఉత్తర, మధ్య అమెరికాల్లో ఎనిమిదేసి దేశాలు,



యూరప్‌లో రైతుల నిరసన ప్రదర్శన

ఓషియానియాలో రెండు దేశాలు గత సంవత్సరం రైతు ప్రదర్శనల వల్ల ప్రకంపించిపోయాయి. ఐరోపాలో, స్వతంత్ర పాన్-యూరోప్ మీడియా నెట్‌వర్క్ అయిన 'యూరాక్టివ్' 2024 జనవరి-ఫిబ్రవరిలో తాజా దశ నిరసనలపై చేసిన అధ్యయనం... రైతులకు న్యాయమైన, లాభదాయకమైన ధర కోసం బలమైన డిమాండ్ ఉంటోందని తెలిపింది. ప్రధానంగా ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ నుండి ఈ డిమాండ్ వెలువడింది. బెల్జియం రైతులు ఆహార గొలుసు విధానంలో కూడా రక్షణ కోరుకుంటున్నారు. నికర సున్నా ఉద్గారాలను సాధించే ప్రయత్నంలో యూరోపియన్ కమిషన్ విధించడానికి ప్రయత్నిస్తున్న కఠినమైన పర్యావరణ నిబంధనలపై కూడా వారి కోపం నిర్దేశితమైంది.

వ్యవసాయ రంగంపై వాణిజ్య ప్రభావం యూరోపియన్ యూనియన్ రైతులకు ఆందోళన కలిగిస్తోంది. జర్మన్ రైతుల ప్రదర్శనలు... వ్యవసాయ వాహనాలకు ఇంధనంపై పన్ను మినహాయింపులను ఉపసంహరించుకోవడం గురించి సాగాయి (దీనిని జర్మనీ దశలవారీగా రద్దు చేయడానికి అంగీకరించింది); 'నైట్రేట్ డైరెక్టివ్' లాంటి కఠినమైన పర్యావరణ నిబంధన లతోపాటు తక్కువ ధరలను భర్తీ చేయడానికి ప్రోత్సాహకాల డిమాండ్‌పై దృష్టి సారించాయి. సారాంశంలో, ఖండాంతరాలలో జరిగిన ఈ నిరసనలలో చాలా వరకు ప్రధానంగా పంటల ధరలు, అధిక ఉత్పత్తి వ్యయం, చౌకైన దిగుమతులు, ప్రోత్సాహకాల ఉపసంహరణ, స్థానిక సమస్యలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

వ్యవసాయాన్ని మార్కెట్ల చేతుల్లోకి వదిలేయడం వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరగలేదు. ప్రపంచవ్యాప్తంగా రైతుల నిరసనలే ఇందుకు నిదర్శనం. ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు ఉద్దేశపూర్వకంగా ఆహార ధరలు తక్కువగా ఉండేలా చూసుకున్న ఆధిపత్య ఆర్థిక ఆలోచనకు భారతీయ వ్యవసాయం బలయ్యింది. ఇది కాలం చెల్లిన విధానం. మారుతున్న వాస్తవాలకు అనుగుణంగా ఆర్‌బీఐ తన స్థూల ఆర్థిక విధానాలను పునఃసమీక్షించే సమయం ఆసన్నమైంది. 2022-23 గృహ వ్యయ సర్వే ప్రకారం, ప్రతి కుటుంబం మీద గృహం, ఆరోగ్యం, విద్యపై నిరంతరం పెరుగుతున్న వ్యయంతో భారం పడినప్పటికీ, ఆహారంపై ఖర్చు గణనీయంగా తగ్గింది.

కఠినమైన స్థూల ఆర్థిక నియంత్రణ నుండి వ్యవసాయ ధరలకు అవసరమైన దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను నొక్కిచెప్పిన క్షణం, దానికి బలమైన వ్యతిరేకత వస్తుంది. 'ఇది అధిక ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది, తద్వారా మార్కెట్ వక్రీకరణలు జరుగుతాయని మేము హెచ్చరించాము' అంటూ గ్యారెంటీ ధర కావాలని రైతులు పునరుద్ఘాటించినప్పుడల్లా విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఒక కార్పొరేట్ వైఫల్యం ఫలితంగా కోవిడ్ మహమ్మారి సంవత్సరాల్లో ద్రవ్యోల్బణం 57 శాతం పెరిగి, 2023లో 53 శాతం చుట్టూ చేరినప్పుడు మాత్రం అదే ఆర్థిక ఆలోచన స్పష్టంగా నిశ్శబ్దంగా ఉంది.

వ్యవసాయ ధరలను స్థిరీకరించడానికి అనేక దశాబ్దాలుగా అనేక ప్రోత్సాహకాలు, దేశీయ మద్దతు యంత్రాంగాలు ప్రయత్నించినప్పటికీ, వాస్తవికత ఏమిటంటే వ్యవసాయ కష్టాలు ప్రపంచవ్యాప్తంగా మరింత తీవ్రమవుతున్నాయి. వ్యవసాయంలో మార్కెట్ సంస్కరణలు అరువు తెచ్చుకున్న అమెరికాలో కూడా స్వేచ్ఛా మార్కెట్ రూపకల్పన అనేది చిన్న రైతులను వ్యవసాయం నుండి ఎలా బయటకు నెట్టిందో, వారిని కష్టాల బాటలో ఎలా వదిలివేసిందో, పొలంలో విధ్వంసాన్ని ఎలా సృష్టించిందో 'నాసా' మాజీ శాస్త్రవేత్త వేదవ్రత పెయిన్ దర్శకత్వం వహించిన 'డెజా వు' డాక్యుమెంటరీ చూపిస్తుంది.

కాబట్టి స్వేచ్ఛా మార్కెట్ పరిష్కారం కాదు. నిజానికి వ్యవసాయ సంక్షోభం కొనసాగడానికి ఇదే కారణం. మార్కెట్‌లకు విజ్ఞత ఉంటే, సమర్థతకు ప్రతిఫలమివ్వగలిగితే, వ్యవసాయం నష్టపోయే ప్రతిపాదనగా ఉండటానికి కారణమే లేదు. ఆర్థిక వ్యవస్థ ఎంత లోప భూయిష్టంగా ఉందో చెప్పడానికి ప్రపంచవ్యాప్తంగా రైతుల నిరసనలు నిదర్శనం. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా పేదరికంలో ఉంచిన ఆర్థిక రూపకల్పనను సమూలంగా సరిదిద్దడానికి ఇది సమయం. చట్టబద్ధమైన కనీస మద్దతు ధర అనేది భారతీయ రైతులకు మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాగుదారులు అందరికీ వర్తించే మార్గం. మార్కెట్లు తదనుగుణంగా సర్దుబాటు అవుతాయి.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ-మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రభువు వల్లే విలువ



మన ఉనికికి విలువను కేవలం ప్రభువు మాత్రమే ఇవ్వగలడు. సిలువ నుంచి ఆయన ప్రతిరోజూ ఇది చెబుతాడు: ఆయన దృష్టిలో మనం ఎంత విలువైనవాళ్లమో చూపేందుకే ఆయన మనకోసం మరణించాడు. ఏ అవాంతరమూ, వైఫల్యమూ కూడా మృదువైన ఆయన ఆలింగనాన్ని అందకుండా చేయలేదు.

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మతగురువు

దారుణ వసూళ్లు



రామ మందిరాన్ని దర్శించడానికి వస్తున్న భారీ జనానికి తగిన ఆతిథ్యం ఇవ్వలేనంత చిన్న ప్రదేశం అయోధ్య. ఒక రాత్రికి రూ.1,500 విలువ కూడా చేయని అతి మామూలు హోటళ్లు కూడా 11,000 వసూలు చేస్తున్నాయి. ఆలయానికి దగ్గరగా ఉండటమే ఇక్కడి ఏకైక సౌకర్యం. అయినప్పటికీ ఇది స్కామే!

– మోహన్ సిన్హా, వ్యాఖ్యాత

ఒప్పుకొందాం!



పాకిస్తాన్ పట్ల ఇండియా కఠిన వైఖరి గురించి పాకిస్తాన్‌లో కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. కశ్మీర్ విద్రోహం(1989- 2019), కార్గిల్ (1999), పార్లమెంట్ దాడి (2001), ముంబయి తీవ్రవాద దాడి (2008), ఇంకా ఇలాంటి ఎన్నోవాటి ఫలితం ఇది. దీన్ని ముందు అంగీకరిస్తే చర్చ నిజాయితీగా, సాఫీగా సాగుతుంది.

– హుసేన్ హక్కానీ, పాక్ మాజీ రాయబారి

వదిలేద్దురూ!



మోదీ అత్యంత ప్రజాదరణతో కొనసాగుతున్నారు. 2019లో బీజేపీ నెగ్గిన చాలా రాష్ట్రాల్లో అదే ఫలితం తిరిగిరానుంది. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో పార్టీ ఎటూ రాణిస్తుంది. అలాంటప్పుడు అధికారాన్ని దుర్వినియోగం చేయడం అవివేకం. గణతంత్రానికి జరిగే నష్టాన్ని తిరిగి పూడ్చడం చాలా కష్టం.

– ఆకార్ పటేల్, కాలమిస్ట్

అంతటా ఇలాగేనా?



ఉచిత సర్వీస్ కాబట్టి గూగుల్ మ్యాప్స్ మీద ఫిర్యాదు చేయకూడదు. కానీ బ్రిటిష్ రోడ్ల మీద అది రోజూ ఓడిపోతుంటుంది. మతివున్నవాడు ఎవరూ ఎంపిక చేసుకోని దారిని తరచూ చూపుతుంటుంది.

– పాల్ గ్రాహమ్, సైంటిస్ట్

ఇన్ బాక్స్

నిర్వాసితులను ఆదుకోవాలి!

గత ప్రభుత్వం 'లిఫ్ట్ ఇరిగేషన్' పేరుతో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్, గౌరవెల్లి ప్రాజెక్ట్ వంటివాటిని నిర్మించింది. అయితే ముంపు గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం మరచిపోయింది. నష్టపరిహారం ఇచ్చే విషయంలో వివక్షకు ఆస్కారం ఇచ్చింది. ఫలితంగా నిర్వాసితుల అగచాట్లకు అంతేలేకుండా పోయింది. చాలా సందర్భాల్లో 'నిర్వాసితులు చేసిన త్యాగం వెలకట్టలేనిది. వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని ముఖ్యమంత్రి నుంచి అధికార్లవరకూ అందరూ అన్నారు. కాని, నిర్వాసితులకు న్యాయంగా రావాల్సిన పరిహారాలను అడిగితే ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు వారి ఆస్తి నుండి వాటా అడిగినట్లుగా ఇప్పటికీ అవమానిస్తున్నారు. ఇప్పటికీ నిర్వాసిత ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

మల్లన్న సాగర్ కోసం భూములను 2016 లో సేకరించిన ప్రభుత్వం ఇప్పటికీ నిర్వాసితులకు చెల్లింపులు జరపలేదు. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల భూమిని సేకరించి నాలుగు రిజర్వాయర్లను కట్టించారు. అందులో మల్లన్న సాగర్ కింద 14 గ్రామాలు, కొండపోచమ్మ కింద నాలుగు గ్రామాలు, గౌరవెల్లి ప్రాజెక్టు కింద 4 గ్రామాలు, రంగనాయక సాగర్ కింద ఒక గ్రామం మునిగిపోయాయి. దాదాపు 10 వేల కుటుంబాలకు న్యాయంగా రావలసిన నష్టపరిహారం ఇవ్వకుండానే గత ప్రభుత్వం బలవంతంగా పోలీసులను పెట్టి వారి ఊర్లను ఖాళీ చేయించింది. ఇప్పటి కూడా ఆయా ముంపు గ్రామాల ప్రజలపై కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. అంతేకాకుండా రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్‌ల కోసం తీసుకున్న భూములకు ఎకరాకు 12 లక్షల రూపాయల చొప్పున చెల్లించి, మల్లన్న సాగర్‌కి చెందిన భూములకు మాత్రం ఎకరాకు 6 లక్షల రూపాయలు మాత్రమే ప్రభుత్వం ఇచ్చింది. భూమి విలువను సగానికి సగం తక్కువ చేసి ఇచ్చి మల్లన్న సాగర్ నిర్వాసితులకు అన్యాయం చేసింది.

అన్ని రిజర్వాయర్ల నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీలు, ఇండ్లు, ఇంటి వెనకాల ఉన్న భూములకు ఇంకా పరిహారం రావాల్సి ఉంది. నష్టపరిహారం రాక కొంతమంది మతిస్థిమితం కోల్పోయి వివిధ ప్రదేశాల్లో చనిపోయారు. కొంతమంది యువకులు మద్యానికి బానిస అయ్యారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పరిధిలో నిర్మించిన ఆర్‌ఆర్ కాలనీలో గుడి, బడి, శ్మశానవాటిక కూడా ఇప్పటికీ నిర్మించ లేదంటే అతిశయోక్తి కాదు.

2016 జులైలో ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో రెండు రోజులు ముంపు గ్రామాలకు సంఘీభావంగా ఆనాటి టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, రెండు పంటలు పండే భూములను తీసుకోవద్దనీ, ఒకవేళ ప్రభుత్వం గనుక భూములను తీసుకుంటే బహిరంగ మార్కెట్ ధరలు ప్రతి ఎకరానికి ఇవ్వాలనీ నిరాహారదీక్ష చేశారు. కాబట్టి అన్ని ముంపు గ్రామాల బాధితుల బాధలన్నీ ముఖ్యమంత్రికి తెలుసు కాబట్టి ఇప్పటికైనా న్యాయంగా రావలసిన పూర్తి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. అట్లనే ముంపు గ్రామాల ప్రజల పైన పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలనీ, అన్ని ముంపు గ్రామాల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనీ వేడుకొంటున్నారు.

– పులి రాజు, సామాజిక కార్యకర్త | 99083 83567

కాలం చెల్లిన బాబు నమూనా

అభిప్రాయం




అడుసుమిల్లి జయప్రకాష్

ఫ్రెంచ్ వనిత డా॥ డెలాల్ బెన్బాబాలి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సోషల్ జాగ్రఫీ – ఆంత్రోపాలజీ స్కాలర్. ఆమె – 'క్యాస్ట్ డామినెన్స్ అండ్ టెరిటరీ ఇన్ సౌత్ ఇండియా: అండర్‌స్టాండింగ్ కమ్మాస్ సోషియో-స్పేషియల్ మొబిలిటీ' అంశంపై పరిశోధన చేశారు. ఆమె తన పరిశోధనలో ప్రధానంగా దృష్టి పెట్టిన అంశం ఆసక్తికరమైనది. ఒక భూభాగంపై ఆధిపత్యం చలాయించే విషయంలో జనాధిక్యత ఉండే కులాలకూ, ఆధిపత్య కులాలకూ మధ్య ఉండే వ్యత్యాసాన్ని బహిర్గతం చేసే ప్రయత్నం చేశారామె. 'హైదరాబాద్ నగరంలో ఆంధ్ర కల్చర్ విస్తరించడంలో కొత్తగా వలస వచ్చినవారి పాత్ర,' 'సామాజిక ఊర్ధ్వ చలనానికి దోహదం చేస్తున్న వలసలు' వంటి మరో రెండు పరిశోధనా పత్రాలను కూడా గమనిస్తే వాటిల్లో 'కామన్'గా కనిపిస్తున్న అంశాలు మూడు ఉన్నాయి. అవి – భూమి, వలసలు, ఆధిపత్యం.

ఈ అంశాలను, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అన్వయించడం జరిగింది. ఆమె విదేశీ స్కాలర్ కనుక ఆమెకు ఇక్కడి రాజకీయాలు, కులాల విషయంలో ఇష్టాయిష్టాలకు ఆస్కారం లేదు. పైగా ఆమె పరిశోధనా వ్యాసాలు 2010కి ముందు కాలం నాటివి. కనుక ఆమె సూత్రీకరణలలోని నిజాయతీని అనుమానించడానికి ఆస్కారం కనిపించదు. అయితే, ఆమె తన మొత్తం పరిశోధనను – 'ఆధిపత్యం' వద్దకు తెచ్చి ఒక ముగింపు ఇవ్వడం, అందుకు ఆమె తీసుకున్న ఉదాహరణను ముందుగా మనం గుర్తించాలి.

ఆంధ్ర ప్రాంతం నుంచి వలసవచ్చిన చంద్రబాబు కులస్థులు హైదరాబాద్ నగరానికి పశ్చిమాన జూబ్లీ హిల్స్–కూకట్ పల్లికి మధ్య ఉన్న భూములను ఆవాసాలుగా చేసుకుని స్థిరపడ్డారు. దాంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఆ ప్రాంతంలో 'రియల్ ఎస్టేట్' వ్యాపారాన్ని ప్రోత్సహించి, దాన్ని 'సైబరాబాద్' అంటూ వారు ప్రయోజనం పొందే వ్యూహాన్ని అమలు చేశారు. అతని వ్యూహం మేరకు అది విజయవంతం అయినప్పటికీ, హైదరాబాద్ నగరమే కాకుండా తెలంగాణ జిల్లాల్లో కూడా స్థానికులు వీరి 'ఆధిపత్యాన్ని' ప్రశ్నించడంతో రాష్ట్ర విభజన జరిగింది. దాంతో ఏపీ సీఎంగా చంద్రబాబు మళ్ళీ అదే పాత 'సైబరాబాద్' వ్యూహాన్ని ఈసారి – 'రాజధాని అమరావతి' పేరుతో ఇక్కడ అమలుకు తెర



తీశారు.

బాబు దాని కోసం, భారత ప్రభుత్వం నియమించిన 'శివరామ కృష్ణన్ కమిటీ' నివేదికను సైతం పక్కనపెట్టి, అందుకు 'ఎన్డీయే'లో టీడీపీ భాగస్వామ్యాన్ని అడ్డంగా వాడుకున్నారు. అమరావతి భూమి పూజకు 2016లో వచ్చిన నరేంద్రమోదీ ఆ తర్వాత, బాబు ఏపీ తన సొంత జాగీరు అన్నట్టుగా, విదేశీ కంపెనీలతో నిర్మాణ ఒప్పందాలు, 'అమరావతి' భూముల్లో వాటాలు ఇచ్చినా, ఏనాడూ ఇక్కడ జరుగుతున్నది ఏమిటి? అని అడిగింది లేదు.

బాబు నిజంగా 'విజనరీ' అయితే, కొత్త రాష్ట్రం అభివృద్ధి కోసం మొదటి ఐదేళ్లలో పూర్తి చేయగలిగిన 'ప్లాన్' మాత్రమే అమలు చేయాలి. అదే జగన్ మోహన్ రెడ్డి విషయంలో చూడండి. అన్ని ఆర్థిక స్థాయిల్లోని వర్గాలకు 'సంక్షేమం' అందిస్తూనే, రెండున్నర ఏళ్ళ 'కరోనా' కాలాన్ని దాటి, తీరాంధ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టి 16 వేల కోట్ల రూపాయలతో 4 పోర్టులు, రూ. 3,793 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ లేండ్ సెంటర్లు నిర్మిస్తున్నారు. అలా శ్రీకాకుళం నుంచి చిత్తూరు సరిహద్దు వరకు సముద్ర తీరం వెంట సహజ ప్రకృతి వనరుల అభివృద్ధికి పెట్టుబడుల్ని వికేంద్రీకరించడం వల్ల; భవిష్యత్తులో 'భూమి' దాని సొంతదారు 'ఆధిపత్యం' వంటివి ఇక ముందు లేకపోగా, 'వలసలు' కూడా ఇకముందు తగ్గుతాయి.

డా॥ డెలాల్ బెన్బాబాలి తన పరిశోధనా వ్యాసాల్లో ప్రస్తావించిన – భూమి, వలసలు, ఆధిపత్యం అంశాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ తన తొలి టర్మ్‌లోనే 'అడ్రెస్' చేయడం ఇక్కడ ఆసక్తికరమైన అంశం. ఆమె పరిశోధనా వ్యాసాలు– కమ్మ కులం కేంద్రంగా ఉన్నప్పటికీ, రెడ్ల ప్రస్తావనను ఆమె వదిలిపెట్టలేదు. అయినా ఇక్కడ కులాలు ఏవి అనే ఆరా కంటే, 'ఎప్పుడు', 'ఎవరు' అనే దృష్టి మనకు ముఖ్యం. దేశం స్వతంత్రమై వందేళ్లకు చేరువ అవుతున్నప్పుడు, వనరుల పంపిణీ అన్ని ప్రాంతాలకూ, అన్ని సామాజిక వర్గాలకూ వారి వారి దామాషా మేరకు చేరే ప్రయత్నం మొదలయిందా లేదా అనేది ఇక్కడ కీలకం. తన మొదటి ఐదేళ్ల టర్మ్ లోనే 13 జిల్లాలను 26గా చేసి ప్రభుత్వాన్ని సూక్ష్మ స్థాయికి తీసుకువెళ్లడంలో జగన్ ప్రభుత్వం విజయవంతం అయింది. రాబోయే ఐదేళ్ల కాలంలో ఇప్పుడు జరుగుతున్న వనరుల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుంది. అనుమానం లేదు, అందువల్ల పేద వర్గాల జీవన ప్రమాణాలు మునుపటి కంటే చాలా బాగా మెరుగవుతాయి.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు
మొబైల్: 98481 28844

పరిశుద్ధుడు



యేసు క్రీస్తు ప్రభువు తన జీవిత కాలపు ముగింపు మూడున్నర సంవత్సరాలు నిత్యము ప్రజల మధ్యనే సంచరిస్తూ ప్రజల్లోనే ఉంటూ అంతటా జెండాను కాక అజెండాను మోసినట్టుగా ఆయన వైవిధ్య జీవన శైలిని మనం నిశితంగా పరిశీలించి చూస్తే గమనించగలుగుతాము. క్షేత్ర స్థాయిలో చేసిన తన సువార్త పాదయాత్రల పర్యటనలలో సామాన్యులను కలుస్తూ వారిని అలరిస్తూ సుంక రుల, పాపుల స్నేహితుడు అనిపించుకోడమే కాక ఎన్నో విమర్శలు సైతం ఎదుర్కొన్నాడు.

శాస్త్రులు, పరిసయ్యులు, సద్దూ కయ్యులు, యాజక పెద్దలు సృష్టించిన ఎన్నో ఆటంకాలు, అభ్యంతరాలు, ఆంక్షల నడుమ యేసు విజయ సూచకంగా జెరూషలేములో సాహసించి పర్యటించడం విశేషం. యావత్తూ మానవాళి పాప, శాపాలను భరిస్తూ శాపగ్రస్తుడిగా ఆ మ్రాను అనబడే చెక్క సిలువ మీద వ్రేలాడాడు. దేవుని సంకల్పానికి వీర విధేయుడైననూ, శరీరధారిగా ఉంటూ కూడా తన పరిశుద్ధ జీవితాన్ని విజయవంతంగా అంతటను ప్రదర్శించిన కారణం చేత దేవుడు ఆయనను మృతులలో నుండి లేపాడు. మృత్యుంజయునిగా లోకానికి కనబరిచాడు. ఆనాడే క్రీస్తు జైత్ర యాత్ర మొదలైంది. అది వివిధ రూపాలలో ఇప్పటికీ ఎప్పటికీ ఏనాడూ చెక్కుచెదరక కొసాగుతూనే ఉంటుంది. సూర్యుడు ఈ భూమిపై ఉన్నంత వరకు ఆయనదైన విజయాన్ని ఒక్క చర్చిలోనే కాక అంతటా చర్చించుకొనక తప్పని పరిస్థితిలో ఆయన విజయం ఉండుట బహు ఆశ్చర్యకరమే. చెయ్యెత్తి జై కొట్టే జైత్ర యాత్ర క్రీస్తు ప్రభువుది.

– జేతమ్
(రేపు ఈస్టర్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పంచమి సా.5.34 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** అనూరాధ రా.6.48 వరకు, **వర్జ్యం:** రా.12.31 నుండి 2.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.01 నుండి 7.35 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.56 నుండి 9.35 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** మ.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 6.08.

రూ.2 లక్షల రుణమాఫీకి కసరత్తు: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ అమలు కోసం రిజర్వుబ్యాంకు, వాణిజ్య బ్యాంకులతో కలిసి విధివిధానాల రూపకల్పనకు కసరత్తు జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 2023–24లో వర్షపాత లోటు ఫలితంగా సాగునీరు అందక పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10,000 నష్టపరిహారం అందిస్తామని ఆయన ప్రకటించారు. మున్ముందు ఏఒక్క రైతు కూడా ప్రకృతి వైపరీత్యాల వల్ల, వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోకుండా రైతుల ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. వచ్చే వానాకాలం నుంచి పంటల బీమా అమలు చేస్తామని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నేను గొర్రెను కాలేను.. కారు దిగను: ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: కడియం శ్రీహరి, కేకే అకస్మాత్తుగా బీఆర్ఎస్‌ను వీడటంతో తనకు కొంత మంది కాల్ చేసి వారి బాటలోనే నడిచి 'మంచి' దారి వెతుక్కోమన్నారని నాగర్ కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 'ఎక్స్'లో వెల్లడించారు. అయితే తాను గొర్రెను కాదల్చుకోలేదని, ఇంకెక్కడికో పోవాలన్న ఆలోచన కూడా తనకు లేదని పేర్కొన్నారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా బీఆర్ఎస్‌ను వీడేది లేదని, చాలా ఆలోచించే ఆ పార్టీలో చేరానని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి వచ్చింది సొంత పిల్లల రాజకీయ భవిష్యత్తు కోసమో, అక్రమ ఆస్తుల కోసమో, పోలీసు కేసులకు భయపడో, హంగులు, ఆర్భాటాలున్న జీవితం కోసమో, ప్రోటోకాల్ కోసమో కాదని పేర్కొన్నారు. గెలుపుతో వచ్చే అధికార ఫలాలను అనుభవించినప్పుడు, ఓటమితో వచ్చే కష్టాలను కూడా భరించగలిగే వాడే నిజమైన పార్టీ నాయకుడని విశ్లేషించారు.

ఏప్రిల్ 2 నుంచి 8 వరకు 'రాజ్యాంగ రక్షణ యాత్ర'

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం గొప్పతనాన్ని చాటేందుకు ఏప్రిల్ 2 నుంచి 8 వరకు 'రాజ్యాంగ రక్షణ యాత్ర' నిర్వహించనున్నామని తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవా రం ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని ఆవిష్క రించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగరావు, రాష్ట్ర జై భీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ అసాది పురుషోత్తం, రాష్ట్ర కో– ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇది ఆకులు రాలే కాలం కొత్త చిగురు ఖాయం

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌కు ఓట్ల ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలిస్తే సంక్షేమ పథకాలన్నీ మాయం అవుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 105 మంది రైతులు, 38 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, అయినా వారిని ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

ఫ్యాకల్టీయే లైంగికంగా వేధిస్తే ఇంకెవరికి చెప్పను నాన్నా..

- తండ్రి సెల్‌కు మెసేజ్ పెట్టి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని
- విశాఖ కొమ్మాదిలోని చైతన్య కాలేజీలో ఘటన
- నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి బలవన్మరణం
- ఫొటోలు తీసి ఫ్యాకల్టీ బెదిరించాడని తండ్రికి మెసేజ్
- కాలేజీలో లైంగిక వేధింపులు నిత్యకృత్యం
- పోలీసులకు చెప్తే ఫొటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తున్నారు
- నేను చనిపోతేనే నిజం ప్రపంచానికి తెలుస్తుంది



బాలిక దూకి మృతి చెందినట్టు భావిస్తున్న హాస్టల్ భవనం ఇదే

మధురవాడ (భీమిలి): కాలేజీల్లో కామ పిశాచాల వేధింపులు తాళలేక కొంతమంది అమ్మాయిలు చదువులు మధ్యలోనే మానివేస్తుంటే.. మరికొందరు ఆత్మహత్యలే శరణ్యమని భావించి చిన్నతనంలోనే తనువులు చాలిస్తున్నారు. ఫ్యాకల్టీయే బరితెగించి లైంగికంగా వేధింపులు పాల్పడగా.. తట్టుకోలేకపోయిన ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన విశాఖపట్నం కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. ఇక్కడ డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్న రూపశ్రీ (16) లైంగిక వేధింపులకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్యాకల్టీ లైంగిక వేధింపులు తాళలేక పోతున్నా నంటూ తండ్రికి మెసేజ్ పెట్టి గురువారం అర్ధరాత్రి 1.05 నిమిషాలకు ప్రాంతంలో హాస్టల్ భవనం 4వ ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

విద్యా సంస్థ నిర్లక్ష్యమే కారణం

విద్యా సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తన కుమార్తె మృతి చెందిందని బాలిక తండ్రి గండికోట రమణ ఆవేదన వ్యక్తం చేశాడు. నర్సీపట్నం సమీపంలోని పద్మనాభపురానికి చెందిన రైతు కూలి గండికోట రమణ, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు పెళ్లి కాగా అగనంపూడిలో భర్తతో కలిసి నివాసం ఉంటోంది. ఆఖరి కుమార్తె తల్లిదండ్రుల వద్దే ఉండి చదువు కుంటోంది. రెండో కుమార్తె రూపశ్రీ కొమ్మాది కాలేజీ హాస్టల్లో ఉండి చదువుతోంది. రూపశ్రీ కనిపించడం లేదని తండ్రికి కళాశాల సిబ్బంది ఫోన్ చేసిన వెంటనే డయల్ 100కి ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి సీసీ కెమె రాలు పరిశీలించిన తర్వాత రూపశ్రీ అర్ధరాత్రి 12.48 గంటలకు 3వ ఫ్లోర్ నుంచి 4వ ఫ్లోర్‌కి వెళ్లి, 1.05కి 4 ఫ్లోర్ నుంచి కిందకి దూకిందని తెలిసింది. దూకే క్రమంలో చెట్టుకు తగిలి కిందకి పడి తీవ్రంగా గాయపడింది. రూపశ్రీని తరలించిన ఆస్పత్రికి అల్లుడు హరికృష్ణతో కలసి రమణ చేరుకునే లోపు రూపశ్రీ మృతి చెందింది.

తండ్రి సెల్‌కి పంపిన మెసేజ్ ఇలా..

హాయ్ అమ్మా, నాన్న, అక్కా, చెల్లి మరియు కుటుంబ సభ్యులకు.. మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నాను. నేను ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఏమిటంటే ఈ కాలేజీలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయి నాన్న. మరి ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనుకోవచ్చు కానీ ఆ ఫ్యాకల్టీలో ఒకరు అని అంటే ఇంకేం చెప్పగలం నాన్న. చాలా చెండా లంగా ప్రవర్తిస్తున్నాడు. ఫొటోలు కూడా తీసు కుని బెదిరిస్తున్నారు. స్టూడెంట్స్‌కి చెప్పాల్సిందిపోయి ఆ ఫ్యాకల్టీ ఇలా ప్రవర్తిస్తే ఇంకెవరికి చెప్పుకోవాలి నాన్న? నా ఫొటోలు కూడా తీసి బెదిరిస్తున్నారు నాన్న. ఇంకా నాకు ఒక్కదానికే కాదు ఇంకా కాలేజీలో చాలా మంది అమ్మాయిలు ఉన్నారు. ఎవరికి చెప్పుకోలేక, అలా అని కాలేజీకి వెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నాం నాన్న. పోలీసులకు ఫిర్యాదు చేస్తే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం అని బెదిరించారు నాన్నా. నాకే వేరే దారి కనిపించలేదు. ఎవరో ఒకరు చస్తేనే కానీ ఈ విషయం బయట ప్రపంచానికి తెలియదు అని ఆ పని నేనే చేస్తున్నా.

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ కళాశాల

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజుకు చెందిన కళాశాల ఇది. ఇక్కడ యాజమాన్యం అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మృతురాలు తండ్రి, సగర సామాజిక వర్గ కుల పెద్దలు ఆరోపిస్తున్నారు. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పోక్సో, ర్యాగింగ్ కేసు నమోదు

మృతురాలు రూపశ్రీతో పాటు ఇంకా ఎంత మంది విద్యార్థులు వేధింపులకు గురయ్యారనే అంశంపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. నిందితులపై పోక్సో యాక్ట్, ఆత్మహత్యకు ప్రేరేపించడం, ర్యాగింగ్ తదితర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీఎం పాలెం సీఐ రామకృష్ణ తెలిపారు.

కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానివ్వం

▶ మొదటి పేజీ తరువాయి

వెళ్లి రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంపై బదలా తీర్చుకోవాలి. రంజిత్‌రెడ్డి చేసిన ద్రోహానికి చేవెళ్ల నాయకులు బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రేవంత్‌రెడ్డి 'లీకు వీరుడు'

'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రస్తావనకు రాకుండా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌ట్యాపింగ్ అంటూ యూట్యూబ్ చానళ్లకు డబ్బులిచ్చి లీకులు ఇస్తున్నాడు. కేసీఆర్‌ను బొందపెడతా అని రోత మాటలు మాట్లాడుతూ చౌకబారు విమర్శలు చేస్తున్నాడు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎగవేసేందుకు రోజుకో స్కామ్ అంటూ ప్రచారం చేస్తూ కేసీఆర్ అధికారం నుంచి దిగి 4 నెలలైనా యూట్యూబ్ చానళ్లను అడ్డుపెట్టు కొని తిట్టిస్తున్నాడు. ఆరు గ్యారంటీలు పోయి ఆరు గారడీలు మాత్రమే రేవంత్ పాలనలో మిగిలాయి. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగి హామీలు నెరవేర్చాలి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖమ్మం, నల్లగొండ నేతలే రేవంత్ ప్రభుత్వానికి మానవబాంబులు అవుతారు. కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో దేశమంతా కలిపి 40 సీట్లు వచ్చే పరిస్థితి లేదు. బీజేపీని నిరోధించే శక్తి ప్రాంతీయ పార్టీల నేతలు మమతాబెనర్జీ, కేసీఆర్, కేజ్రీవాల్, స్టాలిన్ వంటి వారికి మాత్రమే ఉంది' అని కేటీఆర్ అన్నారు.

కార్యకర్తల కోసం..

'ఇన్ని రోజులు పార్టీ, నాయకుల కోసం పనిచేసిన.. కార్యకర్తల కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతా. పదిమంది సభ అయినా వేయిమంది సభ అయినా వచ్చి కొట్లాడతా. సైలెంట్‌గా పనిచేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం. నాయకులు పార్టీని వదిలేసినా, శ్రేణుల కోసం స్వయంగా పనిచేస్తా. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకునేందుకు సర్వశక్తులూ కేంద్రీకరిస్తా. ధాన్యం బోనస్ ఇవ్వకుంటే నిప్పు రగిలిద్దాం. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండేందుకు వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి కేసీఆర్ అభ్యర్థిగా భావించి పనిచేద్దాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

పార్టీని వీడేది లేదు: కాలే యాదయ్య

తనకు ఆస్తి లేకున్నా నైతిక విలువలు ఉన్నాయని, పార్టీని వీడే ప్రసక్తే లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. తాము పార్టీని వీడుతున్నట్టు వస్తున్న పుకార్లు నమ్మొద్దని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఎన్టీఆర్, వైఎస్ వెంట వారి అంతిమశ్వాస వరకు తమ కుటుంబం ఉందని, కేసీఆర్ వెంట అదే తరహాలో ఉంటామని బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డితో పాటు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

పోరాటపంథాలో కదం తొక్కుతాం 'ఎక్స్'లో కేటీఆర్

'శూన్యం నుంచి సునామీ సృష్టించి.. అసాధ్యం అనుకున్న తెలంగాణను సాధించిన ధీశాలి కేసీఆర్. ఒక్కడుగా బయలుదేరి లక్షల మంది సైన్యాన్ని తయారుచేసి, ఎన్నో అవమానాలు, కుట్రలు, కుతంత్రాలు అన్నింటిని ఛేదించిన ధీరత్వం ఆయ నది. ఆలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు ప్రజలే జవాబు చెప్తారు. ప్రజాఆశీర్వాదం, మద్దతుతో 14 ఏళ్ల పోరాడి, ఉద్యమ పార్టీగా తెలంగాణ సాధించి ఘనత కేసీఆర్‌ది. తెచ్చుకున్న తెలంగాణ దశను, దిశను మార్చి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్, బీఆర్ఎస్‌ను ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు. నిఖార్సయిన కొత్త తరం నాయక త్వం తయారుచేస్తాం.. పోరాటపంథాలో కదం తొక్కుదాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు.

రాధాకిషన్‌రావుకు జ్యుడీషియల్ రిమాండ్

పోలీసు కస్టడీకి భుజంగరావు, తిరుపతన్న.. శుక్రవారం ముగ్గురినీ కలిపి విచారించిన సిట్

గాంధీ ఆస్పత్రిలో రాధాకిషన్‌రావుకు వైద్య పరీక్షలు.. న్యాయమూర్తి ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు

సాక్షి, హైదరాబాద్: టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు శుక్రవారం కొంపల్లిలోని న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరుపరచగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. పోలీసులు గురువారం ఉదయం రాధాకిషన్ రావును అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి రాత్రి వరకు ఆయన్ను బంజారాహిల్స్ ఠాణాలో సిట్ అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలను శుక్రవారం ఉదయం వీరిని చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పంజగుట్ట పోలీసులు వైద్యపరీక్షల అనంతరం బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు పోలీసులు ఈ ముగ్గురినీ కలిపి, విడివిడిగా విచారించారు. రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్‌తో పాటు అక్రమ వసూళ్ల కోణంలోనూ ప్రశ్నించారు. ఆపై రాధాకిషన్ రావును గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు వైద్య పరీక్షల అనంతరం కొంపల్లికి తీసుకు వెళ్లారు. తదుపరి విచారణ నిమిత్తం రాధాకిషన్ రావును పోలీసు కస్టడీలోకి తీసుకోవాలని సిట్ నిర్ణయించింది. దీనికోసం అనుమతి కోరుతూ శనివారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది.

ప్రభాకర్‌రావుతో లింకులు, వసూళ్ల కోణంలో...

సిట్ అధికారులు రాధాకిషన్‌రావుతో పాటు భుజంగరావు, తిరుపతన్నలను ప్రధానంగా రెండు కోణాల్లో ప్రశ్నించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతో వీరికి ఉన్న సంబంధాలు, ఆయన ఆదేశాల మేరకు చేసిన ఫోన్ ట్యాపింగ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టారు. డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు నేతృత్వంలోని బృందం సహాయంతో వీరు ప్రతిపక్ష నేతలు, కీలక వ్యక్తులతో పాటు వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేసి వ్యక్తిగత విషయాలు తెలుసుకున్నారు. ఈ రకమైన ఆదేశాలు ఎవరు ఇచ్చారు? గుర్తించిన వివరాలను తొలుత ఆ వ్యక్తులకు చెప్పేవారా? అనే కోణాల్లో సిట్ ప్రశ్నించింది. వీరి వేధింపుల నేపథ్యంలో ఓ పార్టీకి వివిధ రూపాల్లో విరాళాలు ఇవ్వడంతో పాటు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు తదితరులకు కప్పం కట్టిన వాళ్లల్లో బడా బిల్డర్లు, జ్యువెలరీ దుకాణాల యజమానులు, రియల్టర్లతో పాటు హవాలా వ్యాపారులూ ఉన్నట్టు సిట్ అనుమానిస్తోంది. ఈ ముగ్గురినీ ప్రశ్నించిన సిట్ అధికారులు దీనికి సంబంధించి కీలక సమాచారం సేకరించారని తెలిసింది. రాచకొండ ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లును శుక్రవారం తెల్లవారుజామున విడిచిపెట్టారు. దాదాపు ఆరుగంటల పాటు రాధాకిషన్‌రావుతో కలిపి గట్టుమల్లును ప్రశ్నించిన సిట్ ఆయన నుంచి వాంగ్మూలం నమోదు చేసింది. ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌ల్లో పనిచేసిన అనేక మంది అధికారులు, సిబ్బందినీ సిట్ విచారిస్తూ వారి నుంచి వాంగ్మూలాలు సేకరిస్తోంది. ఇప్పటి వరకు 47మంది నుంచి స్టేట్‌మెంట్స్ రికార్డు చేశారని సమాచారం.

ఏసీబీ కేసుకు రంగం సిద్ధం

రాధాకిషన్‌రావు, నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్నలు అక్రమ ఆస్తులు కూడబెట్టారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే కొన్ని ప్రాథమిక ఆధారాలు సేకరించారు. ఈ అంశాలను క్రోడీకరిస్తూ అవినీతి నిరోధక శాఖకు సమాచారమివ్వాలని సిట్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వివరాలు అందిన తర్వాత ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం. మరోపక్క అక్ర మ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉండి, అరెస్టు అయిన అధికారుల పూర్వాపరాల ను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.వీరు గతంలో ఎక్కడెక్కడ పనిచేశారు? ఆయాచోట్ల వీరిపై ఉన్న వివాదాలు ఏంటి? కేసులు ఉన్నా యా? అని ఆరా తీస్తున్నారు. తిరుపతన్నపై పెద్దగా వివాదాల్లేనప్పటికీ.. భుజంగ రావు సర్వీసు మొత్తం అక్రమ దందాలతోనే సాగిందని అధికారులు గుర్తించినట్టు తెలుస్తో ంది. రాధాకిషన్‌రావు ఉప్ప ల్ ఏసీపీగా ఉండగా 2013లో చోటు చేసుకున్న యాంజాల్ శ్రీధర్‌రెడ్డి అలియాస్ ఉప్పల్ వైఎస్సార్ ఆత్మహత్య కేసును అధికారులు తవ్వుతున్నారు. అప్పటి రామంతాపూర్ కార్పొరేటర్ పరమేశ్వర్‌రెడ్డితోపాటు రాధాకిషన్‌రావు వేధింపులతోనే ఉప్పల్ వైఎస్సార్ ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదైంది. 2007లో జరి గిన పరమేశ్వర్‌రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి హత్య కేసులో ఉప్పల్ వైఎస్సార్ నిందితుడు. ఇతడు మరికొందరితో కలిసి పరమేశ్వర్‌రెడ్డికి హత్యకు కుట్ర పన్నిన ఆరోపణలపై ఉప్పల్ వైఎస్సార్ తదితరులను పోలీసులు 2013 జూన్‌లో అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి రాధా కిషన్ రావు రూ.10 లక్షల లంచం డిమాండ్ చేసి వేధించడంతోనే ఉప్పల్ వైఎస్సార్ ఆత్మహత్య చేసుకున్నట్టు అభియో గాలు నమోదయ్యాయి. ఈ కేసు ఇప్పటికీ ట్రయల్ పూర్తి కాకపోవడానికి కారణాలను ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

నగదు రవాణా చేసినట్లూ అంగీకరించారు..

పంజగుట్ట ఠాణాలో నమోదైన ఈ కేసు దర్యాప్తులో భాగంగా టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారించాం. ఆయన తాను చేసిన నేరాలను అంగీకరించారు. చట్టవిరుద్ధంగా, తమ అధికారాలను దుర్వినియోగం చేస్తూ ప్రైవేట్ వ్యక్తుల ప్రొఫైల్స్‌ను అభివృద్ధి చేయడం, కుట్రపూరితంగా అనధికారికంగా ఆ వ్యక్తులపై నిఘా ఉంచడం చేసినట్టు బయట పెట్టారు. రాజకీయంగా పక్షపాతంతో వ్యవహరించడంతోపాటు ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న సమయంలో తాము అక్రమంగా డబ్బు రవాణా చేయడానికి అధికారిక వనరులను వినియోగించామని అంగీకరించారు. ఇతర నిందితులతో కుమ్మక్కై, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం మరియు సాక్ష్యాలను తారుమారు చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడినట్టు ఒప్పుకున్నారు.

– ఎస్ఎం.విజయ్‌కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ

సిరిసిల్ల నేతన్నల సమ్మె విరమింపజేయాలి

- కార్మికులను ఆదుకోవాలి
- వస్త్రపరిశ్రమకు కొత్త ఆర్డర్లు ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎంపీ బండి సంజయ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్/సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సిరిసిల్ల నేత న్నల సమ్మెను విరమింపజేయాలని బీజేపీ ఎంపీ బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవా లని, గత 27 రోజులుగా అక్కడి వస్త్ర పరిశ్రమ ఆసా ములు, కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి ప్రభుత్వమే కారణమని, వెంటనే వారికి రూ.270 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం వెంటనే కొత్త ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవా లని కోరారు. గత 4 నెలలుగా యజమానులు, నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పాత బకాయిలు రాక, కొత్త ఆర్డర్లు లేక దాదాపు 20 వేల మంది పవర్‌లూమ్, అనుబంధ రంగాల కార్మికులు పనుల్లేక పస్తులుండే పరిస్థి తులు ఏర్పడ్డాయ న్నారు. నేత కార్మి కులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పథ కాన్ని ప్రవేశపెట్టి కచ్చితంగా అవే చీరలను నేయాలంటూ.. ఆసాము లను, యజమానులను ఒత్తిడి చేసి పాత వ్యాపారాలను బలవంతంగా బంద్ చేయించిందన్నారు. మాస్టర్ వీవర్స్ పేరుతో బడా వ్యాపారులకు బతుకమ్మ ఆర్డర్లను ఇచ్చిన నేపథ్యంలో చిన్న ఖార్ఖానాల ఆసాములు, యజమానులు కూలీలుగా మారాల్సి వచ్చిందన్నారు. పవర్‌లూమ్ కార్ఖానాల విద్యుత్ బకాయిల మాఫీతో పాటు గతంలో ఇచ్చిన విద్యుత్ సబ్సిడీని కొన సాగించాలని కోరారు. ఈ కార్ఖానాలకు గత 24 ఏళ్లుగా 50% సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను నిలిపివేయడంతో రెట్టింపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయని తెలిపారు. నేత కార్మికుడిని ఆసామి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం రూ.370 కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్'పథకాన్ని పునః ప్రారంభించాలని కోరారు.



'గుడ్ ఫ్రై డే' సందర్భంగా మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

రిజర్వేషన్ల స్ఫూర్తి అర్థం చేసుకోలేదా?

- సామాజిక స్పృహ లేకుండానే రమణ చీఫ్ జస్టిస్ అయ్యారా?
- జస్టిస్ ఎన్వీ రమణ ప్రతిపాదనలపై భగ్గుమన్న జస్టిస్ ఈశ్వరయ్య



సాక్షి, హైదరాబాద్: విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ల అమలు స్ఫూర్తిని నీరుగార్చేలా అగ్ర వర్ణాలకు కూడా రిజ ర్వేషన్లు అమలు చేయాలనే కుట్ర పకడ్బందీగా అమలవుతోందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శన మని శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. రైతు వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలన్న జస్టిస్ ఎన్వీ రమణ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని, సామాజిక స్పృహ లేకుండా ఆయన ప్రధాన న్యాయమూర్తి ఎలా అయ్యారో అర్థం కావడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు అమలవుతున్నా యంటేనే సన్నకారు రైతులకు, రైతు కూలీలకు రిజర్వేషన్లు అమలవుతు న్నట్లు కాదా? అని ప్రశ్నించారు. కేవలం అగ్రవర్ణ సంపన్నులకు రిజర్వేషన్లను అమలు చేయడం కోసం ఏకంగా వ్యవసాయాన్ని అంటరాని వృత్తిగా మార్చడం సమంజసం కాదని జస్టిస్ ఈశ్వరయ్య అభి ప్రాయపడ్డారు. జస్టిస్ రమణ లాంటి మేధావులు రిజర్వేషన్ల గురించి కాకుండా జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం గురించి మాట్లా డితే బాగుంటుందని హితవు పలికారు. అన్ని తెలిసి కూడా కుట్ర పూరిత ప్రతిపాదనను సమాజం ముందుంచే ప్రయత్నం ఆయన చేసినట్లు అర్థమవుతోందన్నారు. ఇలాంటి చెత్త వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రచురించడం ఈనాడు వక్రబుద్ధిని, పీడిత వర్గాల పట్ల ఆ పత్రిక వైఖరిని తేటతెల్లం చేస్తోందని జస్టిస్ ఈశ్వరయ్య దుయ్యబట్టారు.

రాజీనామా చేశాకే పోటీ!

- దానం నాగేందర్ కాంగ్రెస్ నుంచి లోక్‌సభకు పోటీచేసే విషయంలో ట్విస్ట్
- ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ తీసుకెళ్తే పరిస్థితేమిటనే చర్చ
- ఆయన రాజీనామా చేసి, పోటీచేస్తారని అధిష్టానాన్ని ఒప్పించిన రేవంత్!
- ఒకవేళ దీనికి ససేమిరా అంటే నాగేందర్‌కు ప్రత్యామ్నాయం సిద్ధం చేస్తున్న టీపీసీసీ
- కడియం విషయంలోనూ ఇదే చర్చ





సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉండి.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటారనే ప్రచారం గందరగోళం రేపుతోంది. వాస్తవానికి దానం నాగేందర్ చేరిక సందర్భంగా జరిగిన చర్చల్లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీ చేయాలని, ఖైరతా బాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయనకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు స్పష్టతనిచ్చినట్టు తెలిసింది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేయా లనే ప్రతిపాదన మేరకే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని పార్టీ అధిష్టానానికి వివరించాకే.. నాగేందర్‌కు ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ ఖరారు చేసింది. కానీ ఆయన రాజీనామాపై ఊగిసలాటలో పడ్డారు. ఎంపీగా గెలిచాకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఈ క్రమంలో పార్టీ పెద్దలు ఏం చేస్తారనే చర్చ మొదలైంది.

ప్రత్యామ్నాయంపై ఆలోచన!

గాంధీభవన్ వర్గాల్లో, కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చల మేరకు.. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం సాధ్యం కాదని ఏఐసీసీ పెద్దలు తేల్చినట్టు సమాచారం. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుందని.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేయిస్తే ఆ రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహారాన్ని తప్పుపట్టలేని స్థితికి వెళతామని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో నాగేందర్ అభ్యర్థిత్వంపై పునః సమీక్ష చేసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే ఎంపీగా పోటీచేస్తారని.. ఆయన రాజీనామాకు ససేమిరా అంటే మరో అభ్యర్థిని పోటీకి పెట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ లేదా మరో నేతను ప్రత్యామ్నాయంగా పోటీ చేయించేందుకు సిద్ధంగా ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు రాష్ట్ర నేతలకు సూచించినట్టు సమాచారం.

కడియం శ్రీహరి విషయంలోనూ!

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయంలోనూ కాంగ్రెస్‌లో ఇదే తరహా చర్చ జరుగుతోంది. కడియంతోపాటు ఆయన కుమార్తె కావ్య నేడు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ నేపథ్యంలో కడియం శ్రీహరి వరంగల్ లోక్‌సభ ఎంపీగా పోటీచేస్తారని, ఖాళీ అయ్యే స్టేషన్‌ఘన్‌పూర్‌లో కావ్యను ఎమ్మెల్యేగా పోటీ చేయిస్తారనే చర్చ జరుగుతోంది. లేదా కావ్యను ఎంపీగా పోటీచేయించి.. శ్రీహరి ఎమ్మెల్యేగా కొనసాగుతారని అంటున్నారు. మొత్తమ్మీద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ తరఫున ఎంపీ అభ్యర్థులుగా పోటీచేసే అంశం ఆ పార్టీలో కొంత గందరగోళానికి దారిస్తోంది.

తొలిసారిగా బ్రెయిలీ లిపిలో ఫిర్యాదు.. కేసు నమోదు

విశాఖ సిటీ: ఏపీలో తొలిసారిగా ఒక దివ్యాంగుడు బ్రెయి లీ లిపిలో ఇచ్చిన ఫిర్యాదుపై విశాఖ నగర పోలీసులు కేసు నమోదు చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. దిశ దివ్యాంగ్ సురక్ష ద్వారా ప్రతి నెలా 2, 15 తేదీల్లో దివ్యాంగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. బ్రెయిలీ లిపిలో ఫిర్యాదులు స్వీకరించేందుకు అందులో పరిజ్ఞానం ఉన్నవారిని నియమించారు. ఈ నెల 15వ తేదీన తొలిసారి నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం జల్లూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు డయల్ యువర్ సీపీకి ఫోన్ చేశాడు. అధిక లాభాలు ఇస్తానని చెప్పి బిర్లా జంక్షన్ ప్రాంతంలో ఉన్న క్రేసుల్లా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తన వద్ద రూ.2.9 లక్షలు, కాకినాడకు చెందిన తన స్నేహితుడు పిప్పర వెంకటేశ్వరరావు నుంచి రూ.11 లక్షలు తీసుకుని మోసం చేసిందని చెప్పారు.

4.42 కోట్ల పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రారంభం

సాక్షి, అమరావతి: ఏపీలో వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రారంభమైంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన రోజే (జూన్ 12) వీటిని విద్యార్థులకు పంపిణీ చేసే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ 4.42 కోట్ల పాఠ్యపుస్తకాల ముద్రణకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే ఒకటి నుంచి పదో తరగతి వరకు ద్విభాషా (బైలింగ్యువల్) విధానంలో పాఠ్యపుస్తకాలను అందిస్తున్న బోర్డుగా ఏపీ పాఠశాల విద్యా శాఖ నిలుస్తోంది. 10వ తరగతి ఫిజికల్ సైన్స్ పుస్తకం భవిష్యత్తులోనూ రిఫరెన్స్ బుక్‌గా ఉండేలా తీర్చిదిద్దుతోంది. 2024–2025 విద్యా సంవత్సరంలో తొలిసారిగా ఫ్యూచర్ స్కిల్ సబ్జెక్ట్‌ను పరిచయం చేస్తూ 8వ తరగతి విద్యార్థులకు బోధించనుంది. 3–9 తరగతులకు టోఫెల్ కోసం వర్క్‌బుక్‌లను సిద్ధం చేస్తోంది. ఈ పాఠ్యపుస్తకాల పీడీఎఫ్ కాపీలను వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచనుంది.

ఈసీ 'మెనూ కార్డు'

ఒకే ఐటం.. ప్రాంతానికో రేటు • అభ్యర్థులకు రేట్లు నిర్ధారించిన ఈసీ • ఒక్క సమోసా...రూ.7 నుంచి 15
కిలో మటన్ కేవలం రూ.500 • కిలో చికెన్ మాత్రం రూ.250



కొసమెరుపు: ఎన్నికల వేళ కార్యకర్తలకు పార్టీలు, అభ్యర్థులు మద్యం అందుబాటులో ఉంచడం బహిరంగ రహస్యమే. కానీ ఈసీ మెనూలో మద్యానికి మాత్రం చోటులేకపోవడం విశేషం.

చాయ్‌కి పంజాబ్‌లోని జలంధర్‌లో రూ.15. అదే మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలో అయితే రూ.7. సమోసా కూడా పంజాబ్‌లో రూ.15 అయితే మధ్యప్రదేశ్‌లో రూ.7.5. ఏమిటీ ధరలంటారా? లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిర్ధారించిన ధరలివి. వీటిని జిల్లా ఎన్నికల విభాగాలు స్థానికంగా నిర్ధారిస్తుంటాయి. దాంతో అవి ఒక్కో ప్రాంతానికి ఒక్కోలా ఉంటాయి. అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై గరిష్ట పరిమితి ఉందన్నది తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి ఈసీ నిర్ధారించిన పరిమితి రూ.95 లక్షలు. అరుణాచల్, గోవా, సిక్కిం రాష్ట్రాల్లో మాత్రం రూ.75 లక్షలు. కేంద్రపాలిత ప్రాంతాల్లో రూ.75–95 లక్షల మధ్య ఉంది. నామినేషనల్ దాఖలు చేసిన నాటి నుంచి ఫలితాలు వెల్లడించే తేదీ దాకా అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయం ఈ పరిమితిని దాటకుండా ఈసీ డేగ కళ్లతో గమనిస్తూ ఉంటుంది. ఇందుకోసం బ్యానర్లు, ఫ్లెక్సీలు, సభా వేదికలు మొదలుకుని కార్యకర్తలు, అభిమానులకు ఆహారం దాకా ప్రతిదానికీ రేటును ఫిక్స్ చేస్తుంది. అయితే వాటికీ, వాస్తవ ధరలకూ చాలాసార్లు పొంతనే ఉండదు. దాంతో ఈసీ 'మెనూ కార్డు'పై మీడియాలో, సోషల్ మీడియాలో జోకులు పేలుతుండటం పరిపాటి. మరోవైపు, ఎన్నికల వ్యయంపై అభ్యర్థులకు పరిమితి ఉన్నా పార్టీలు చేసే ఖర్చుకు మాత్రం అలాంటిదేమీ లేకపోవడం విశేషం!

చాయ్ రూ.5 నుంచి 15 దాకా...

చాయ్ ధరను దేశవ్యాప్తంగా ప్రాంతాన్ని బట్టి రూ.5 నుంచి రూ.15 దాకా ఈసీ నిర్ధారించింది. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో కప్పు చాయ్ రూ.5, సమోసా రూ.10. ఇడ్లీ, సాంబార్ వడా, పోహా–జిలేబీ ప్లేటు రూ.20. దోసా, ఉప్మా మాత్రం ప్లేటు రూ.30. మణిపూర్‌లో జాతుల హింసకు కేంద్రాల్లో ఒకటైన తౌబల్ జిల్లాలో చాయ్, సమోసా, కచోరీ, ఖజూర్, గాజా ఒక్కోటీ రూ.10. రాష్ట్రంలోని తెంగ్నౌపాల్ జిల్లాలో బ్లాక్ టీ రూ.5, సాదా టీ రూ.10. మణిపూర్‌లో బాతు మాంసం రూ.300. పంది మాంసం రూ.400. ఇక్కడి ఈసీ మెనూలో చికెన్‌తో పాటు చేపలు కూడా ఉన్నాయి. జలంధర్‌లో ప్లేటు చోలే భటూరేకు ఈసీ నిర్ధారించిన ధర రూ.40. కిలో చికెన్‌కు రూ.250, మటన్‌కు రూ.500. మిఠాయిల్లో ఢోడా రూ.450, ఘీ పిన్నీ రూ.300. గ్లాసు లస్సీ రూ.20, నిమ్మరసం రూ.15.

చెన్నైలో తగ్గిన చికెన్ బిర్యానీ రేటు

చెన్నైలో 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే చాయ్ ధరను రూ.10 నుంచి రూ.15కు ఈసీ పెంచింది. కాఫీ కూడా రూ.15 నుంచి రూ.20కి పెరిగింది. కానీ చికెన్ బిర్యానీ ధరను మాత్రం రూ.180 నుంచి రూ.150కి తగ్గించడం విశేషం! ఢిల్లీ శివార్లలో నోయిడా పరిధిలోని గౌతంబుద్ధ నగర్‌లో వెజ్ భోజనం రూ.100. సమోసా, చాయ్ రూ.10. కచోరీ రూ.15, శాండ్‌విచ్ రూ.25, జిలేబీ కిలో రూ.90. ఉత్తర గోవాలో బటాటా (ఆలూ) వడ, సమోసా రూ.15. చాయ్ రూ.15, కాఫీ రూ.20. హరియాణాలోని జింద్‌లో దాల్ మఖానీ, మిక్స్‌డ్ వెజ్ కర్రీ రూ.130. మటర్ పనీర్ రూ.160. ఇక్కడ ఈసీ మెనూలో బటర్ నాన్, మిస్సీ రోటీ, ప్లెయిన్ రోటీలతో పాటు కాజూ కట్లీ, గులాబ్‌జామ్ వంటివి కూడా ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

వీటికీ రేట్లు ఫిక్స్...

- ఖరీదైన హెలీప్యాడ్లు, లగ్జరీ వాహనాలు, ఫామ్‌హౌజ్‌లతో పాటు పూలు, కూలర్లు, టవర్ ఏసీలు, సోఫాల వంటివాటికి కూడా ఈసీ రేట్లు నిర్ధారించింది.
- సభలు, సమావేశాలకు జనాన్ని తరలించేందుకు బస్సులు మొదలుకుని టాటా సఫారీ, స్కార్పియో, హోండా సిటీ, సియాజ్... ఇలా బ్రాండ్లవారీగా కూడా ఒక్కో వాహనానికి ఒక్కో రేటు నిర్ణయించింది.
- దండల్లో కూడా గులాబీ, బంతి... ఇలా పూలను బట్టి రేట్లు నిర్ణయమయ్యాయి. పార్టీల జెండాలు, టోపీలకూ అంతే.
- సభలు, సమావేశాలకు వేదికలు, నేతలకు బస తదితరాలతో పాటు ప్రకటనలు, హోర్డింగులు, కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రికి కూడా ఇంత అని ఈసీ ముందే రేట్లు ఫిక్స్ చేసి పెట్టింది.

రూ.1,823 కోట్లు చెల్లించండి

- కాంగ్రెస్ పార్టీకి ఐటీ నోటీసులు
- బీజేపీ నుంచి రూ.4,617 కోట్లు వసూలు చేయాలన్న కాంగ్రెస్
- ఐటీ విభాగం బీజేపీ జేబు సంస్థగా మారిందంటూ నిప్పులు

న్యూఢిల్లీ: రూ.1,823.08 కోట్లు చెల్లించాలంటూ ఆదాయపు పన్ను విభాగం నుంచి తాజాగా తమ పార్టీకి నోటీసులు వచ్చాయని కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరామ్ రమేశ్, అజయ్ మాకెన్ చెప్పారు. ఐటీ చట్టాలను అధికార బీజేపీ విచ్చలవిడిగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఈ ఉల్లంఘనలకు గాను బీజేపీ నుంచి రూ.4,617.58 కోట్లు వసూలు చేయాలని ఐటీ అధికారులను డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పన్ను ఉగ్రవాదానికి పాల్పడుతోందని, లోక్‌సభ ఎన్నికల ముందు ప్రతిపక్షాలను ఆర్థికంగా దెబ్బతీసే కుట్రలు సాగిస్తోందని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలు తమకు విరాళాలు ఇచ్చినవారి పేర్లు, చిరునామాలను ఫామ్ 24ఏలో పొందుపర్చి, ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుందని అజయ్ మాకెన్ చెప్పారు. బీజేపీ మాత్రం ఇలాంటి వివరాలను ఏనాడూ సక్రమంగా సమర్పించలేదని విమర్శించారు. ఐటీ విభాగం బీజేపీ జేబు సంస్థగా మారిందని ఆక్షేపించారు. కేవలం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని నోటీసులు ఇస్తోందని అన్నారు. ఇది ముమ్మాటికీ చట్టవిరుద్ధం, అప్రజాస్వామికం అని తేల్చిచెప్పారు. పాత ఐటీ రిటర్నులను మళ్లీ తెరవడం ఏమిటని ప్రశ్నించారు.

ఇది రాహుల్ గ్యారంటీ

ఐటీ డిపార్టుమెంట్ ఇచ్చిన తాజా నోటీసులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ పన్ను ఉగ్రవాదానికి పాల్పడుతున్న బీజేపీకి బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్య వలువలు ఊడదీస్తున్నవారికి ప్రభుత్వం మారిన తర్వాత తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తాము తీసుకొనే చర్యలు ఎలా ఉంటాయంటే.. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి పనులు చేయకుండా భయపడేలా ఉంటాయని, ఇది రాహుల్ గ్యారంటీ అని తేల్చిచెప్పారు.

సీపీఐ, సీపీఎంలకు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలకు ఆదాయపు పన్ను నోటీసుల పరంపరం కొనసాగుతోంది. రూ.11 కోట్లు చెల్లించాలంటూ సీపీఐకి ఐటీ డిపార్టుమెంట్ నోటీసు జారీ చేసినట్లు అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. గత కొన్నేళ్లలో దాఖలు చేసిన ఐటీ రిటర్నుల్లో పాత పాన్ కార్డును ఉపయోగించినందుకు ఫెనాల్టీలు, వడ్డీ కింద రూ.11 కోట్లు చెల్లించాలంటూ ఈ నోటీసు ఇచ్చినట్లు తెలిపాయి. ఈ నోటీసులను న్యాయస్థానంలో సవాలు చేయడానికి సీపీఐ నేతలు న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లు తెలిసింది. అలాగే సీపీఎంకు కూడా ఐటీ నోటీసులు అందాయి. 2016–17లో ఇచ్చిన పన్ను మినహాయింపును ఉపసంహరించుకుంటూ ఐటీ విభాగం తాజాగా సీపీఎంకు నోటీసులు ఇచ్చింది. అప్పట్లో ఐటీ రిటర్నుల్లో బ్యాంకు ఖాతాను నిర్ధారించనందుకు రూ.15.59 కోట్లు చెల్లించాలని ఆదేశించింది.

స్లో పాయిజన్‌తో ప్రాణం తీశారు

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ మరణంపై కుటుంబీకుల ఆరోపణలు

లక్నో: ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌స్టర్, రాజకీయనేత ముఖ్తార్ అన్సారీది సహజ మరణం కాదని, స్లో పాయిజన్‌తో ఆయనను అంతంచేశారని ఆయన కుమారుడు, సోదరులు తీవ్ర ఆరోపణలు చేశారు. మావ్ సదర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 63 ఏళ్ల ముఖ్తార్ బందా జిల్లా జైలులో ఉండగా వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లగా రాణి దుర్గావతి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేస్తుండగా గుండెపోటుతో చనిపోయారని వైద్యకళాశాల ప్రిన్సిపల్ సునీల్ కౌశల్ చెప్పారు. ''తనకు స్లో పాయిజన్ ఇస్తున్నట్లు అనిపిస్తోందని మా నాన్న మాతో గతంలోనే చెప్పారు. ఇప్పుడు యావత్‌దేశానికీ ఇప్పుడీ విషయం తెల్సింది' అని ఆయన కుమారుడు ఉమర్ అన్సారీ ఆరోపించారు. ''ఇదే విషయాన్ని ముఖ్తార్ గతంలోనే బారాబంకీ కోర్టులో ఫిర్యాదుచేశారు' అని ముఖ్తార్ సోదరుడు సిబ్గతుల్లా అన్సారీ అన్నారు. అంతకుముందు మంగళవారం కడుపునొప్పి కారణంగా అన్సారీని జైలు నుంచి ఆస్పత్రికి తరలించి దాదాపు 14 గంటలపాటు ఆస్పత్రిలోనే ఉంచి తర్వాత జైలుకు తరలించారు. 'జైలు ఆహారంలో ఆయనకు స్లో పాయిజన్ కలిపి ఇచ్చారు. ఇలా జరగడం ఇది రెండోసారి. గతంలో 40 రోజుల క్రితం కూడా ఇదే తరహా ప్రయత్నం జరిగింది. అందుకే ఇప్పుడు ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి చనిపోయారు' అని ముఖ్తార్ మరో సోదరుడైన ఘజియాపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపించారు. జైల్లో విషప్రయోగం జరిగిందన్న ఆరోపణలను బందా జిల్లా జైలు సీరియస్‌గా తీసుకుంది. దీనిపై విచారణకు ఆదేశించింది. అయితే అన్సారీ గుండెపోటుతోనే చనిపోయినట్టు పోస్టుమార్టం అనంతరం వైద్యులు ప్రకటించారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఘాజీపూర్ జిల్లా మొహమ్మదాబాద్ యూసుఫ్‌పూర్‌కు తరలించారు. శనివారం ఉదయం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తనకు అనుమతివ్వాలంటూ కస్గంజ్ జైలులో ఉన్న ముఖ్తార్ మరో కుమారుడు, మవూ ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీ శుక్రవారం సుప్రీంకోర్టు తలుపుతట్టారు.

ఎలక్షన్ బీట్

'విజిల్' ఊదేస్తున్నారు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక సమరం వేళ ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన 'సీ విజిల్' యాప్‌ను ప్రజలు సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి శుక్రవారం ఉదయం వరకు ప్రజల నుంచి 79,000కు పైగా ఫిర్యాదులు అందాయి. ఇందులో 99 శాతానికిపైగా ఫిర్యాదులు పరిష్కరించామని కేంద్ర ఎన్నికల తెలిపింది. వీటిలో 89 శాతం ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించినట్లు ఈసీ పేర్కొంది. 58,500 కంటే ఎక్కువ ఫిర్యాదులు (73శాతం) అక్రమ హోర్డింగ్‌లు, బ్యానర్‌లకు సంబంధించినవి కాగా.. 1400కు పైగా ఫిర్యాదులు నగదు, బహుమతులు, మద్యం పంపిణీకి సంబంధించినవి ఉన్నాయి.

పథకాలను ఓటర్లకు చేర్చండి: మోదీ

చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం తమిళనాడుకు చెందిన బీజేపీ కార్యకర్తలతో నమో యాప్ ద్వారా భేటీ అయ్యారు. 'ఎనతు బూత్ వలిమయ్యాన బూత్ (నా బూత్ అత్యంత శక్తిమంతమైనది)' కార్యక్రమంలో పాల్గొని లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బూత్ స్థాయి సన్నద్ధతపై వారితో చర్చించారు. ''రాష్ట్రంలో ఘనవిజయమే మన లక్ష్యం కావాలి. బీజేపీ, ఎన్డీఏ అభ్యర్థుల ఘనవిజయానికి వ్యూహాలు రూపొందించండి'' అంటూ కార్యకర్తలను ప్రోత్సహించారు. ''తమిళనాట ప్రచారానికి 15 రోజులే మిగిలింది. కనుక ఓటర్లతో నిత్యం అనుసంధానమై ఉండండి. మన పథకాలను, ప్రభుత్వం సాధించిన ఘనతలను వారికి వివరించండి'' అంటూ దిశానిర్దేశం చేశారు. బీజేపీలో తన తొలినాళ్ల అనుభవాలను మోదీ వారితో పంచుకున్నారు.

ఆర్జేడీకి 26.. కాంగ్రెస్‌కు 9

బిహార్‌లో మహాఘట్‌బంధన్ సీట్ల సర్దుబాటు

పట్నా: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను బిహార్‌లో ఆర్జేడీ సారథ్యంలోని మహాఘట్‌బంధన్‌లో సీట్ల పంపిణీ కొలిక్కి వచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 40 స్థానాలకు గాను దాదాపు మూడింట రెండొంతుల సీట్లలో లాలూ ప్రసాద్‌కు చెందిన ఆర్జేడీ పోటీ చేయనుంది. మిగతా వాటిని కాంగ్రెస్, మూడు వామపక్ష పార్టీలు పంచుకున్నాయి. 2019 ఎన్నికల్లో ఆర్జేడీ ఒక్క సీటూ దక్కించుకోలేకపోయినప్పటికీ ఈసారి 26 చోట్ల పోటీ చేయనుంది. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారీ 9 చోట్ల పోటీ చేయనుంది. ఆ తర్వాత సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మూడు, సీపీఐ, సీపీఎంలు చెరో చోట బరిలోకి దిగనున్నాయి. బిహార్‌లో ఆర్జేడీ ఇప్పటికే నాలుగు చోట్ల అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఒక సీటును కాంగ్రెస్ ఆశిస్తోంది. కాంగ్రెస్ పోటీ చేయాలని ఆశిస్తున్న పుర్నియా స్థానానికి లాలూ ప్రసాద్ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించేశారు. సీపీఐ, సీపీఐ(ఎంఎల్) కూడా బెగుసరాయ్, ఖరారియా సీట్లకు అభ్యర్థులను ప్రకటించుకున్నాయి.

మండిలో కంగన రోడ్ షో

సిమ్లా: బాలీవుడ్ నటి, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కంగనా రనౌత్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తాను తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్న హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో శుక్రవారం రోడ్ షో చేశారు. కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్ ఇటీవల తనపై చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా తీవ్రంగా దుయ్యబట్టారు. ''మీ అక్కాచెల్లెళ్లకు, కూతుళ్లకు వెల కట్టేవాళ్లు ఎప్పటికీ మీవాళ్లు కాలేరు. ఇక్కడ తపస్సు చేసిన మాండవ రుషి నుంచి ఈ పట్టణానికి మండి అని పేరొచ్చింది. అలాంటి పేరును కూడా కించపరుస్తున్నారు' అని రోడ్‌షోకు పోటెత్తిన జనాన్ని ఉద్దేశించి అన్నారు. 'మండిలో ఇప్పుడు ఏ రేటు పలుకుతోంది' అని కంగనాపై సుప్రియ ఇన్‌స్టాగ్రాంలో పెట్టిన పోస్టు దుమారం రేపడం తెలిసిందే.

డిజిటల్ టెక్నాలజీకి పెద్దపీట

- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో 'చాయ్ పే చర్చ'
- కృత్రిమ మేధ దుర్వినియోగమయ్యే ప్రమాదం పొంచి ఉంది
- డిజిటల్ విప్లవానికి ప్రజలే సారథులు కావాలన్న మోదీ

న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై తనకెంతో ఆసక్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. టెక్నాలజీలో తాను నిపుణుడిని కాకపోయినా దానిపై చిన్నపిల్లలకు ఉండే ఉత్సుకత తనకు కూడా ఉందని తెలిపారు. అదేసమయంలో టెక్నాలజీకి తాను బానిస కాలేదని వివరించారు. ప్రధాని మోదీ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శుక్రవారం 'చాయ్ పే చర్చ' నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు విద్య, వైద్యం, వ్యవసాయం, వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, కృత్రిమ మేధ వంటి కీలక అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని బిల్‌గేట్స్‌కు తెలియజేశారు. ఇండియాలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో నూతన సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. బిల్‌గేట్స్‌తో మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

కృత్రిమ మేధ.. మంత్రదండం కాదు

''నేడు డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల అవసరం చాలా ఉంది. డిజిటల్ టెక్నాలజీపై ప్రజలకు అవగాహన పెంచాలి. కృత్రిమ మేధ(ఏఐ) వంటి శక్తివంతమైన సాంకేతికత దుర్వినియోగమయ్యే ప్రమాదం పొంచి ఉంది. నైపుణ్యం లేని వ్యక్తుల చేతుల్లో ఇలాంటి టెక్నాలజీ పడితే దుష్పరిణామాలు తప్పవు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. నియమ నిబంధనలు అమలు చేయాలి. ఏఐతో సృష్టించే కంటెంట్‌లో వాటర్‌మార్క్‌ను జోడించాలి. ఏఐతో సృష్టించే డీప్‌ఫేక్‌ల విషయంలో అప్రమత్తత అవసరం. ఏఐని అన్నీ సాధించిపెట్టే మంత్రదండంగా చూడొద్దు. అంటే కృత్రి మేధ విలువను తగ్గించడం నా ఉద్దేశం కాదు. గత ఏడాది జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ఏఐని నేను ఉపయోగించుకున్నా. పలు కార్యక్రమాల్లో నా ప్రసంగాలను వేర్వేరు భాషల్లో ప్రసారం చేయడానికి ఈ టెక్నాలజీ తోడ్పడింది.

భూగోళాన్ని కాపాడుకోవాలి

వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా పెను సవాళ్లు విసురుతున్నాయి. భూగోళాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. విద్యుత్ లేదా ఉక్కు వినియోగాన్ని అభివృద్ధికి కొలమానంగా చూపుతున్నారు. ఈ ధోరణి కచ్చితంగా మారాలి. విద్యుత్, ఉక్కు విచ్చలవిడి ఉత్పత్తి వల్ల పర్యావరణానికి చేటు తప్పదన్న సంగతి మర్చిపోవద్దు. ఇకపై గ్రీన్ జీడీపీ, గ్రీన్ ఎంప్లాయ్‌మెంట్ వంటి పరిభాషను ఉపయోగించాలి. వస్తువుల పునఃశుద్ధి, పునర్వినియోగం ఇండియాలో చాలా సహజం. ఇప్పుడు నేను ధరించిన జాకెట్ రీసైకిల్ చేసిన ఉత్పత్తే. టెక్నాలజీ అంటే కేవలం సేవలను విస్తరించడానికే కాదు, సామాన్య ప్రజల జీవితాలను మరింత సులభతరం చేయాలని నేను నమ్ముతున్నా.

తృణధాన్యాల సాగుకు ప్రాధాన్యం

గత ఏడాది ఇండియాలో జీ20 సదస్సు నిర్వహించిన తర్వాత వాతావరణ మార్పులపై యుద్ధంలో వేగం పెరిగింది. వాతావరణ మార్పులను ఎదుర్కోవాలంటే మన జీవన శైలిని పర్యావరణ హితంగా మార్చుకోవాలి. ప్రకృతి, పర్యావరణహితమైన నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. విద్యుత్‌ను వృథా చేస్తే, నీటిని విచ్చలవిడిగా ఉపయోగిస్తే అనుకున్న లక్ష్యం సాధించలేం. తక్కువ నీరు అవసరమయ్యే తృణధాన్యాల సాగును పెంచడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. తృణధాన్యాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పెద్ద ముప్పుగా మారింది. త్వరలో కొలువుదీరే మా నూతన ప్రభుత్వ హయాంలో మహిళలకు.. ముఖ్యంగా బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తాం.

సాంకేతిక ప్రజాస్వామీకరణ

పునరుద్పాతక ఇంధన రంగంలో మేము శరవేగంగా దూసుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ తయారీలో మరింత అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నాం. 'సాంకేతిక ప్రజాస్వామీకరణ' మా విధానం. డిజిటల్ విప్లవంలో గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట వేశాం. ఈ రంగంలో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నాం. డిజిటల్ విప్లవానికి సామాన్య ప్రజలే నాయకత్వం వహించాలన్నది మా ఆకాంక్ష. ఆ దిశగా 'డ్రోన్ దీదీ' పథకాన్ని ప్రవేశపెట్టాం.



శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో బిల్ గేట్స్‌తో ప్రధాని మోదీ

నమో యాప్‌లో సెల్ఫీ

టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఇండియా చూపుతున్న చొరవను, వేగాన్ని బిల్‌గేట్స్ ప్రశంసించారు. ఈ విషయంలో ఇతర దేశాలకు మార్గదర్శిగా మారిందని కొనియాడారు. కృత్రిమ మేధను తాను ఉపయోగించుకుంటున్న తీరును గేట్స్‌కు మోదీ తెలియజేశారు. తన సెల్‌ఫోన్‌ను గేట్స్‌కు ఇచ్చి, అందులోని 'నమో' యాప్ ద్వారా సెల్ఫీ తీయాలని కోరారు. అందులోని టెక్నాలజీతో పాత ఫొటోలూ కనిపిస్తాయని అన్నారు. గతంలో తామిద్దరం దిగిన ఫొటోలను గేట్స్‌కు చూపించారు.

నా భర్తను దీవించండి

'కేజ్రీవాల్‌కు దీవెనలు' కార్యక్రమం ప్రారంభించిన భార్య సునీత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అక్రమాల కేసులో అరెస్టయి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు నైతిక మద్దతు ప్రకటించాలని ఆయన భార్య సునీత విజ్ఞప్తిచేశారు. నిరంకుశ ప్రభుత్వంపై పోరాడుతున్న ఆయన విజయం సాధించేలా ఆయన కోసం ప్రార్థనలు చేయాలని, ఆయనను దీవించాలని ఆమె కోరారు. మీ ఆశీర్వాదాలు, ప్రార్థనలు, సలహాలు, సూచలను 8297324624, 9700297002 వాట్సాప్ నంబర్లకు పంపించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె 'కేజ్రీవాల్‌కి ఆశీర్వాదాలు' పేరిట ఒక కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ డిజిటల్‌మీడియా వేదికగా పౌరులనుద్దేశిస్తూ శుక్రవారం ప్రసంగించారు.

కేజ్రీవాల్ అరెస్టుపై ఐరాస స్పందన

ఐరాస: భారత్‌లో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా జరగుతుందని ఆశిస్తున్నట్టు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అధికార ప్రతినిధి స్టెఫానే దుజరిక్ అన్నారు. మీడియా భేటీ సందర్భంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాల స్తంభనపై ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు స్పందించారు. భారత్‌లోనే గాక ఎన్నికలు జరిగే ప్రతి దేశంలోనూ ప్రజల రాజకీయ, పౌర హక్కులకు భద్రత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటేసే పరిస్థితి ఉండాలని అభిప్రాయపడ్డారు. కేజ్రీవాల్ అరెస్టు తదితరాలపై తొలుత జర్మనీ, తర్వాత అమెరికా కూడా ఇలాగే స్పందించి భారత్ ఆగ్రహాన్ని చవిచూడటం తెలిసిందే. వాటిపై అమెరికా రాయబార కార్యాలయంలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బార్బెనాకు విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఆమెను విదేశాంగ శాఖ కార్యాలయానికి పిలిపించి తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చింది. ఆ తర్వాత కూడా కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా మరోసారి స్పందించింది. న్యాయ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగలన్నదే తమ వైఖరి అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వ్యాఖ్యలు చేశారు. తమ స్పందనలో తప్పేమీ లేదంటూ సమర్థించుకున్నారు. దీనిపై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చింది.

లోయలో పడ్డ తవేరా..10 మంది మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మృత్యువాతపడ్డారు. జమ్మూ–శ్రీనగర్ హైవేపై రంబన్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి దాటాక ఘటన చోటుచేసుకుంది. తవేరా ట్యాక్సీ అదుపుతప్పి 300 అడుగుల లోయలో పడిపోయింది. డ్రైవర్‌తో పాటు అందరూ చనిపోయారు. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బస్సు లోయలో పడి 45 మంది మృతి

దక్షిణాఫ్రికాలో ఘోర ప్రమాదం..



కేప్ టౌన్: ఈస్టర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న వారిని బస్సు ప్రమాదం కబళించింది. దక్షిణాఫ్రికాలోని లింపోపో ప్రావిన్స్‌లో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోగా ఒక్క చిన్నారి గాయాలతో సజీవంగా బయటపడింది. బోట్స్‌వానాకు చెందిన వీరంతా దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఈస్టర్ ఉత్సవాలకు వెళ్తున్నారు. అదుపు తప్పిన బస్సు కొండప్రాంతంలోని ఎంమట్లకలా వద్ద వంతెన బారియర్లను ఢీకొట్టింది. ఆ పక్కనే ఉన్న 164 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ముక్కలైన బస్సులో భారీగా మంటలు చెలరేగి కొందరు సజీవ దహనం కాగా, మరికొందరు దూరంగా పడిపోయారు. ఘటనలో డ్రైవర్ సహా మొత్తం 45 మంది ప్రాణాలు కోల్పోగా ఎనిమిదేళ్ల చిన్నారి మాత్రమే సజీవంగా బయటపడింది. మంటల్లో కొందరి మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోయాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయిన స్థితిలో నుజ్జయిన బస్సులో ఇరుక్కుపోయాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎనిమిదేళ్ల చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పొరుగు దేశం బోట్స్‌వానాకు చెందిన బాధితులంతా దక్షిణాఫ్రికాలోని మోరియా పట్టణంలో ఘనంగా జరిగే 'జియోన్ క్రిస్టియన్ చర్చి' ఈస్టర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా బోట్స్‌వానా అధ్యక్షుడు మసిసితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయనకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈస్టర్ పండుగ రద్దీ సమయంలో రోడ్డు ప్రయాణాలు చేసే వారు జాగ్రత్తగా ఉండాలని దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను సైతం చేపట్టినప్పటికీ దుర్ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

వివాహేతర సంబంధం పెట్టుకుంటే రాళ్లతో కొట్టి చంపుతాం

అఫ్గాన్ మహిళలకు తాలిబాన్ల హెచ్చరిక

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో మధ్యయుగాల నాటి ఛాందసవాద పాలనకు తెరలేపిన తాలిబాన్లు ప్రజల పట్ల మరింత దారుణంగా వ్యవహరించనున్నారు. ముఖ్యంగా మహిళలపై కఠిన ఆంక్షల కొరడాను మరోసారి ఝులిపించారు. వివాహేతర సంబంధం, వ్యభిచారానికి ఒడిగట్టే మహిళలను బహిరంగంగా రాళ్లతో కొట్టి చంపుతామని తాలిబాన్లు హెచ్చరించారు. ఈ మేరకు తాలిబాన్ల సుప్రీం లీడర్ ముల్లా హిబాతుల్లా అకుంద్‌జాదా అఫ్గాన్లనుద్దేశిస్తూ ప్రభుత్వ టీవీ చానెల్‌లో శనివారం ఒక ఆడియో సందేశం ఇచ్చారు. ''అంతర్జాతీయ సమాజం చెబుతున్నట్లు మహిళలకు హక్కులు ఉండాలంటారా? అవి మన ఇస్లామిక్ షరియా చట్టాలు, మన మతాధికారుల నియమాలకు వ్యతిరేకం. మేం చాయ్ తాగుతూ చూస్తూ ఊరుకుంటామని అనుకుంటున్నారేమో! ఈ నేలపై షరియా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి తీరతాం. వివాహేతర సంబంధాలు, వ్యభిచారం ఘటనల్లో మహిళలను అందరూ చూస్తుండగా కొయ్యకు కట్టేసి రాళ్లతో కొట్టి చంపుతాం'' అని అకుంద్‌జాదా హెచ్చరించారు.

అమానుష ఫొటోకు అవార్డా!

నెటిజన్ల తీవ్ర ఆగ్రహం



వాషింగ్టన్: ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాలపై హమాస్ మిలిటెంట్ల మెరుపుదాడి ఘటనలో ఒక యువతిని అపహరించి అర్ధనగ్నంగా ఊరేగించిన ఫొటోకు అంతర్జాతీయ అవార్డ్ ఇవ్వడం వివాదాస్పదమైంది. ఫొటోలో యువతిని బ్లర్ చేయకుండానే ఇంటర్నెట్‌లో పెట్టడంతో అవార్డుల సంస్థపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంలో జరుగుతున్న సంగీత విభావరిపై హమాస్ మిలిటెంట్లు దాడి చేయడం, దాదాపు 360 మందిని చంపేయడం తెలిసిందే. జర్మనీకి చెందిన 22 ఏళ్ల పర్యాటకురాలు షానీ లౌక్‌తో పాటు పలువురిని కిడ్నాప్ చేశారు. ఆమెను అపహరించి అర్ధనగ్నంగా గాజా వీధుల్లో ఊరేగిస్తుండగా 'ది అసోసియేటెడ్ ప్రెస్' వార్తాసంస్థ పలు ఫొటోలు తీసింది. నాటి దారుణానికి సజీవ సాక్ష్యంగా నిలిచిందంటూ ఈ ఫొటోకు 'టీమ్ పిక్చర్ స్టోరీ ఆఫ్ ది ఇయర్' కేటగిరీ కింద ప్రథమ బహుమతి ప్రకటించారు. అమెరికాలోని కొలంబియాలో ఉన్న మిస్సోరీ స్కూల్ ఆఫ్ జర్నలిజం విభాగమైన డొనాల్డ్ రేనాల్డ్స్ జర్నలిజం ఇన్‌స్టిట్యూట్ ఈ అవార్డును ప్రకటించింది. ఊరేగింపు ఘటన జరిగిన కొద్ది రోజులకు గాజాలో షానీ లౌక్ పుర్రె భాగం ఇజ్రాయెల్ బలగాలకు దొరికింది. దీంతో హమాస్ మూకలు ఈమెను చిత్రవధ చేసి చంపేశాయని ఇజ్రాయెల్ అక్టోబర్ 30న ప్రకటించింది. ఆమె మృతదేహం ఇంకా గాజాలోనే ఉంది. నాటి నరమేధానికి బలైన అభాగ్యురాలిని ఇలా అవార్డు పేరిట అవమానిస్తారా? అంటూ ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు మండిపడుతున్నారు. అయితే ఈ ఫొటోలను అసోసియేటెడ్ ప్రెస్ తీయలేదని, హమాస్ మిలిటెంట్లలో ఒకరు తీసిన ఫొటోలను అసోసియేటెడ్ ప్రెస్ సంపాదించిందని కొందరు వ్యాఖ్యానించారు.

ఒకే వేదికపైకి బైడెన్, క్లింటన్, ఒబామా!

న్యూయార్క్: డెమొక్రాటిక్ పార్టీ తరఫున మరోసారి అధ్యక్ష రేసులో ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిధుల సేకరణ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. గురువారం రాత్రి న్యూయార్క్‌లోని రేడియో సిటీ మ్యూజిక్ హాల్‌లో జరిగిన ఈ కార్యమానికి మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్ హాజరయ్యారు. బైడెన్‌కు ఏకంగా 26 మిలియన్ డాలర్ల (సుమారు రూ.216 కోట్లు) పైచిలుకు నిధులు సమకూరాయి. అమెరికా అధ్యక్ష ప్రచారంలో ఒక్క కార్యక్రమంలో ఇంత భారీ విరాళాలు రావడం ఇదే తొలిసారి!



న్యూయార్క్‌లోని రేడియో సిటీ మ్యూజిక్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు బైడెన్, బరాక్ ఒబామా, బిల్ క్లింటన్


గుడ్ ఫ్రైడే సందర్భంగా ఢిల్లీలోని సేక్రేడ్ హార్ట్ కేథడ్రల్‌లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు


శుక్రవారం ఢిల్లీలో ఆప్ మహా ర్యాలీ ఆహ్వాన కరపత్రాలను పంపిణీ చేస్తున్న పార్టీ నేత గోపాల్ రాయ్


ముంబైలో శుక్రవారం ఆల్ ఇండియా మెమన్ జమాత్ ఫెడరేషన్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో మహిళలు, పిల్లలు

క్లుప్తంగా...

పుణేలో 31న వైఎస్సార్సీపీ ఆత్మీయసమావేశం
ముఖ్య అతిథులుగా చెవిరెడ్డి, దద్దాల నారాయణ యాదవ్



పుణే: పట్టణంలోని ఘోర్పడి ప్రాంతంలోని కంటోన్మెంట్ సభాగృహంలో ఆదివారం వైఎస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం జరగనుందని పార్టీ స్థానిక నాయకులు తెలిపారు. ఈకార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, కనిగిరి నియోజకవర్గ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బాలాజీ మందిరం నుంచి నిగడే నగర్, బాలాజీనగర్, అనంత్ థియేటర్ల మీదుగా ఘోరిపుడి కంటన్మెంట్ హాల్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని, సాయంత్రం 6 గంటలనుంచి 10 గంటల వరకు ఆత్మీయ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ ఈ సమావేశంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ చోరీపై టోరెంట్ పవర్ కేసు
ఇద్దరు వ్యక్తుల అరెస్టు

భివండీ: విద్యుత్ చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై టోరెంట్ పవర్ కంపెనీ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాల్హేర్‌ని రాయల్ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న నయన్ పాటిల్, పూర్ణ గ్రామానికి చెందిన ప్రభాకర్ మోతీరాం ఖండాగలే దాదాపు రెండేళ్లుగా విద్యుత్ చోరీకి పాల్పడుతున్నారని, నిందితులిద్దరూ మొత్తం 4477 విద్యుత్ యూనిట్లను అక్రమంగా వినియోగించారని, తద్వారా కంపెనీకి రూ.2, 81,000 వేల మేర నష్టం కలిగించారని పేర్కొన్నారు. కంపెనీ ఫిర్యాదు మేరకు శాంతినగర్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను విచారిస్తున్నారు.

రాష్ట్ర సీఎస్ నితిన్ కరీర్‌కు అదనపు సర్వీసు
లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాలు



దాదర్: స్టేట్ చీఫ్ సెక్రటరీ (సీఎస్) నితిన్ కరీర్‌ను మరో మూడు నెలలు అదనంగా సర్వీసులో కొనసాగాల్సించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవంగా కరీర్ ఈ నెల 31వ తేదీన పదవి విరమణ చేయాల్సిఉంది. అయితే ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాలతో కరీర్ జూన్ 30 వరకూ చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వహించనున్నారు. అప్పటికి లోక్‌సభ ఎన్నికలు, ఫలితాల ప్రక్రియ ముగుస్తుంది. అనంతరం ఆయన్ను సర్వీసులో కొనసాగించాలా? వద్దా? అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించనుంది.

అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడుగా రాజేశ్

భివండీ: స్వామి అయ్యప్ప ఆలయ సేవా సమితి అధ్యక్షుడుగా రాజేశ్ ఎమ్. శెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ట్రస్టీ పదాధికారులు, కమిటీ పదాధికారులు, సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆలయ వ్యవస్థాపకుడు సంతోశ్ శెట్టి చేతుల మీదుగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలే శ్రీనివాస్, వడ్లకొండ రాము, వీరబత్తిని పరమేశ్వర్, సతీశ్ శెట్టి, ప్రశాంత్ పూజారి, దిలిప్ పోద్దార్, బాలే రవి, సుంకి కరణ్, సామల కిరణ్ పాల్గొన్నారు.

క్యాబ్ యజమానులకు
ఎంఎంఆర్‌టీఏ 'కూల్' కబురు

- చార్జీల పెంపునకు అనుమతి
- క్యాబ్ యజమానుల హర్షం
- ప్రయాణికుల్లో అసహనం
- రాకపోకలు ఎక్కువగా ఉండే వేసవి సీజన్‌లో ఇలాంటి నిర్ణయమేమిటని ఆగ్రహం
- సంస్థ నిర్ణయంతో ప్రయాణికులపై అదనపు చార్జీల భారం



దాదర్: నగరంలో షేర్ కూల్ క్యాబ్ యజమానులకు ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఎంఎంఆర్‌టీఏ) తీపికబురు చెప్పింది. ముంబై-పుణే, ముంబై-నాసిక్, ముంబై-షిర్డీ నగరాల మధ్య తిరిగే షేర్ కూల్ క్యాబ్ చార్జీలు పెంచేందుకు అనుమతినిచ్చింది. కొత్త చార్జీలు ఏప్రిల్ మొదటి వారం నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ నిర్ణయంతో ఒక్కో ప్రయాణికుడిపై రూ.50-200 మేర అదనపు భారం పడనుందని వెల్లడించారు. కాగా చార్జీల పెంపునకు అనుమతి లభించడంపై షేర్ కూల్ క్యాబ్ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలు కారణాలతో వాహనాల నిర్వహణ కష్టంగా మారిన తరుణంలో సంస్థ ఆదేశాలు తమకు గొప్ప ఊరట కలిగించాయని సంతోషపడుతున్నారు. అయితే ప్రయాణికులు మాత్రం ఈ ఆదేశాలపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎంఎంఆర్‌టీఏ నిర్ణయంతో తమ జేబుకు చిల్లు పడనుందని, రాకపోకలు ఎక్కువగా ఉండే వేసవి సీజన్‌లో చార్జీల పెంపునకు అనుమతినివ్వడమేమిటని పెదవి విరుస్తున్నారు.

గతంలోనే అనుమతినిచ్చినా...

ముంబై నుంచి పుణే, నాసిక్, షిర్డీల మధ్య నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వీరి కోసం మూడు నగరాల మధ్య ప్రతీరోజు పదుల సంఖ్యలో ఎమ్మెస్సార్టీసీ, ప్రైవేటు బస్సులు తిరుగుతున్నాయి అదేవిధంగా ముంబై-పుణే-నాసిక్‌ల మధ్య ప్రతీరోజు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా నడుస్తున్నాయి. అయితే ప్రయాణికుల రద్దీకి తగినట్లుగా సర్వీసుల సంఖ్య లేకపోవటంతో బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతుంటాయి. దీంతో బస్సులు, రైళ్లతో పోలిస్తే ఖర్చు కాస్తంత ఎక్కువే అయినా సౌకర్యంగా ప్రయాణించవచ్చన్న కారణంతో కొందరు ప్రయాణికులు ఏసీ, నాన్ ఏసీ క్యాబ్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలా ప్రతీరోజు వందల మంది ప్రయాణికులు వివిధ రూట్లలో క్యాబ్‌ల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు కాబట్టి సీజన్, అన్ సీజన్ అనే తేడా లేకుండా ఏడాది పొడవునా వీటికి డిమాండ్ ఉంటుంది. వేసవిలో ఇది మరింత ఎక్కువ.అయితే తరుచూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ చార్జీల వల్ల తక్కువ రుసుముతో క్యాబ్‌లు నడపడం కష్టంగా మారిందని, రోడ్ల దుస్థితి కారణంగా వాహనాల నిర్వహణ భారం కూడా అధికమైందని క్యాబ్ యజమానులు సంస్థకు మొరపెట్టుకోవటంతో ముంబై-పుణే నగరాల మధ్య చార్జీలు పెంచుకునేందుకు గతంలో ఎంఎంఆర్‌టీఏ అనుమతినిచ్చింది. ఆ తరువాత ఇప్పటి వరకు చార్జీలు పెంచలేదు.

క్యాబ్ యూనియన్ ఒత్తిడి మేరకు..

చార్జీల పునరుద్ధరణపై సంస్థ నుంచి ఉలుకూపలుకూ లేకపోవటంతో చార్జీల పెంపుతోపాటు, పెండింగులో ఉన్న ఇతర డిమాండ్లను కూడా నెరవేర్చాలని క్యాబ్ యూనియన్ ప్రతినిధులు అథారిటీపై పలుమార్లు ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ మేరకు సంస్థ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ అవి విఫలమయ్యాయి. చివరకు యూనియన్ ప్రతినిధులు, అథారిటీ అధికారుల మధ్య ఇటీవల జరిగిన సమావేశంలో చార్జీల పెంపునకు ఆమోదం లభించింది.

పాత, కొత్త చార్జీల వివరాలు..

నగరాలు	పాత చార్జీలు	కొత్త చార్జీలు
ముంబై-నాసిక్ (ఏసీ)	రూ.475	రూ.575
ముంబై-షిర్డీ (ఏసీ)	రూ.625	రూ.825
ముంబై-పుణే (నాన్ ఏసీ)	రూ.450	రూ.500
ముంబై-పుణే (ఏసీ)	రూ.525	రూ.575

ప్రణతి శిందేకు సహకరిస్తాం



- మామధ్య ఉన్నవి రాజకీయ విబేధాలే
- వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బందులూ లేవు
- విలేకరుల సమావేశంలో సోలాపూర్ మాజీ మేయర్ మహేష్ వ్యాఖ్యలు
- ప్రణతి గెలుపునకు కృషి చేస్తామని హామీ

సోలాపూర్: కాంగ్రెస్ అభ్యర్థి ప్రణతి శిందేకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఆమె తరఫున నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తామని పట్టణ మాజీ మేయర్ మహేష్ కోటే తెలిపారు. శుక్రవారం సోలాపూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారం ప్రణతి శిందేకు సహకరిస్తామని, ఆమె విజయం కోసం కృషి చేస్తా మని హామీ ఇచ్చారు. ఎన్సీపీ(శరద్ పవార్)ను వీడేది లేదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో ప్రణతి శిందే కూడా పాల్గొన్నారు.

విభేదాలు మరచి....

కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి సుశీల్ కుమార్ శిందేకు అత్యంత నమ్మకస్తుడిగా పేరొందిన విష్ణు పంత్ కోటే కుమారుడే ఈ మహేష్ కోటే. విష్ణుపంత్ కోటే అప్పట్లో అసెంబ్లీ టికెట్‌ను ఆశించారు. కానీ కాంగ్రెస్ ఆయనకు అవకాశమివ్వలేదు. అనంతరం రాజకీయాల్లో ప్రవేశించిన మహేష్ కోటేకు మాత్రం 2009లో నార్త్ సోలాపూర్ అసెంబ్లీ టికెట్‌ను కేటాయించింది. అయితే మహేష్ ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. పార్టీ లోని అంతర్గత కలహాలు, శిందే కుటుంబం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందకపోవడం వల్లే తాను అపజయం పాలయ్యానని భావించిన మహేష్ కోటే 2014లో కాంగ్రెస్‌ను వదిలి శివసేనలో చేరారు. అనంతరం పలు రాజకీయ కారణాల వల్ల ఎన్సీపీలో చేరారు. ఎన్సీపీ ఇండియా కూటమి మిత్రపక్షంగా ఉన్న నేపథ్యంలో పార్టీ స్థానిక నాయకుడైన మహేష్ కోటే ప్రణతి శిందే తరఫున ప్రచారం నిర్వహించేందుకు అంగీకరిస్తారా లేదా అన్న అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన మహేష్ కోటే ప్రచారం విషయమై స్పష్టతనిచ్చారు. తమ మధ్య రాజకీయంగా తప్ప వ్యక్తిగతంగా ఎలాంటి విబేధాలు లేవని, అందుకే ప్రణతి శిందే తరఫున ఎన్నికల ప్రచారం చేయాలనుకుంటున్నామని తెలిపారు.

మూడో వ్యక్తిని కూడా ఓడిస్తాం



- ప్రణతి శిందేపై బీజేపీ అభ్యర్థి రామ్ సాత్ పూతే వ్యాఖ్య
- శిందే దంపతుల మాదిరే ప్రణతిని కూడా ఓడించాలని సోలాపూర్ ప్రజలకు పిలుపు
- అభివృద్ధే ప్రధానాంశంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని వెల్లడి

సోలాపూర్: శిందే కుటుంబం నుంచి పోటీ చేస్తున్న మూడోవ్యక్తిని కూడా ఓడించాలని బీజేపీ అభ్యర్థి రామ్ సాత్ పూతే సోలాపూర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సాత్ రాస్తాలో ఉన్న శివసేన భవన్‌ను సందర్శించిన రామ్ సాత్ పూతే... సుశీల్ కుమార్ షిండే, ఆయన సతీమణి ఉజ్వల శిందే గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి ఓడిపోయారని ప్రస్తుతం పోటీలో ఉన్న వారి కుమార్తె ప్రణతి శిందేను కూడా ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి ఎజెండాతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, తాము ఇదే అంశంతో ప్రజల్లోకి వెళతామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మనీష్ కాళ్జే మాట్లాడుతూ... రామ్ సాత్ పూతేను అఖండ మెజారిటీతో గెలిపిస్తామని, ఆయన విజయం తథ్యమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఏకనాథ్ శిందే ఆదేశాలను శివసైనికులు తూచా తప్పకుండా పాటిస్తారని, శివసేన పదాధికారులందరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ టింగే పాటిల్, కోమల్ కర్పే, బ్రహ్మదేవ్ గైక్వాడ్, ప్రకాష్ ముదుగల్, రాజేంద్ర కాంబ్లే తదితర పదాధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థిరమైన ఇంధన పరిష్కారాలే మా లక్ష్యం

- విలేకరుల సమావేశంలో సోలాపూర్ ఎన్టీపీసీ చీఫ్ జీఎం తపన్‌కుమార్ బంధోపాధ్యాయ
- ఈ ఏడు రికార్డు స్థాయిలో సంస్థ వార్షిక ఉత్పత్తి
- ఇది నిరుటి కన్నా అధికమని వెల్లడి
- పర్యావరణ పరిరక్షణకు సంస్థ ఇతోధిక కృషి
- సమీప గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు



సోలాపూర్: సోలాపూర్ ఎన్టీపీసీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో వార్షిక ఉత్పత్తిని నమోదు చేసిందని, గతేడాదికన్నా ఇది అధికమని సంస్థ అధికారులు తెలిపారు. ఇది పవర్ స్టేషన్ సిబ్బంది నిబద్ధతను, విశ్వసనీయతలను ప్రతిబింబిస్తోందని సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ తపన్ కుమార్ బంధోపాధ్యాయ వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఎన్టీపీసీ పురోగతిని గురించి చుట్టుపక్కల గ్రామాల్లో సంస్థ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ బిపుల్ కుమార్ ముఖోపాధ్యాయ, ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ వివిఎస్ఎన్. మూర్తి, ఆపరేషన్ జనరల్ మేనేజర్ పరిమళ్ కుమార్ మిత్రా, హెచ్ఓహెచ్ఆర్ మనోరంజన్ సారంగిలతో పాటు పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు.

సమీప గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

ఈ సందర్భంగా తపన్ కుమార్ మాట్లాడుతూ...స్థిరమైన ఇంధన పరిష్కారాలే సోలాపూర్ ఎన్టీపీసీ లక్ష్యమని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సంస్థ బాధ్యతాయుతంగా కృషిచేస్తోందని, ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ ద్వారా సల్ఫర్ సమ్మేళనాల ఉద్గారాలను తగ్గించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. అలాగే రికార్డు స్థాయిలో బూడిద వినియోగాన్ని సాధించామని వెల్లడించారు. ఎన్టీపీసీ చుట్టుపక్కల గ్రామాల్లో అభివృద్ధి, విద్య,ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలపై సంస్థ దృష్టి సారించిందని ఈ మేరకు యువతీయువకులకు ఉపాధి ఆధారిత శిక్షణనిస్తున్నామని వారిలో నైపుణ్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే మహిళలు, రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలతో పాటు మరియు మహిళా స్వయంసహాయక బృందాల కోసం గార్మెంట్ యూనిట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. బాలిక సాధికారిక మిషన్ కార్యక్రమం కింద సోలాపూర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల నుండి ఏటా 40 మంది బాలికలకు ఉచిత విద్యతో పాటు, ఆత్మ రక్షణ, సాంస్కృతిక అంశాలపై శిక్షణనిస్తున్నామని, ప్రతిభావంతులైన విద్యార్థులు కే ఎల్ ఈ పాఠశాలల్లో ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఔరంగాబాద్ లో 40 మంది యువకులకు ఆరు నెలల సి ఫైట్ శిక్షణను అందించి 100% ప్లేస్‌మెంట్ సాధించామని వెల్లడించారు. దక్షిణ సోలాపూర్ తాలూకాలోని 52 జిల్లా పరిషత్ పా ఠశాలల్లో డిజిటలైజేషన్ కోసం ఆర్థిక సాయం అందించామని, పట్టణ ప్రజల అవసరాల కోసం సోలాపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో కలిసి ఉజ్జ యిని నుంచి సోలాపూర్ వరకు వేస్తున్న తాగునీటి పైప్‌లైన్ పనులు త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు.

లెక్కలు తేలేదెప్పుడు?



- మహాయుతిని వీడని సీట్ల చిక్కుముడి
- 14 సీట్లపై మూడుపార్టీల చర్చలు
- తొలివిడత నామినేషన్లు పూర్తైనా ఇంకా కొలిక్కిరాని వైనం

సాక్షి ముంబై: మహాయుతి కూటమిలో సీట్ల పంపకాల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. తొలివిడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ మహాయుతి కూటమి తరఫున ఇప్పటికీ కేవలం 34 మంది అభ్యర్థులనే ప్రకటించారు. వీరిలో బీజేపీ తరఫున 23, శివసేన (శిందే)తరఫున 8, ఎన్సీపీ (అజిత్ పవార్) తరఫున ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగనుండగా మిగిలిన 14 సీట్లపై ఇంకా స్పష్టత రాలేదని ముఖ్యంగా నాసిక్, థానే కళ్యాణ్, దక్షిణముంబై, సతారా, పర్భణీ, ధారాశీవ్, ఛత్రపతి సంభాజీనగర్, రత్నగిరి-సింధుదుర్గ్ నియోజకవర్గాలపై ఆయా పార్టీల మధ్య ఇంకా సయోధ్య కుదరలేదని సమాచారం. మరోవైపు నాసిక్ లోకసభ స్థానం నుంచి శివసేన (శిందే)పార్టీ సిట్టింగ్ ఎంపీ హేమంత్ గోడ్సే మళ్లీ పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే స్థానిక బీజేపీ నాయకులు మాత్రం ఆయనను బరిలోకి దింపడంపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తంచేస్తున్నారు. ఇక పర్భణీ లోక్‌సభ స్థానం నుంచి మహాదేవ్ జాన్కర్‌కు బరిలోకి దింపాలని బీజేపీ భావిస్తుండగా శివసేన (శిందే) పార్టీ స్థానిక నాయకులు మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నారు. కాగా మిగతా నియోజకవర్గాల పరిస్థితి కూడా ఇదేనని తెలుస్తోంది.

ఎమ్‌డీఆర్‌టీ క్లబ్ విజేతలుగా తెలుగువారు



భివండీ: తెలుగు వ్యక్తులు బిర్రు శ్రీనివాస్, వెల్దండి రవీందర్‌లు ఎమ్‌డీఆర్‌టీ క్లబ్ విజేతలుగా ఎంపికైనట్లు ఎల్ఐసీ భివండీ శాఖ ప్రకటించింది. శుక్రవారం కెఐన్ పార్క్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరినీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సాయిలీ వాలింజ్‌కర్ మాట్లాడుతూ... తమ బ్రాంచ్‌లో 1,000 మంది ఏజెంట్లుండగా తెలుగువారైన బిర్రు శ్రీనివాస్, వెల్దండి రవీందర్‌లు మాత్రమే టార్గెట్‌ను సాధించారని, బిర్రు శ్రీనివాస్ విజేతగా నిలవటం ఇది మూడోసారని ప్రశంసించారు.

శివసేన (శిందే) తొలిజాబితా విడుదల

- ఎనిమిది మంది అభ్యర్థులకు టికెట్ ఖరారు
- రామ్‌టేక్ మినహా మిగిలిన సీట్లన్నీ సిట్టింగ్ ఎంపీలకే
- కల్యాణ్, థానేలపై వీడని సస్పెన్స్



సాక్షి ముంబై: శివసేన (శిందే) పార్టీ ఎట్టకేలకు తొలి జాబితాను ప్రకటించింది. తొలివిడతలో ఎనిమిది మంది అభ్యర్థులకు టికెట్‌ను ఖరారు చేస్తూ శుక్రవారం మొదటి జాబితాను విడుదలచేసింది. రామ్‌టేక్ లోకసభ నియోజకవర్గం మినహా మిగిలిన స్థానాలన్నిటికీ సిట్టింగ్ ఎంపీలనే అభ్యర్థులుగా ప్రకటించింది. రామ్‌టేక్‌లో కపాల్ తుమానేకు బదులుగా ఇటీవలే కాంగ్రెస్‌నుంచి శివసేన (శిందే)వర్గంలో చేరిన రాజు పారవేకు టికెట్ లభించింది. మిగిలిన స్థానాలైన మావల్‌లో శ్రీరంగ్ బారణే, హింగోలిలో హేమంత్ పాటిల్, హాతకణంగలేలో ధైర్యశీల్ మానే, కొల్హాపూర్‌లో సంజయ్ మండలిక్, బుల్డాణాలో ప్రతాప్‌రావ్ జాధవ్, శిర్డీలో సదాశివ్ లోఖండే, దక్షిణ మధ్య ముంబైలో రాహుల్ శెవాలేలు ఎన్నికల బరిలో దిగనున్నారు.

థానే, కళ్యాణ్‌లపై వీడని ఉత్కంఠ

కళ్యాణ్, థానే లోకసభ నియోజకవర్గాల టికెట్లు ఎవరికి ఇవ్వాలన్న అంశంపై పార్టీ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కుమారుడు శ్రీకాంత్ శిందే ప్రస్తుతం కళ్యాణ్ ఎంపీగా ఉన్నారు. అయితే పొత్తులో భాగంగా సీటును బీజేపీ ఆశిస్తోందని, దీనికి బదులుగా శ్రీకాంత్ శిందేకు థానే టికెట్‌ను కేటాయించాలని ప్రతిపాదిస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ విడుదల చేసిన జాబితాలో కళ్యాణ్, థానే స్థానాల ప్రస్తావన లేకపోవటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.





కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం. మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

మోసగాళ్లను నమ్మొద్దు

వారి తోకలు కత్తిరించేలా మీరే స్టార్ క్యాంపెయినర్లు కావాలి

ఎమ్మిగనూరు సభలో ప్రజలకు సీఎం వైఎస్ జగన్ పిలుపు

మాది పేదల పార్టీ.. పేదలకు టికెట్లు ఇస్తాం

చంద్రబాబు ఈ రోజు శింగనమలకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ ఓ టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చిందని హేళన చేసి తూలనాడారు. ఆ పిల్లోడు చదువులపై కూడా తప్పులు చెప్పారు. అవునయ్యా.. పేదవాడికి టికెట్ ఇచ్చాం. తప్పేముందయ్యా చంద్రబాబూ? వీరాంజనేయులు టిప్పర్ డ్రైవరే. కాదని చెప్పలేదు. కానీ అతను చదివింది చంద్రబాబు కంటే పెద్ద చదువులు. వీరాంజనేయులు ఎంఏ ఎకనామిక్స్ చదివి బీఈడీ కూడా చేశాడు. చంద్రబాబు హయాంలో ఉద్యోగాలు దొరక్క టిప్పర్ డ్రైవర్ అయ్యాడు. కుటుంబాన్ని పోషించుకుని తన కాళ్లపై నిలబడ్డాడు. పెద్ద చదువు చదివిన వీరాజంనేయులు చంద్రబాబు ప్రభుత్వం టిప్పర్ డ్రైవర్‌ను చేస్తే మీ జగన్ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారు. వీరాంజనేయులు చాలా ఏళ్లుగా మనకు తోడుగా ఉన్నాడు. అలాంటి కార్యకర్తకు డబ్బులు లేవని, టిప్పర్ డ్రైవర్ అని పక్కన పెట్టలేదు. మీ జగన్ 175 అసెంబ్లీ, 25 ఎంపీలలో 200 స్థానాల్లో ఏకంగా 50 శాతం అంటే 100 సీట్లు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. పేదవారికి అండగా ఉండే జగన్‌కు, పెత్తందారీ మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు మధ్య తేడాను గమనించాలని కోరుతున్నా. అదే అనంతపురం జిల్లాలో మడకశిర నియోజకవర్గం ఎస్సీలది. అక్కడ మన అభ్యర్థి పేరు లక్కప్ప. చంద్రబాబు అక్కడికి వెళ్లి ఉపాధి హామీ కూలికి జగన్ టికెట్ ఇచ్చారు అని అంటారు. అవునయ్యా.. ఉపాధి కూలీ, పేదవాడైన లక్కప్పకు టికెట్ ఇచ్చాం. వారు ఎదగాలని ఇచ్చాం. జగన్‌కు, చంద్రబాబుకు మధ్య ఇదీ తేడా. మాది పేదల పార్టీ.

- సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: 'పొత్తులు, జిత్తులు, మోసాలు, అబద్ధాలు, కుట్రలతో వారు మళ్లీ మీ ముందుకు వస్తున్నారు. మాట నిలబెట్టుకున్న మనకూ, మాట తప్పిన చంద్రబాబుకూ మధ్య ఎన్నికలు జరగబోతున్నాయి. మనందరి ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగన్ చేసిన మంచిని, చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి చెప్పాలి. మోసం చేసిన వారి తోకలు కత్తిరించే స్టార్ క్యాంపెయినర్లు మీరే. ఈ ఐదేళ్ల పాలనలో మేలు చేసి చూపించి ప్రజల ఇళ్ల వద్దకు వెళుతున్నాం. మీకు మంచి జరిగి ఉంటేనే మీ బిడ్డకు అండగా నిలిచేందుకు స్టార్ క్యాంపెయినర్లుగా రావాలి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా మూడో రోజు శుక్రవారం ఆయన ఎమ్మిగనూరు బహిరంగ సభలో మాట్లాడారు. జన సముద్రంగా మారిన ఎమ్మిగనూరు సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని చెప్పారు. మే 13న జరిగే కురుక్షేత్ర యుద్ధంలో పేదల పక్షాన నిలిచి పెత్తందారులను ఓడించేందుకు మీరంతా సిద్ధమా.. అని ప్రశ్నించారు. సిద్ధం అంటూ చేతులు పైకెత్తిన ఈ మహా సైన్యం.. పైకి లేచిన ప్రతి చేయి, ఉప్పొంగిన ప్రతి గుండె మా ఇంట గత ఐదేళ్లుగా మంచి జరిగింది అని చెబుతోందన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..,

పిల్లల భవిష్యత్ కోసమే సంస్కరణలు

➤ మా ప్రభుత్వ బడులు బాగుపడుతున్నాయని, మా పిల్లల చదువులు మెరుగు పడుతున్నాయని ప్రతీ గుండె చెబుతోంది. రాష్ట్రంలో ఈ 58 నెలల్లో కనీవినీ ఎరుగని విధంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. 10-16 ఏళ్ల తర్వాత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మన బడుల్లో, విద్యా రంగంలో మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం మనది. నిలబెట్టే చదువు, తలెత్తుకునే ఉద్యోగాలు, ప్రపంచంలో ఎక్కడైనా బతికేలా అవకాశాలు మన విద్యా విధానంలో తీసుకొచ్చాం.

➤ బడులకు పంపే తల్లులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడిని తీసుకొచ్చాం. నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, తరగతి గదులు, కార్పొరేట్ కంటే గొప్పగా 6వ తరగతి నుంచి ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా డిజిటల్ బోధన, 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు, విద్యాకానుక కిట్లు, గోరుముద్ద, 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లు, సీబీఎస్‌ఈ నుంచి ఐబీ వరకు మంచి మార్పులు తీసుకొచ్చాం.

➤ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ పేదల పెద్ద చదువులకు అండగా నిలిచాం. బోధనలో మార్పులు, ఇంటర్న్‌షిప్‌తో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాం. పిల్లలకు ఓట్లు ఉండవని, వారి చదువుల గురించి గతంలో ఏ పాలకుడు పట్టించుకోలేదు. వారి బతుకులు మారాలన్న తపన, తాపత్రయంతో మనం అడుగులు ముందుకు వేశాం. ఈ ఎన్నికలు కేవలం ఓ ఎమ్మెల్యేనో, ఎంపీనో ఎన్నుకునేందు తూతూ మంత్రంగా ఓటు వేసేవి కాదు. పిల్లల భవిష్యత్, వారి తల్లిదండ్రుల భవిష్యత్ మారుతుందని జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఆడబిడ్డలు ఎదిగేలా అడుగులు వేశాం

➤ పాదయాత్రలో నా కళ్లతో చూసిన మరో విషయం చెబుతా. పూలు, వరి, తృణధాన్యాల దాకా ప్రతి గింజ ఎవరి నోట్లోకి వెళుతుందో భగవంతుడు రాస్తాడు. ప్రతీ గింజ పండించడంలో అక్క చెల్లెమ్మల పాత్ర ఎంత ఉందో నా కళ్లతో చూశా. పని వాళ్లుగా, రోజు కూలీలుగా చిన్న చిన్న పనులు చేసుకుని జీవిస్తున్న లక్షల మంది వారి బతుకులను ఎంత కష్టంగా లాగుతున్నారో చూశా. వారి బతుకులు మారాలని ఈ 58 నెలల్లో అడుగులు ముందుకు వేశాం. ➤ రోజు కూలీ, దోశలు.. ఇడ్లీలు అమ్మే ఓ అక్క, కుట్టుమిషన్ నడిపే ఓ చెల్లి ఇలా వీరంతా బాగుపడాలి. వీరందరి జీవితాల్లో వెలుగులు రావాలని పథకాలు తీసుకొచ్చాం. ఈ ఆలోచనల నుంచే అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, తోడు, చేదోడు, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా పుట్టాయి. కుదేలైన పొదుపు సంఘాలు ఆసరా, సున్నా వడ్డీ పథకాలతో ఇవాళ తలెత్తుకుని నిలబడ్డాయి. 45-60 ఏళ్ల వయస్సులో నా అక్కచెల్లెమ్మల జీవితాలను బాగు చేసేందుకు చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం అనే పథకాలు పుట్టాయి.

మంచి చేసిన ప్రభుత్వానికి రాఖీ కట్టండి

➤ నా చేతికి మాత్రమే కాదు.. మంచి చేసిన మీ ప్రభుత్వానికి రాఖీ కట్టాలని కోరుతున్నా. 31 లక్షల ఇళ్లపట్టాలు ఇచ్చిన, 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్న ప్రభుత్వానికి రాఖీ కట్టాలి. దిశ యాప్ ద్వారా 35 వేల మంది అక్క చెల్లెమ్మలు ఆపదలో ఉంటే వారికి భద్రత కల్పించిన ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలి. మహిళా పోలీసును ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలి. అవ్వా, తాతలకు.. అభాగ్యులైన అక్కచెల్లెమ్మ లకు, దివ్యాంగులకు ఒకటో తేదీన, సెలవైనా సూర్యోదయానికి ముందే వారి చేతిలో చేతిలో పింఛన్ పెట్టేందుకు వలంటీర్‌ను ఇంటికే పంపిన ప్రభుత్వానికి రాఖీ కట్టాలి.

➤ పింఛన్ తీసుకునే 66 లక్షల మందిలో అవ్వలు, వితంతు అక్క చెల్లెమ్మలు 45 లక్షల మంది ఉన్నారు. వీరందరూ మీ ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలని కోరుతున్నా. ఈ 58 నెలల్లో లంచాలు, వివక్ష లేకుండా నేరుగా రూ.2.70 లక్షల కోట్లు ప్రజలకు ఇచ్చాం. అందులో రూ.1.90 లక్షల కోట్లు కేవలం నా అక్క చెల్లెమ్మలకు ఇచ్చి మహిళ సాధికారతను ఉద్యమంగా నడిపిన ప్రభుత్వం ఇది. వారి భవిష్యత్ కోసం రక్షాబంధన్ కట్టాలని కోరుతున్నా.

భవిష్యత్‌ను మార్చే ఎన్నికలివి

➤ దేశంలో తొలిసారి ఆలయ బోర్డులు, మార్కెట్ కమిటీలు, రాజకీయ నియామకాల్లో ఏకంగా 50 శాతం పదవులకు చట్టం చేసి మహిళలకు ఇచ్చిన ప్రభుత్వానికి రక్షాబంధన్ కట్టాలి. బ్యాంకులకు వెళ్లి.. మహిళల అకౌంట్లలో చంద్రబాబు ఐదేళ్ల వివరాలు, మన ప్రభుత్వంలోని ఐదేళ్ల వివరాలు చూడండి. చంద్రబాబు పాలనలో మీ ఖాతాలకు ఒక్క రూపాయి అయినా వచ్చిందా? మీ బిడ్డ ప్రభుత్వ హయాంలో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశాం. ప్రతిపక్షం మాయలు, మోసాల్ని నమ్ముకుంటే.. మీ ప్రభుత్వం మీకు చేసిన మంచిని నమ్ముకుంది. ఈ ఎన్నికలు 2.5 కోట్ల మంది అక్క చెల్లెమ్మలు.. వారి భవిష్యత్, వారి పిల్లల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలని గుర్తు పెట్టుకోవాలి. ➤ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని గట్టిగా నమ్మిన ప్రభుత్వం ఇది. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 చొప్పున ఈ 58 నెలల్లో ఏకంగా రూ.67,500 ప్రతీ రైతు చేతిలో పెట్టాం. చంద్రబాబు ఐదేళ్లలో రూ.87,612 కోట్లు రుణమాఫీ చేస్తానని మోసం చేశారు. చంద్రబాబు హయాంలో రాత్రి పూట 12 గంటలకు ఎప్పుడో కరెంట్ వచ్చేది. ఈ రోజుపగటి పూటే నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా ఆర్బీకేలు చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి. ప్రతి ఎకరా కు ఈ క్రాప్ చేసి రైతులకు ఉచిత పంటల బీమా ఇస్తున్నాం. వరదలు, తుపాన్‌లు వచ్చి రైతులకు నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేది మీ బిడ్డ ప్రభుత్వంలోనే. అసైన్డ్, ఇనాంతో పాటు 22ఏకు సంబంధించిన 35 లక్షల ఎకరాల భూములపై శాశ్వత భూ హక్కులు కల్పించిన ప్రభుత్వం ఇది. రైతు పేరు పలకడమే నేరంగా భావించి, వారిని మోసం చేయడం, వ్యవసాయం దండుగ అనే పార్టీలకు మద్దతిస్తారా? మీకు అండగా నిలిచే మీ భూమిపుత్రుడికి అండగా నిలుస్తారా?

బాబు తోక కత్తిరించండి

➤ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని అడ్డుకున్న వారికి బుద్ధి చెప్పండి. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కులాల మధ్య సమతుల్యత దెబ్బతింటుందని కోర్టుల్లో కేసులు వేసిన వారు, బీసీల తోకలు కత్తిరిస్తాం.. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అనే చంద్రబాబు తోకను మరోసారి కత్తిరించాలని కోరుతున్నా. నాన్న ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను పణంగా పెట్టడమే కాకుండా, గత 30 ఏళ్లుగా చెలగాటం ఆడుతున్న బాబును ఏ ఒక్కరైనా సమర్థిస్తారా? ఈ వర్గాలన్నీ నేను అక్కున చేర్చుకున్న వర్గాలు.

➤ బాబుకు నా.. నా.. అని పిలుచుకునే వర్గాలు హైదరాబాద్ మెట్రోలో హైటెక్‌సిటీలో ఉన్నాయి. ఇక్కడ లేవు. ఓ ఈనాడు, ఆంధ్ర జ్యోతి, టీవీ-5 వీరికి తోడు ఓ దత్తపుత్రుడు. వీరు మన రాష్ట్రంలో ఉండరు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చేది వెన్నుపోటు, మోసాలు మాత్రమే. ఐదేళ్ల కిందట ఓ దత్తపుత్రుడు, ఢిల్లీ నుంచి మోదీని తెచ్చుకుని ఇదే చంద్రబాబు 2014లో మేనిఫెస్టో అని చెప్పి రంగు రంగుల కాగితాలు తీసుకొచ్చారు. 650 హామీలు ఇచ్చారు. ఇవి ప్రజలు మర్చిపోతారు అని ముఖ్యమైన హామీలు అంటూ ఓ కరపత్రం (చేత్తో పట్టుకుని చూపిస్తూ) సంతకం చేసి ప్రతీ ఇంటికి పంపారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5లో ప్రకటనలు ఇచ్చారు.

చంద్రబాబు మోసాలు ఇవిగో..

➤ రైతులకు రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానన్నారు. రూ. 87,612 కోట్లు మాఫీ చేశాడా? ➤ డ్వాక్రా రుణాలు పూర్తిగా రద్దు చేస్తామన్నారు. రూ.4,205 కోట్లు. ఒక్క రూపాయి అయినా మాఫీ చేశారా?

➤ ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నారు. ఎవరికైనా రూపాయి డిపాజిట్ చేశారా?

➤ ఇంటింటికీ ఓ ఉద్యోగం.. లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఐదేళ్లలో రూ.1.20 లక్షలు ఇచ్చారా? ➤ అర్హులైన వారికి 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు సాయం ఇస్తామన్నారు. ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చారా? ➤ రూ.10వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత, మహిళ రుణాలు మాఫీ, ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్, రాష్ట్రాన్ని సింగపూర్‌కు మించి అభివృద్ధి, ప్రతీ నగరాన్ని హైటెక్‌సిటీగా నిర్మించడం ఇలా ఎన్నో హామీలు ఇచ్చారు. మీ నగరంలో, జిల్లాలో హైటెక్‌సిటీ ఎక్కడైనా కన్పించిందా? ➤ ఇదే చంద్రబాబు, దత్తపుత్రుడు మోదీ ఫొటో పెట్టుకుని ఇంటింటికీ పంపిన ఈ కరపత్రంలో కనీసం ఒక్కటైనా చేశారా? పోనీ ప్రత్యేక హోదా అయినా తెచ్చారా?

మన టార్గెట్ 175కు 175

ఒక్క హామీ నెరవేర్చకపోగా, ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి, మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. మళ్లీ దత్తపుత్రుడు, చంద్రబాబు, మోదీ ఇదే ముగ్గురూ కలిసి సూపర్‌సిక్స్, సూపర్‌సెవన్ అంటున్నారు. ప్రతి ఇంటికీ కిలో బంగారు, బెంజ్ కారు కొనిస్తారట. ఇలాంటి మోసాల నుంచి రాష్ట్రంలోని పేదల భవిష్యత్‌ను కాపాడుకోవాలా? వద్దా? ఈ యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమేనా? సిద్ధం అంటే జేబులో నుంచి సెల్‌ఫోన్‌లు బయటకు తీసి పేదవాడి భవిష్యత్ కోసం మేమంతా సిద్ధం అని లైట్ వేసి పిలుపునివ్వండి. (ప్రజలందరూ సెల్‌లో టార్చ్ ఆన్ చేసి మద్దతు పలికారు). మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు అండా నిలిచేందుకు స్టార్ క్యాంపెయినర్లుగా రావాలి. ఈ ఎన్నికల్లో మన టార్గెట్ 175కు 175. 25కు 25 ఎంపీలు గెలవాలి. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, కర్నూలు, కోడుమూరు, మంత్రాలయం, పత్తికొండ ఎమ్మెల్యేలుగా బుట్టారేణుక, సాయిప్రసాద్‌రెడ్డి, విరూపాక్షి, ఇంతియాజ్, డాక్టర్ సతీశ్, బాలనాగిరెడ్డి, శ్రీదేవిని నిండు మనస్సుతో ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి గెలిపించాలి.

ఎట్టకేలకు 'దేశం' ఆఖరి జాబితా

4 ఎంపీ, 9 ఎమ్మెల్యే స్థానాలకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన

సాక్షి, అమరావతి: టీడీపీ అభ్యర్థుల తుది జాబితాను ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎట్టకేలకు ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న 9 ఎమ్మెల్యే, నాలుగు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను శుక్రవారం ఖరారు చేశారు. దీంతో 144 ఎమ్మెల్యే, 17 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో 94 సీట్లు ప్రకటించినా పి.గన్నవరం అభ్యర్థి రాజేష్‌ని అన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఆయనకు సీటు ఉపసంహరించారు. ఈ జాబితాలోనే అనపర్తి, అరకు సీట్లు ఖరారు చేసినా అవి రెండు బీజేపీకి వెళ్లడంతో వాటిని వదులుకున్నారు. రెండో జాబితాలో ఖరారు చేసిన కదిరి స్థానంలో తాజాగా మార్పులు చేశారు. మొదటి జాబితాలో 13 ఎంపీ స్థానాలకు ప్రకటించగా పొత్తులో మిగిలిన నాలుగు సీట్లకు ఇప్పుడు అభ్యర్థులను ఖరారు చేశారు. దీంతో టీడీపీ పోటీ చేసే చోట్ల మొత్తం అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

బీసీలకు బాబు పోటు

- బలహీన వర్గాలకు 34 ఎమ్మెల్యే సీట్లతో సరి
- సొంత సామాజిక వర్గానికి 32 సీట్లు



సాక్షి, అమరావతి: బలహీన వర్గాలపై మొసలి కన్నీళ్లు కురిపించే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి బీసీలకు వెన్నుపోటు పొడిచారు. పొత్తులో టీడీపీ పోటీ చేసే 144 అసెంబ్లీ స్థానాలకు గానూ కేవలం 34 సీట్లను మాత్రమే బీసీలకు కేటాయించారు. తన సొంత సామాజిక వర్గానికి మాత్రం ఏకంగా 32 సీట్లు ఇచ్చారు. బీసీలతో సమానంగా కమ్మ సామాజిక వర్గం నేతలు దాదాపు అన్ని జిల్లాల్లో సీట్లు దక్కించుకోవడం గమనార్హం. ఇక మైనారిటీలకు నామమాత్రంగా మూడు సీట్లతో సరిపెట్టారు. కాపు సామాజిక వర్గానికి అన్యాయం చేసిన చంద్రబాబు కేవలం తొమ్మిది సీట్లు మాత్రమే వారికి కేటాయించారు. అలాగే ఎంపీ సీట్లలోనూ చంద్రబాబు సొంత సామాజిక వర్గానికే పెద్దపీట వేశారు. బీసీలకు తప్పనిసరి పరిస్థితుల్లో ఆరు ఎంపీ సీట్లు ఇవ్వగా తన సొంత సామాజిక వర్గానికి ఆరు సీట్లు ఇచ్చారు. పొత్తులతో దక్కిన 17 ఎంపీ స్థానాల్లో కాపులకు చంద్రబాబు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

టీడీపీ, జనసేనకు వరుస షాక్‌లు!

ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమిని వీడుతున్న ముఖ్య నేతలు

- తాడేపల్లిగూడెంలో మాజీ ఎమ్మెల్యే ఈలి నాని టీడీపీకి గుడ్‌బై
- ఆయన దారిలోనే నూజివీడు మాజీ ఎమ్మెల్యే రామకోటయ్య
- ఇటీవలే టీడీపీని వీడిన ఎన్ఆర్ఐ గోపాల్ యాదవ్
- చేగొండి సూర్యప్రకాశ్, నౌడు వెంకటరమణలు జనసేనకు రాం రాం
- జనసేనకు రాజీనామా చేసిన ముమ్మిడివరం నేత పితాని
- ఫ్యాన్ గూటికి చేరేందుకు క్యూ కడుతున్న ఆ నేతలు

మరిన్ని వివరాలు వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'కాళేశ్వరం' కిస్తీలు కట్టండి

- రూ.1,441 కోట్లు చెల్లించాలంటూ కార్పొరేషన్‌కు ఆర్‌ఈసీ నోటీసులు... గడువులోగా కట్టకుంటే ఎన్‌సీఎల్‌టీలో దివాలా పిటిషన్ దాఖలు చేస్తామని హెచ్చరిక
- మూడు నెలలుగా నిలిచిపోయిన వాయిదా చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: ఎత్తిపోతల పథకాల నిర్మాణం కోసం తీసుకున్న రుణాల వాయిదాలను వెంటనే చెల్లించాలంటూ కాళేశ్వరం కార్పొరేషన్‌కు రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్‌ఈసీ) నోటీసులు జారీ చేసింది. 2023 డిసెంబర్, 2024 జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వాయిదాల కింద రూ.1,441 కోట్లు కట్టాల్సి ఉందని పేర్కొంది. నిర్దేశిత గడువులోగా చెల్లించకపోతే కాళేశ్వరం కార్పొరేషన్‌ను దివాళా సంస్థగా ప్రకటించాలంటూ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ వేస్తామని.. తాకట్టుపెట్టిన ఆస్తులను అమ్మకానికి పెడతామని హెచ్చరించింది.

ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీల నుంచి రుణాలు..

రాష్ట్ర ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం కాళేశ్వరం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.37,737.11 కోట్లు, ఆర్‌ఈసీ నుంచి రూ.30,536.08 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. అయితే పరిమితికి మించి రుణాలు తీసుకుంటోందంటూ రాష్ట్రంపై కేంద్రం ఆంక్షలు విధించడంతో.. అందులో కొంతమేర రుణాలు నిలిచిపోయాయి. అయితే అప్పటికే అందిన రుణాలకు సంబంధించి.. 2023 జూన్ నుంచి వాయిదాల చెల్లింపు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాయిదాలు చెల్లించడం లేదని, అందుకే మూడు నెలల బకాయిలు పేరుకున్నాయని అధికారవర్గాలు చెప్తున్నాయి.

ఏటా రూ.25 వేల కోట్లు అవసరం

కాళేశ్వరం ప్రాజెక్టు వార్షిక నిర్వహణ, రుణ వాయిదాల చెల్లింపు కోసం ఏటా రూ.25 వేల కోట్లు అవసరమని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి 2035 ఆగస్టు వరకు వాయిదాలు కట్టాల్సి ఉందని వివరిస్తున్నాయి.

కేసీఆర్ పాపాల వల్లే కరువు

- యాదగిరిగుట్ట పేరు మార్చి మొదటి తప్పు చేశారు: కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్ చేసిన పాపాలే ఇప్పుడు ఆయన్ను చుట్టుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో అన్నీ కుంభకోణాలే. గొర్రెలు, చేప పిల్లల పంపిణీలో కూడా అవినీతి చేశారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లోనూ అవినీతే. దళితబంధుకూ కమీషన్లు తీసుకున్నారు. యాదగిరిగుట్ట పేరు మార్చడమే ఆయన చేసిన మొదటి తప్పు. దేవుడి పేరు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి సర్వనాశనం చేశారు. ఇలాంటి కేసీఆర్ పాపాల వల్లనే ఇప్పుడు కరువు వచ్చింది' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

ఒక్కో పెయింటింగ్ రూ. 3-4 కోట్లు

'నేను ఎన్నో దేశాలు చూశా. కానీ ప్రగతిభవన్ లాంటి ఖరీదైన నిర్మాణం ఎక్కడా చూడలేదు. అక్కడ బాత్‌రూంను ఇప్పటి వరకు నేను ఎక్కడా చూడలేదు. ప్రగతిభవన్‌లోని ఒక్కో పెయింటింగ్ ఖర్చు రూ. 3-4 కోట్లుంటుంది. 20 ఏళ్లు అధికారంలో ఉంటామని అనుకొని కేసీఆర్ అలా కట్టించుకున్నారు. ఈ అవినీతి రావుల కోసం ఇప్పుడు జైళ్లు సరిపోవు. ప్రగతి భవన్‌ను జైలు చేసినా సరిపోదేమో. అధికారం పోయేసరికి కేసీఆర్ కుటుంబ సభ్యులు తట్టుకోలేకపోతున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యేలే చెబుతున్నారు. మాతో 30 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తరచూ మాట్లాడుతున్నారు. కేసీఆర్ అవినీతి అంతా బయటకు తీయాలంటే మాకు 20 ఏళ్లు పట్టేట్టు ఉంది'అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

ఎంపీగా దానం పోటీ కష్టమే..

దానం నాగేందర్ ఒక పార్టీలో ఎమ్మెల్యేగా ఉండి మరో పార్టీలో ఎంపీగా పోటీ చేయడం కష్టమని, అలా చేస్తే న్యాయ సమస్యలు వస్తాయని కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో పడిపోతుందని గతంలో కడియం శ్రీహరి అన్నప్పటికీ ఆ తర్వాత వాస్తవాలు తెలుసుకున్నట్లు ఉన్నారని చెప్పారు. తనతో కడియం మాట్లాడలేదని, కేకే మాత్రం మాట్లాడారని, ఆయన్ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని అభిప్రాయడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకోవాలని, ఆయనకు చట్టప్రకారం పదేళ్ల జైలు శిక్ష తప్పదని కోమటిరెడ్డి హెచ్చరించారు.

వైఎస్ వల్లే వేగంగా హైదరాబాద్ అభివృద్ధి

హైదరాబాద్‌కు కళ ఓఆర్ఆర్ అని... అది కట్టింది వైఎస్ హయాంలోనేనని కోమటిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ ప్లానింగ్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి వేగంగా జరిగిందన్నారు. దక్షిణాదిలోనే ఎక్కువ మెజారిటీ నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు వస్తుందని జోస్యం చెప్పారు. తనకు, తన సోదరుడు, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మధ్య విభేదాలున్నాయన్న వార్తలను ఖండించారు. తమను విడదీయడం ఎవరి వల్లా కాదని... అయితే బ్రదర్స్ పేరు చెబితేనే సోషల్ మీడియాలో ట్రెండింగ్ అని, అందుకే తమపై రూమర్స్ పుడుతుంటాయని చెప్పారు.

'ఐటీఐఆర్' హామీ ఇద్దామా?

- దీనిపై అధ్యయనం చేసే బాధ్యత మంత్రి శ్రీధర్‌బాబుకు...
- టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో దీపాదాస్ మున్షీ, భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) హామీని లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తోంది. జాతీయస్థాయిలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐటీ రంగంలో లక్షలాది మందికి ఉపాధిని కల్పించే ఐటీఐఆర్‌ను ఏర్పాటు చేస్తామనే హామీ ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించింది. శుక్రవారం సాయంత్రం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ భేటీ అయ్యింది. ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతర సభ, కేంద్ర ఎన్నికల మేనిఫెస్టోకు అనుబంధంగా రాష్ట్ర అంశాల చేర్పు, 100 రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చించారు. ఈ సందర్భంగా ఐటీఐఆర్ ప్రస్తావనకు రాగా, ఈ హామీని చేర్చే అంశాన్ని మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో సీఎం రేవంత్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను ఈనెల 5న జాతీయస్థాయిలో ఏఐసీసీ విడుదల చేస్తుందని, ఈ మేనిఫెస్టోలోని అంశాలతోపాటు రాష్ట్ర ప్రజలకు అవసరమయ్యే అంశాలను కూడా రాష్ట్రస్థాయి మేనిఫెస్టోలో చేర్చాలని, ఈ అంశంపై పార్టీ నేతలు అధ్యయనం చేయాలని కోరారు. అయితే, పార్టీకి వ్యతిరేకంగా బయట మాట్లాడొద్దని, మీడియాతో మాట్లాడేవారిపై కఠిన చర్యలుంటాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ పార్టీ నేతలను హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, విష్ణునాథ్, మంత్రు లు శ్రీధర్‌బాబు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, కె.జానారెడ్డి, ఎం.కోదండరెడ్డి, షబ్బీర్‌అలీ, జెట్టి కుసుమకుమార్, రేణు కాచౌదరి, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లురవి, వంశీచంద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్

ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. 'కేటీఆర్..మీరు బాగా చదువుకున్నారు. మంత్రిగా పనిచేశారు. పద్ధతిగా మాట్లాడాలి కదా. వెంట్రుక కూడా పీకలేరు అని మాట్లాడటం ఏం భాష? భాష, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి.'అని హితవు పలికారు.

టికెట్ల పేరుతో రూ.కోట్లు వసూలు

- భీమిలి, అనకాపల్లి టీడీపీ సీట్లు ఆశించిన ఇద్దరు నేతలు
- రూ.30 కోట్లు ఇచ్చిన దిలీప్ చక్రవర్తి... రూ.20 కోట్లు ఇచ్చిన బంగార్రాజు
- ఇద్దరికీ బాబు మొండిచేయి
- లబోదిబోమంటున్న బాధిత నేతలు.. డిపాజిట్లు వెనక్కివ్వాలంటూ ఒత్తిడి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీలో సీట్ల కేటాయింపు ముగియడంతో....టికెట్లు ఆశించి భారీగా డబ్బు మూటలను అప్పగించిన నేతలు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. తమకు సీటు వస్తుందనుకుని భారీగా నగదు డిపాజిట్ చేశామని... ఇప్పుడు సీటు లేకపోవడంతో తమ పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. భీమిలి సీటును ఆశించి... ఫండ్ కింద బంగార్రాజు అనే వ్యక్తి రూ. 20 కోట్లమేర నిధులిచ్చినట్టు తెలిసింది. గంటా శ్రీనివాసరావును చీపురుపల్లికి పంపుతున్నామని... భీమిలి సీటు నీదేనని టీడీపీ పెద్దలు నమ్మబలికినట్టు తెలిసింది. అయితే, చివరకు పట్టుబట్టి మరీ భీమిలి సీటును గంటా సాధించుకున్నారు. అనకాపల్లి ఎంపీ టికెట్ రేసులో ఉన్న దిలీప్ చక్రవర్తి కూడా తనదే సీటు అనుకుంటూ భారీగా ఖర్చు చేశారు. టికెట్ కోసం రూ.30 కోట్ల మేర డిపాజిట్ కూడా చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తీరా కూటమి కోటాలో బీజేపీ తరఫున సీఎం రమేష్‌కు సీటు పోయింది. ఈ నేపథ్యంలో తాము ఇచ్చిన డబ్బుల సంగతేమిటంటూ టీడీపీ పెద్దలను నిలదీస్తున్నట్టు తెలుస్తోంది.

కూటమి సభ బంగార్రాజు పుణ్యమే!

టీడీపీ, జనసేన పొత్తు తర్వాత మొదటి సభ రాజాపులోవలో జరిగింది. భీమిలి నియోజకవర్గాన్ని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో జరుగుతు న్న సభ కావడంతో.. భీమిలి సీటు ఆశించిన బంగార్రాజు పైనే టీడీపీ నేత నారా లోకేశ్ మొత్తం భారం వేశారు. భీమిలి సీటు పక్కాగా నీదేనని.... గంటాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్వయంగా లోకేశ్ కూడా చెప్పడంతో బంగార్రాజు రెట్టించిన ఉత్సాహంతో సభ కోసం ఖర్చు చేసినట్టు పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. మరోవైపు అనకాపల్లి ఎంపీ టికెట్ కోసం దిలీప్ చక్రవర్తి కూడా భారీగానే ఖర్చు చేసుకుంటూ వెళ్లారు. దీంతో పాటు రూ. 30 కోట్ల మేర డిపాజిట్ కూడా చేశారు. తీరా సీటు లేకపోవడంతో తన పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు.

ఐవీఆర్‌ఎస్ పేరుతో ..

భీమిలి సీటు మీదేనంటూ మొదట్లో భారీగా ఖర్చు పెట్టించిన టీడీపీ పెద్దలు... తీరా సీట్ల కేటాయింపు వచ్చే సరికి సర్వేలో మొదటిస్థానంలో నిలవాలంటూ మొదట్లో మెలికలు పెట్టారు. ఇందుకోసం మీ పేర్లతో ఐవీఆర్‌ఎస్ సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా వీరి పేర్లతో కొద్దిరోజులు సర్వే పేరుతో నియోజకవర్గ ప్రజలకు ఫోన్లు వచ్చాయి. చివరకు సీట్ల కేటాయింపులో మొండిచేయి చూపారు. ఇదేమిటని ప్రశ్నిస్తుంటే... సర్వేలో రాలేదని చెబుతున్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి పదవులు అప్పగిస్తామని ఆశలు చూపుతున్నారు. తమ మొత్తాన్ని తమకు తిరిగి ఇవ్వాలంటూ నాయకులు ఒత్తిడి తెస్తుండగా.... ఎన్నికల తర్వాత నగదు వ్యవహారాన్ని చూద్దామని దాటవేస్తున్నట్టు తెలిసింది.

ఫ్యాషన్





ఎండలు రోజు రోజూ తమ ప్రతాపాన్ని పెంచుతూనే ఉన్నాయి.
రానున్న రోజులను ఎలా తట్టుకోవాలా అని ఆలోచించే వారు
తమ డ్రెస్సింగ్‌లో మార్పులు చేసుకుంటూనే ఉన్నారు.
క్యాజువల్ వేర్‌గా రోజంతా సౌకర్యంగా ఉండేలా
సరైన డ్రెస్ ఎంపికగా ఈ కో-ఆర్డ్ సెట్స్ బాగా సూటవుతాయి.
ఈ సమ్మర్‌లో కూల్ అండ్ కంఫర్ట్‌తో పాటు
ఎనీ టైమ్ ఎనీ వేర్ అనిపించే ఈ డ్రెస్సులు బాగా నప్పుతాయి.

కూల్‌గా సొగసుగా!

కాటన్ ఫ్యాబ్రిక్

కో-ఆర్డ్ సెట్స్‌లో ఈ కాలం కాటన్ మెటీరియల్‌కే మొదటి ప్రాధాన్యత. వీటిలో ఖాదీ, ఇక్కత్, ప్రింటెడ్ కాటన్స్‌ని ఎంచుకోవచ్చు.

ఆహ్లాదకరమైన రంగులు

ముదురు, లేత రంగుల్లోనే కాదు డిజైన్స్‌లో ఆహ్లాదకరంగా అనిపించేవి ఎంచుకోవాలి. వేసవి వేడి నుంచి మన కంటికి హాయిగొలిపే డిజైన్స్, రంగులపై దృష్టి పెట్టడం మంచిది.









టాప్ డిజైన్స్‌లో మార్పులు

ఈ డ్రెస్ సెట్‌లో టాప్-బాటమ్ రెండూ ఒకే ప్రింట్, ఒకే కలర్‌తో ఉంటాయి. అయితే, టాప్‌గా షార్ట్ కుర్తీ, పెప్లమ్, జాకెట్ స్టైల్.. ఇలా డిజైన్స్‌లో మార్పులు చేయించుకోవచ్చు. లేదా అలాంటివి మార్కెట్‌లో రెడీమేడ్‌గా ఉన్నవి ఎంచుకోవచ్చు.

డిజైన్స్ కూడా సులువే!

టాప్ అండ్ బాటమ్ ఒకే మెటీరియల్‌తో డిజైన్ చేసుకోవచ్చు. కాబట్టి, బడ్జెట్‌కు తగినవిధంగా మెటీరియల్‌ను ఎంచుకొని డిజైన్ చేసుకోవచ్చు. ఈ వేసవిని ఎదుర్కోవడానికి కూల్‌గా .. కంఫర్ట్‌గా.. సొగసుగా రెడీ అయిపోవచ్చు.

వంటిల్లు

పొరుగు దేశం ఇఫ్తార్



పగలంతా రోజాతో అల్లా ధ్యానం.
రాత్రికి ఇఫ్తార్‌తో ఆరోగ్యధ్యానం.
నీరసించిన దేహానికి శక్తి కావాలి.
ఆ శక్తి దేహానికి తక్షణం అందాలి.
ఆహారం ఆరోగ్యకరంగా ఉండాలి.
గార్నిషింగ్‌తో పదార్థం రుచి పెరగాలి.
రుచి... ఆరోగ్యానికి మేళవింపు కావాలి.
ఇఫ్తార్ కోసం పొరుగు దేశాలు
ఏం వండుతున్నాయి?
దహీ చికెన్‌ను బ్రెడ్‌లో పార్సిల్ చేశాయి.
నాలుగు పప్పులు... రెండు ధాన్యాలు...
కలిపి హలీమ్ వండుతున్నాయి.
అచ్చం మనలాగే.

చికెన్ బ్రెడ్ పార్సిల్

కావలసినవి:
చికెన్ బోన్‌లెస్ – 200 గ్రా
మారినేషన్ కోసం... : మిరియాల పొడి – టీ స్పూన్;మిరప్పొడి – టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్; వెనిగర్ – టేబుల్ స్పూన్; వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; తందూరీ మసాలా పొడి– టేబుల్ స్పూన్; పెరుగు– అర కప్పు.
పోపు కోసం: నూనె– టేబుల్ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు.
పార్సిల్ కోసం! మిల్క్ బ్రెడ్ – 10 స్లయిస్‌లు; మైదా – టేబుల్ స్పూన్; కోడిగుడ్లు – 2; లెట్యూస్ – నాలుగు ఆకులు (క్యాబేజిని పోలి ఉంటుంది); నూనె – వేయించడానికి తగినంత.



తయారీ:
- చికెన్‌ను శుభ్రంగా కడిగిన తర్వాత ఒక పాత్రలో వేసి మారినేషన్ కోసం తీసుకున్న దినుసులన్నింటినీ వేసి సమంగా కలిసే వరకు కలిపి (మారినేషన్) అరగంట సేపు కదిలించకుండా పక్కన ఉంచాలి
- బాణలిలో నూనె వేడి చేసి మారినేట్ చేసిన చికెన్ వేసి కలిపి మూత పెట్టి పది నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించాలి. మూత తీసి చికెన్ ముక్క ఉడికిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొంత సేపు చిన్న మంట మీద ఉంచాలి. ఉప్పు కూడా సరి చూసుకుని అవసరాన్ని బట్టి మరికొంత వేసుకోవచ్చు. చికెన్ ఉడికిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి కలిపి రెండు నిమిషాల సేపు (తేమ పోయే వరకు) వేయించి స్టవ్ ఆపేయాలి
- ఒక కప్పులో మైదా పిండి తీసుకుని తగినంత నీటితో గరిట జారుడుగా కలుపుకోవాలి
- కోడిగుడ్లను పగుల గొట్టి ఒక పాత్రలో వేసి, అందులో మిరియాల పొడి వేసి చిలికి సిద్ధంగా ఉంచుకోవాలి
- బ్రెడ్ స్లయిస్‌ల అంచులు చాకుతో కట్ చేసి తీసేయాలి. బ్రెడ్‌ను అప్పడాల కర్రతో వత్తాలి. ఇలా చేయడం వల్ల బ్రెడ్ పొడి పొడిగా రాలిపోకుండా చికెన్ స్టఫ్ పెట్టి నూనెలో వేయించడానికి అనువుగా మారుతుంది. ఇలా చేసుకున్న బ్రెడ్ స్లయిస్‌లో ఒక స్పూన్ చికెన్ స్టఫ్ పెట్టి, కర్రీ బయటకు రాకుండా బ్రెడ్ అంచులకు మైదా పిండి ద్రవం రాసి అతికించాలి. నలుచదరంగా ఉండే బ్రెడ్ స్లయిస్ సాండ్‌విచ్‌లాగ త్రిభుజాకారపు పార్సిల్ తయారవుతుంది. ఇలా అన్నింటినీ చేసుకుని పక్కన పెట్టాలి
- బాణలిలో నూనె వేడి చేసి ఒక్కో బ్రెడ్ పార్సిల్‌ను కోడిగుడ్డు సొనలో ముంచి నూనెలో వేసి రెండు వైపులా దోరగా వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేయాలి. నూనె వదిలిన తరవాత ఈ బ్రెడ్ పార్సిళ్లను, టొమాటో కెచప్, లెట్యూస్‌తో కలిపి సర్వ్ చేయాలి.

చికెన్ హలీమ్


కావలసినవి: ఎర్ర కందిపప్పు – టేబుల్ స్పూన్; బాసుమతి బియ్యం– టేబుల్ స్పూన్; గోధుమలు– టేబుల్ స్పూన్; బార్లీ– టేబుల్ స్పూన్; కందిపప్పు– టేబుల్ స్పూన్; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి పేస్టులు– ఒక్కొక్కటి టేబుల్ స్పూన్; చికెన్ (బోన్‌లెస్)– పావు కేజీ; చికెన్ స్టాక్ – అర కప్పు; హలీమ్ మసాలా పొడి– టేబుల్ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – కప్పు; మిరప్పొడి– అర టీ స్పూన్; పసుపు– అర టీ స్పూన్; పెరుగు – అర కప్పు; ఉప్పు – అర టీ స్పూన్.
పోపు కోసం... నెయ్యి– అర కప్పు; జీలకర్ర– టీ స్పూన్; వెల్లుల్లి– 10 రేకలు; పుదీన ఆకులు – టేబుల్ స్పూన్.
గార్నిషింగ్ కోసం...: జీడిపప్పు – పావు కప్పు; నిమ్మకాయ– ఒకటి (పలుచగా తరగాలి); అల్లం తరుగు– టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – కప్పు.
తయారీ: ● బియ్యం, కందిపప్పులు, పచ్చి శనగపప్పు, బార్లీ, గోధుమలను ఒక పెద్ద పాత్రలో వేసి శుభ్రంగా కడిగి, మూడింతలు మంచి నీటిని పోసి పది నిమిషాలసేపు నానబెట్టాలి. ఆ తర్వాత అందులో పచ్చిమిర్చి, వెల్లుల్లి, అల్లం పేస్టులు వేసి కలిపి, పప్పులు, ధాన్యాలు మెత్తబడే వరకు ఉడికించాలి. వేడి తగ్గిన తర్వాత వీటిని మెత్తగా మెదపాలి ● గింజలు ఉడికేలోపు బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే నూనెలో ఉల్లిపాయ ముక్కలను ఎర్రగా వేయించి తీసి పక్కన సిద్ధంగా ఉంచుకోవాలి ● చికెన్‌ను శుభ్రంగా కడిగి ఒక పాత్రలో వేసి అందులో హలీమ్ మసాలా పొడి, మిరప్పొడి, పసుపు, ఉప్పు, పెరుగు, వేయించిన ఉల్లిపాయ ముక్కలు అర కప్పు, చికెన్ స్టాక్‌ను (చికెన్ స్టాక్ లేకపోతే మంచి నీటిని పోయాలి) వేసి ఉడికించాలి. చికెన్ ముక్కలు ఉడికిన తర్వాత అందులోని నీటిని పప్పులు, ధాన్యాలు ఉడికించిన మిశ్రమంలోకి వంపి చికెన్ ముక్కలను మాత్రమే పాత్రలో ఉంచి ఆ ముక్కలను మెదపాలి. మెదిపిన చికెన్‌ను కూడా ధాన్యాలు, పప్పులు ఉడికించిన మిశ్రమంలో వేసి కలిపి మంట తగ్గించి అన్నింటి రుచి కలవడం కోసం మళ్లీ ఉడికించాలి ● ఉల్లిపాయ ముక్కలు వేయించిన బాణలిలో మిగిలిన నేతిలో జీలకర్ర, అల్లం, వెల్లుల్లి, పుదీన వేసి అర నిమిషం పాటు వేయించి ఈ పోపును చిన్నమంట మీద ఉడుకుతున్న చికెన్, పప్పులు, ధాన్యాల మిశ్రమంలో వేసి కలిపితే హలీమ్ రెడీ ● గార్నిష్ చేయడానికి ఒక పాత్రలో కొత్తిమీర తరుగు, అల్లం తరుగు, జీడిపప్పులు, ఎర్రగా వేయించిన ఉల్లిపాయ ముక్కలు వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● ఒక కప్పులో వేడి వేడి హలీమ్ వేసి పై గార్నిష్ కోసం సిద్ధం చేసిన మిశ్రమాన్ని కొద్దిగా చల్లి, నిమ్మకాయ ముక్క పెట్టి సర్వ్ చేయాలి.



సౌదీలో రెండేళ్ల పాటు 700 గొర్రెలను ఒంటరిగా మేపాడు.
మరో మనిషితో మాట్లాడలేదు. మరో మాట వినలేదు.
ఇసుకతో స్నానం ఇసుకే దాహం ఇసుక తప్ప మరేం కనిపించని
ఒంటరితనం. బానిస బతుకు. కాని బతికి దేశం తిరిగి వచ్చాడు.
1995లో అతని జీవితం నవలగా వెలువడి
మలయాళంలో సెన్సేషన్ సృష్టించింది.
ప్రస్తుతం 138వ ప్రచురణకు వచ్చింది.
అతని జీవితం ఆధారంగానే 'గోట్ లైఫ్'
సినిమా తాజాగా విడుదలైంది.
కేరళకు చెందిన నజీబ్ సంఘర్షణ ఇది.

700 గొర్రెలూ.. ఎడారి.. అతను


నజీబ్



కేరళలోని అలెప్పీ దగ్గరి చిన్న ఊరికి చెందిన నజీబ్ కోరుకుంది ఒక్కటే. సౌదీకి వెళ్లి ఏదో ఒక పని చేసి కుటుంబానికి నాలుగు డబ్బులు పంపాలన్నదే. ఆ రోజుల్లో కేరళ నుంచే కాదు దక్షిణాది రాష్ట్రాల నుంచి గల్ఫ్ దేశాలకు చాలామంది పని కోసం వలస వెళ్లేవారు. నజీబ్ కూడా సౌదీకి వెళ్లాలనుకున్నాడు. ఏజెంట్ అతనికి ఒక మాల్‌లో సేల్స్‌మ్యాన్‌గా పని ఉంటుందని పంపాడు. అలా నజీబ్ సౌదీలో అడుగు పెట్టాడు. అది 1993వ సంవత్సరం.

రెండు రోజుల తర్వాత

ఎయిర్‌పోర్ట్‌లో దిగాక నజీబ్ రెండు రోజుల పాటు ప్రయాణిస్తూనే ఉన్నాడు... అప్పుడు గాని అర్థం కాలేదు తాను మోసపోయానని. ఎడారి లోపల అతణ్ణి అరబ్ షేక్‌కు అప్పజెప్పారు. ఆ షేక్ అక్కడే ఒక షెడ్డు వేసుకుని ఉండేవాడు. నజీబ్‌కు 700 గొర్రెలను కాచే పని అప్పజెప్పాడు. వేరే బట్టలు ఇవ్వలేదు. స్నానానికి నీళ్ల ఇవ్వలేదు. బతకడానికి మాత్రం ముతక రొట్టెలు పడేసేవాడు. ఆ రొట్టెల్ని గొర్రెపాలలో తడిపి కొద్దిగా తినేవాడు నజీబ్. యజమాని, అతని తమ్ముడు ఈ ఇద్దరు మాత్రమే నజీబ్‌కు కనిపించేవారు. వారి అరబిక్ భాష తప్ప మరో భాష వినలేదు. మరో మనిషిని చూడలేదు. 'నేను ఏడ్చినప్పుడల్లా వారు కొట్టేవారు' అంటాడు నజీబ్.

భ్రాంతులు

నజీబ్‌కు ఎడారిలో ఉండి భ్రాంతులు మొదలయ్యాయి. అతడు గొర్రెల మధ్య ఉండి ఉండి తాను కూడా ఒక గొర్రెనేమో అనుకునేవాడు. రెండేళ్ల పాటు ఇలాగే జరిగింది. ఒకరోజు ఆ అన్నదమ్ములిద్దరూ పెళ్లి ఉందని వెళ్లారు. ఆ అదను కోసమే చూస్తున్న నజీబ్ ఎడారిలో పరిగెత్తడం మొదలుపెట్టాడు. దారి లేదు.. గమ్యమూ తెలియదు. పరిగెట్టడమే. ఒకటిన్నర రోజు తర్వాత మరో మలయాళీ కనిపించి దారి చెప్పాడు. అతడు కూడా తనలాంటి పరిస్థితిలో ఉన్నవాడే. చివరకు ఒక రోడ్డు కనిపించి రియాద్ చేరాడు. అక్కడి మలయాళీలు నజీబ్‌ను కాపాడారు. ఆ తర్వాత పోలీసులకు లొంగిపోతే తగిన పత్రాలు లేనందున 10 రోజులు జైల్లో పెట్టి ఇండియా పంపారు.

నవల సినిమాగా

నజీబ్ తిరిగి వచ్చాక కోలుకొని బెహ్రయిన్ వెళ్లాడు ఈసారి పనికి. అక్కడ పని చేస్తున్న రచయిత బెన్యమిన్‌కు నజీబ్‌తో పరిచయమైంది. నజీబ్ జీవితాన్ని బెన్యమిన్ నవలగా 'ఆడు జీవితం' (గొర్రె బతుకు) పేరుతో రాసి 2008లో వెలువరించాడు. అది సంచలనంగా మారింది. ఇప్పటికి వందకు పైగా ఎడిషన్స్ వచ్చాయి. 8 భాషల్లో అనువాదమైంది. ఆ నవల ప్రాశస్త్యం సినిమా రంగాన్ని ఆకర్షించింది. మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా 'ఆడు జీవితం' పేరుతో నటించి మొన్న మార్చి 28న విడుదల చేశాడు. తెలుగులో గోట్‌లైఫ్ పేరుతో అనువాదమైంది. వాస్తవిక సినిమాగా ఇప్పటికే గోట్‌లైఫ్ ప్రశంసలు పొందుతోంది.

ఇంటిప్స్

కిచెన్‌లో బొద్దింకల సమస్య ఉంటే..



- కాసిని వెల్లుల్లి రెబ్బల్ని దంచి నీటిలో కలిపి సింక్ పైప్ దగ్గర పెట్టాలి.
- బొద్దింకలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది.
- మూలల్లో బోరిక్ పౌడర్‌ను ఉంచితే బొద్దింకలు మాయమవుతాయి.
- బేకింగ్ సోడా, చక్కెర కలిపి బొద్దింకలు తిరిగే ప్రదేశంలో చల్లడం ద్వారా కూడా బొద్దింకలను తరిమికొట్టవచ్చు.

హెయిర్‌టిప్స్

కురులకు అవిసె ఫ్లేక్స్ సీడ్ జెల్

- కప్పు అవిసె గింజలను తీసుకుని నాలుగు కప్పుల నీళ్లపోసి బాగా మరగనివ్వాలి.
- ఉడికిన తరువాత నీటిని వడగట్టాలి. అలా వడగట్టిన నీటిలో నాలుగు చుక్కలు ఆలివ్ ఆయిల్, టీస్పూను కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి.
- ఈ మిశ్రమాన్ని గాజు జాడీలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి.
- పదిహేను రోజుల తరువాత జెల్‌గా మారుతుంది. అప్పుడు రెండు టీస్పూన్ల జెల్‌కు స్పూను విటమిన్ ఈ ఆయిల్ కలిపి తలకు పట్టించి మర్దన చేయాలి. అరగంట తరువాత సాధారణ షాంపుతో శుభ్రం చేయాలి.
- వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల కుదుళ్లకు పోషణ అంది చుండ్రు సమస్య వదిలి జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.



లైఫ్@360





డీ హైడ్రేషన్? నివారించండి ఇలా ...

వేసవిలో సర్వసాధారణంగా అందరికీ ఎదురయ్యే సమస్య డీ హైడ్రేషన్. సరైన సమయంలో గుర్తించకపోతే ఇది ప్రాణాపాయానికి కూడా దారితీసే ప్రమాదం లేకపోలేదు. శరీరంలోని జీవక్రియలు సజావుగా సాగాలంటే ద్రవపదార్థాలు తగినన్ని ఉండడం అవసరం. ఒకోసారి రకరకాల కారణాల వల్ల శరీరంలోని ద్రవపదార్థాలు ముఖ్యంగా నీటి శాతం బాగా తగ్గిపోయి వాంతులు, విరేచనాలు అవుతాయి. ఒకోసారి ప్రాణాపాయ స్థితి కూడా ఏర్పడవచ్చు. వేసవిలో ఈ పరిస్థితి ఏర్పడే అవకాశాలు మరీ ఎక్కువ. అందువల్ల డీ హైడ్రేషన్‌ని నివారించేందుకు చిట్కాలు.

డీ హైడ్రేషన్ గురి కాకుండా ఉండాలంటే కనీసం రోజుకు 2 నుంచి 4 లీటర్ల నీటిని తాగాలి. దాహంగా అనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే నీరు తాగాలి. డీహైడ్రేషన్‌కు గురయ్యామని సూచించే మొట్ట మొదటి సంకేతం 'దాహం' అనిపించటం.

డీ హైడ్రేషన్‌ను ఎలా గుర్తించాలంటే..?

నోరంతా పొడిబారినట్లు, బుగ్గల చుట్టూ ఇసుక అట్ట కట్టినట్లుగా ఉన్నా తీవ్రమైన డీహైడ్రేషన్ ఎదుర్కోబోతున్నట్లు సంకేతంగా భావించాలి. తీవ్ర అలసట, నిద్ర పోవాలనే కోరిక ఉండడమూ డీ హైడ్రేషన్ లక్షణాలే. అలా ఉన్నప్పుడు చాలా మంది నిద్రకు ఉపక్రమిస్తారు. దానికి బదులుగా వెంటనే కొంచెం మంచి నీళ్లు తాగితే ఉపశమనం లభిస్తుంది.

భరించరాని తలనొప్పి కూడా డీహైడ్రేషన్‌ను తెలియజేసే సాధారణ లక్షణం. సాధారణంగా కండర తిమ్మిర్లు శరీరంలో ఎలక్ట్రోలేట్ స్థాయుల అసమతుల్యతకు కారణంగా చెబుతారు. అయితే ఇది కూడా డీహైడ్రేషన్‌ను సూచించే మరొక గుర్తు.

కొంత శారీరక శ్రమను చేసిన తర్వాత హఠాత్తుగా చెమట పట్టడం నిలిచిపోతే, వెంటనే శరీరాన్ని హైడ్రేట్ చేయాలి. డీహైడ్రేషన్‌ను తెలియచేసే తీవ్రమైన సంకేతాల్లో ఇది ఒకటి.

ముదురు పసుపు రంగులో మూత్రం రావడం, మూత్ర విసర్జనలో మంటగా అనిపించడం డీ హైడ్రేషన్‌కు సంకేతాలు. అలాంటప్పుడు సబ్జా నీళ్లు లేదా బార్లీ నీళ్లు లేదా కొబ్బరి నీళ్లు తాగాలి. ఇవేవీ అందుబాటులో లేనప్పుడు కనీసం వెంటనే నీటిని తాగడం కూడా ప్రమాద నివారణకు సహకరిస్తుంది.

చర్మం సహజ స్వభావాన్ని కోల్పోయినప్పుడు అంటే చర్మాన్ని పట్టుకుని లాగి వదిలితే వెంటనే వెనక్కి వెళ్లకుండా పైన నిలిచినట్లుగా ఉండే ఈ సమస్యలో ఉన్నట్లే భావించాలి. అస్పష్టమైన కంటి చూపు కూడా డీహైడ్రేషన్ సూచించే ఒక గుర్తు.

రక్తంలో తక్కువ చక్కెర స్థాయులు ఉన్నప్పుడు కూడా అస్పష్టమైన కంటిచూపు కలుగుతుంది. అందుకే ఎప్పుడైనా నిర్ణీత సమయానికి భోజనం చేయలేకపోతే వెంటనే గ్లూకోజ్ నీరు తాగాలి.

సులువుగా చేయగలిగేది తగినన్ని నీళ్లు తాగడం. కనీసం అదైనా సరిగా చేస్తుంటే ప్రమాదాన్ని నివారించిన వారమవుతాం.



మెడనొప్పి... నో వర్రీ

సాధారణంగా టీనేజర్లలో మెడనొప్పి, నడుమునొప్పి లాంటి మధ్యవయస్కులకు వచ్చే ఆరోగ్య సమస్యలు అంతగా కనిపించకపోవచ్చుగానీ... అవి రాకపోవడం అంటూ ఉండదు. ఆ వయసులో వారికుండే కొన్ని రకాల లైఫ్‌స్టైల్ అలవాట్లూ, ఇబ్బందులే అందుకు కారణం. ఉదాహరణకు... వారు స్కూళ్లు/కాలేజీలలో చాలాసేపు అదేపనిగా కూర్చునే ఉండటం, సరైన పోశ్చర్‌లో కూర్చోకపోవడం, బల్ల మీద ఉన్న కంప్యూటర్‌కూ, కుర్చీకీ మధ్య తగినంత దూరం లేకపోవడం లాంటి ఎన్నో అంశాల కారణంగా వాళ్లకూ మెడనొప్పి రావచ్చు.

అలవాట్లే కాకుండా... ఆరోగ్య సమస్యల విషయానికొస్తే... థైరాయిడ్ లోపాలు, చిన్నతనంలో వచ్చే (టైప్-1) డయాబెటిస్, విటమిన్ లోపాలు, జీవక్రియల్లో లోపాల వల్ల కూడా టీనేజర్లలో మెడనొప్పి వస్తుంటుంది.

అలాగే, టీనేజర్లకు ఆ వయసులో కొందరికి వచ్చే స్థూలకాయం, సరైన వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతోనూ రావచ్చు.

టీనేజర్లలో మెడనొప్పి నివారణకు చేయాల్సినవి...

పై సమస్యల్లో ఏదైనా కారణమా అని మొదట చూసుకోవాలి. ఉదాహరణకు...

స్కూల్ / కాలేజీలో కూర్చునే చోట... డెస్క్ తమ ఎత్తుకు తగినట్లుగా ఉందో లేదో, అందుకు తగినట్లుగా పోశ్చర్ ఉందో లేదో పరిశీలించుకోవాలి. కంప్యూటర్లపై పనిచేయడం లేదా వీడియో గేమ్స్ కోసం అదేపనిగా మెడను నిక్కించి ఉంచడం వల్ల ఆ భాగంలోని వెన్నుపూస ఎముకలూ, మెడ కండరాలపై తీవ్రమైన ఒత్తిడి పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు.

పోశ్చర్ సరిగా లేనప్పుడు / కూర్చున్నప్పుడు వెన్నుతో పాటు, దేహంలోని కండరాల మీద పడాల్సిన విధంగా కాకుండా... ఒక్కోచోట ఎక్కువ ఒత్తిడి పడటం, మరికొన్ని చోట్ల సరిగా పడకపోవడం వంటి సమస్యలతో మెడనొప్పి, వెన్నునొప్పి రావచ్చు. అందుకే స్కూల్లో/ కాలేజీలో లేదా ఇంట్లో చదువుల బల్ల / కంప్యూటర్ టేబుల్ వద్ద సరిగా (సరైన పోశ్చర్‌లో) కూర్చుండేలా చూడాలి. వెన్నుపై సమాన భారం పడేలా నిటారుగా ఉండాలి. ఏదో ఒక వైపునకు ఒంగిపోకూడదు.

స్థూలకాయం ఉన్న టీనేజీ పిల్లల్లో మెడనొప్పి సమస్య ఎక్కువ. అందువల్ల ఒబేసిటీని పెంచే జంక్‌ఫుడ్ /బేకరీ ఐటమ్స్ లాంటివి కాకుండా టీనేజర్లకు అన్ని పోషకాలూ, విటమిన్లు అందేలా సమతులాహారం ఇవ్వాలి.

గతంలో టీనేజీ పిల్లలు వారి వయసుకు తగ్గట్లు బాగానే ఆటలాడేవారు. కానీ ఇటీవల వారు ఆటలాడటం తగ్గిపోయింది. మరీ ముఖ్యంగా కరోనా తర్వాత అరుదుగా ఆడే ఆటలూ పూర్తిగా కరవైపోయాయి. దాంతో వెన్ను, దాని ఇతర ఎముకలకు తగినన్ని పోషకాలు అందకపోవడం వల్ల కూడా మెడనొప్పి రావడం ఇటీవల పెరిగింది.

తగినంత వ్యాయామం లేని టీనేజర్లు... తమ దేహ శ్రమతో తమ సామర్థ్యం (స్టామినా) పెంచుకోకపోవడం వల్ల త్వరగా అలసిపోతుంటారు. వారి మెడ భాగపు కండరాలూ, అక్కడి వెన్నుపూసల సామర్థ్యం కూడా ఇందుకు మినహాయింపు కాదు. అందుకే పిల్లలు తగినంత వ్యాయామం చేయడం / ఆటలాడటం ద్వారా స్టామినా పెంచుకుంటే మెడనొప్పి వంటి సమస్యలూ తగ్గిపోతాయి.

పిల్లల్లో విటమిన్-డి లోపం వల్ల కూడా మెడనొప్పి వస్తుంది. అంతేకాదు... వ్యాధి నిరోధకత తగ్గి... వయసు పెరిగే క్రమంలో డయాబెటిస్, క్యాన్సర్ వ్యాధుల రిస్క్ కూడా పెరుగుతుంది. అందుకే టీనేజీ పిల్లలు ఆరుబయట ఆడేలా చూడాలి.

మీకు తెలుసా?

మానవ శరీరం చురుగ్గా పనిచేయలంటే ఐరన్, కాల్షియం అనే రెండూ చాలా అవసరం. హిమోగ్లోబిన్ ఉత్పత్తి కావడంలో ఐరన్ కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే, ఆరోగ్యకరమైన ఎముకలు, దంతాలకు కాల్షియం అవసరం. అందుకే వైద్యనిపుణులు వివిధ రకాల కారణాల వల్ల క్యాల్షియం, ఐరన్ సప్లిమెంట్లను తీసుకోవలసిందిగా పేషెంట్లకు సూచిస్తుంటారు. అయితే, ఈ రెండు సప్లిమెంట్లను కలిపి తీసుకుంటే.. కొన్ని దుష్ప్రభావాలు కలుగుతాయి.



ఐరన్, కాల్షియం ఒకదానికొకటి ప్రత్యేకమైన ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అందుకే వాటిని కలిపి ఒకేసారి తీసుకోవడం మంచిది కాదు. విటమిన్లు, మినరల్స్ కరిగిపోవడానికి కొంచెం సమయం పడుతుంది. ఈ రెండూ కలిపి తీసుకోవడం వల్ల వాటి ద్వారా అందాల్సిన ప్రయోజనాలు శరీరానికి అందవు. ఈ రెండు సప్లిమెంట్లను ఆరు గంటల తేడాతో తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

ఇవి గుర్తుంచుకోవాలి

- ఐరన్ తీసుకునే సమయంలో పాలు, చీజ్, పెరుగు, బచ్చలికూర, టీ, కాఫీ, తృణధాన్యాలు తీసుకునే ముందు కనీసం రెండు గంటల గ్యాప్ తీసుకోండి.
- ఐరన్ సప్లిమెంట్లను తీసుకున్న తర్వాత కొన్ని గంటల పాటు యాంటాసిడ్లను కూడా నివారించాలి.
- సూచించిన దానికంటే ఎక్కువ కాలం ఐరన్ సప్లిమెంట్లను తీసుకోవద్దు.

పండంటి నిద్ర

ఆరోగ్యంగా ఉండటానికి సరైన తిండి, శరీరానికి తగిన వ్యాయామాలతో పాటు కంటినిండా నిద్ర కూడా అంతే అవసరం. అయితే కొంతమంది జీవన శైలి, మానసిక ఒత్తిడి కారణంగా సరిగా నిద్రపోవడం లేదు. అటువంటి వారు నిద్రమాత్రలకు బదులు ఆరోగ్య నిపుణులు సూచించిన కొన్ని పండ్లు తీసుకుంటే సరిపోతుంది. ఈ పండ్లను తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్య నుంచి సులభంగా ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా కూడా శరీరాన్ని రక్షించుకోవచ్చు.

అరటి పండు..

నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే సమయంలో అరటిపండును తీసుకోవడం మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

అరటిపండులో ఉండే గుణాలు శరీరంలోని ఒత్తిడిని సులభంగా తగ్గించి నిద్రను మెరుగుపరిచేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా జీర్ణ వ్యవస్థను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈరోజు అరటి పండ్లతోపాటు చెర్రీలను కూడా తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. కొంతమంది తరచుగా నిద్ర పోయినట్లే పోయి మేల్కొంటారు. అయితే ఇలాంటివారు చెర్రీస్‌తో తయారు చేసిన రసాన్ని తాగడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. అంతేకాకుండా ఈ రసాన్ని తాగడం వల్ల చర్మం కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటుంది.



నిద్రను మెరుగుపరిచేందుకు పైనాపిల్ జ్యూస్ ఎంతగానో సహాయపడుతుంది. కాబట్టి నిద్రలేని సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఈ జ్యూస్‌ను తీసుకోవాలి. పైనాపిల్‌లో మెలటోనిన్, విటమిన్ సి, మెగ్నీషియం అధిక పరిమాణంలో లభిస్తాయి. కాబట్టి ప్రతిరోజు దీనితో జ్యూస్‌ని తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది.

కివీ పండ్లు: నిద్ర సమస్యలతో బాధపడేవారు కివి పండ్లను కూడా తీసుకోవచ్చు. ఇందులో ఉండే గుణాలు కూడా నిద్ర స్థాయిలను మెరుగుపరిచేందుకు సహాయపడతాయి.

యాపిల్..



యాపిల్ ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం తెలిసిందే. ప్రతి రోజూ యాపిల్ తింటే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు. రాత్రి పూట తినడానికి యాపిల్ అనేది బెస్ట్ స్నాక్‌గా చెప్పొచ్చు. రాత్రి ఆకలి వేస్తే ఎలాంటి సందేహం లేకుండా యాపిల్ తినండి. ఇందులో ఫైబర్ కంటెంట్ అనేది ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. నిద్ర అనేది బాగా పడుతుంది.

బొప్పాయి..



బొప్పాయిలో విటమిన్ సి, ఇ, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాలు హాయిగా నిద్ర పోయేలా చేస్తాయి. నిద్ర లేమి సమస్యలతో ఇబ్బంది పడేవారు రాత్రి పూట బొప్పాయి తింటే మంచి ఫలితం ఉంటుంది.

సినిమా

డిసెంబరులో ఆరంభం


● ప్రభాస్

ఈ ఏడాది డిసెంబరులో పోలీసాఫీసర్‌గా ప్రభాస్ చార్జ్ తీసుకోనున్నారని తెలిసింది. హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సిన్సియర్ పోలీసాఫీసర్ పాత్రలో నటించనున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది డిసెంబరులో ఆరంభించేలా ప్లాన్ రెడీ చేస్తున్నారట సందీప్ రెడ్డి వంగా. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రష్మికా మందన్నా, కీర్తీ సురేష్, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించనున్నారు. భూషణ్ కుమార్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

టీజర్ రెడీ


● అల్లు అర్జున్

'పుష్ప : ది రూల్' సినిమా టీజర్‌కు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. హీరో అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న 'పుష్ప: ది రూల్' సినిమా టీజర్‌ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త. 'పుష్ప: ది రూల్' సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఇక 'పుష్ప' సినిమా ఫ్రాంచైజీలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సినిమా సక్సెస్ కావడంతో మలి భాగం 'పుష్ప: ది రూల్'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దర్శకుడు త్రివిక్రమ్, మరో దర్శకుడు సందీప్ రెడ్డి వంగాలతో అల్లు అర్జున్ సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల అప్‌డేట్స్ కూడా అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఏప్రిల్ 8న వచ్చే అవకాశం ఉంది. ఇంకా అల్లు అర్జున్-దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లోని కొత్త సినిమా ప్రకటన కూడా రావొచ్చనే ప్రచారం జరుగుతోంది.

ఆలియాకు విలన్‌గా...?


● బాబీ డియోల్

ఆలియా భట్, షార్వరి లీడ్ రోల్స్‌లో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కనుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తున్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్‌గా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందట. శివ్ రావైల్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. గతంలో 'రాజీ' సినిమాలో స్పై పాత్రలో నటించిన ఆలియా భట్ మళ్లీ ఈ సినిమాలో ఆ తరహా పాత్రను ఓకే చేయడం విశేషం. ఇక 'యానిమల్'లో విలన్ రోల్‌లో బాబీ డియోల్ విజృంభించిన విషయం తెలిసిందే. మరి.. యశ్ రాజ్ ఫిలింస్ తాజా చిత్రంలో విలన్‌గా సై అంటే... మరోసారి బాబీ నెగటివ్ పెర్ఫార్మెన్స్‌ని చూసే వీలు దక్కుతుంది.


● బనితా సంధు

ఇటు మెకానిక్ రాకీ.. అటు లైలా!


● మెకానిక్ రాకీలో విశ్వక్ సేన్

బర్త్ డే (మార్చి 29) రోజున హీరో విశ్వక్ సేన్ డబుల్ ధమాకా అందుకున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న రెండు కొత్త సినిమాల వివరాలను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. విశ్వక్ టైటిల్ రోల్‌లో నటించనున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నరేశ్, 'వైవా' హర్ష, హర్షవర్ధన్ కీలక పాత్రల్లో నటిస్తారు. రవితేజ ముళ్లపూడిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ లుక్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు జేక్స్ బిజోయ్ స్వరకర్త. అలాగే విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న మరో సినిమా 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. ఈ సినిమాలో సెకండాఫ్‌లో లైలా అనే అమ్మాయిగా విశ్వక్ కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాకు తనిష్క్ బాగ్చి మ్యూజిక్ డైరెక్టర్. ఈ సినిమాలే కాకుండా విశ్వక్ సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే సినిమా చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 17న విడుదల కానుంది.

వేసవిలో వస్తున్నా డియర్


● జీవీ ప్రకాశ్, ఐశ్వర్య

ఒక కుటుంబంలో ఓ సమస్య వస్తుంది? ఆ సమస్యను ఆ కుటుంబం ఎలా పరిష్కరించింది? వివాహ బంధం సుదీర్ఘంగా సాగడానికి ఏం అవసరం? వంటి అంశాలతో రూపొందిన చిత్రం 'డియర్'. జీవీ ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా ఒక్క రోజు గ్యాప్‌లో విడుదల కానుంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానున్నాయి. తెలుగు వెర్షన్ ఆంధ్ర హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణ రైట్స్ ఏషియన్ సినిమాస్ దక్కించుకున్నాయి. ''చక్కని కామెడీ ఫ్యామిలీ డ్రామాగా 'డియర్'ని వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. తమిళంలో పాటలు పాపులర్ అయ్యాయి. త్వరలోనే తెలుగు పాటలను విడుదల చేయనున్నాం'' అని తెలుగు హక్కులు సొంతం చేసుకున్న సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

స్పైతో బనితా ఎంట్రీ


'అక్టోబర్, సర్దార్ ఉదమ్' వంటి హిందీ చిత్రాలతో తమిళ చిత్రం 'ఆదిత్య వర్మ'తో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు బనితా సంధు. ఈ బ్యూటీ 'జీ 2' (గూఢచారి 2) చిత్రంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు పరిచయం కానున్నారు. అడివి శేష్ హీరోగా రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ (2018) 'గూఢచారి'కి సీక్వెల్‌గా పాన్ ఇండియా స్థాయిలో 'జీ 2' తెరకెక్కుతోంది. గూఢచారిగా హీరో అడివి శేష్ నటిస్తున్నారు. ఈ స్పై సరసన బనితా సంధు హీరోయిన్‌గా నటిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో బనితా జాయిన్ అయిన విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ''శేష్, బనితాలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. తెరపై ఇద్దరి కెమిస్ట్రీ అద్భుతంగా ఉంటుంది. హై ఆక్టేన్ యాక్షన్ మూవీగా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ''ఈ చిత్రంలో నటించడం క్రియేటివ్‌గా నాకు చాలా హ్యాపీగా ఉంది. ఇప్పటివరకూ చేయని పాత్రను ఈ చిత్రంలో చేస్తున్నాను'' అని బనితా సంధు అన్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర చేస్తున్నారు.

అందరూ కనెక్ట్ అవుతారు


● రుహానీ శర్మ

సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారని శుక్రవారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ పేర్కొంది.


కథ రెడీ అవుతోంది!


టామ్‌క్రూజ్

హాలీవుడ్ ఫిల్మ్ 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం 'టాప్‌గన్ 3' సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి రెండు భాగాలు 'టాప్ గన్', 'టాప్‌గన్: మావెరిక్'లో హీరోగా నటించిన టామ్‌క్రూజ్‌యే 'టాప్ గన్ 3'లోనూ హీరోగా నటించనున్నారని తెలుస్తోంది. ''టాప్‌గన్ 3' బేసిక్ కథ సిద్ధంగా ఉంది. టామ్ క్రూజ్‌కు స్టోరీలైన్ చెప్పాం. ఆయన నచ్చిందని చెప్పారు. కథకు మెరుగులు దిద్దే పనిలో ఉన్నాం'' అని 'టాప్‌గన్' ఫ్రాంచైజీ నిర్మాతల్లో ఒకరైన జెర్రీ బ్రూమ్ హైమర్ పేర్కొన్నారు.

ఆస్కార్ విజేత లూయిస్ గోసెట్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. అమెరికన్ ప్రముఖ నటుడు, ఆస్కార్ అవార్డు విజేత లూయిస్ గోసెట్ జూనియర్ (87) కాలిఫోర్నియాలో కన్నుమూశారు. లూయిస్ మరణాన్ని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించినట్లుగా హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. ఇక 1936లో లూయిస్ గోసెట్ సీనియర్, హెలెన్ రెబక్కా దంపతులకు మే 27న న్యూయార్క్‌లో జన్మించారు లూయిస్ గోసెట్ జూనియర్. చిన్నతనంలోనే లూయిస్‌కు నటన పట్ల ఆసక్తి ఉండేది. అలా 17ఏళ్ల వయసులోనే రంగస్థల నటుడిగా మారాడు లూయిస్. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. 'ఎ రైసిన్ ఇన్ ది సన్, ది బ్లాక్స్, ది పనిషర్, స్కిన్‌గేమ్' వంటి సినిమాల్లో నటించారు. 'ది బుక్ ఆఫ్ నీగ్రోస్' వంటి టెలివిజన్ సిరీస్‌లలో కూడా నటించారు లూయిస్. ఇక 1982లో వచ్చిన 'యాన్ ఆఫీసర్ అండ్ ఏ జెంటిల్‌మేన్' సినిమాలోని నటనకుగాను 55వ ఆస్కార్ అవార్డ్స్‌లో లూయిస్ ఉత్తమ సహాయ నటుడు విభాగంలో అవార్డు అందుకున్నారు. కాగా ఈ విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి నటుడు లూయిస్‌నే అని హాలీవుడ్ సమాచారం. అలాగే ఇదే సినిమాకు ఉత్తమ సహాయ నటుడు విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా దక్కించుకున్నారు. 1977లో వచ్చిన మినీ సిరీస్ 'రూట్స్'లోని నటన లూయిస్‌కి మంచి పేరు తెచ్చిపెట్టడంతో పాటు ఎమ్మీ అవార్డు కూడా అందుకునేలా చేసింది.



సాక్షి బిజినెస్
శనివారం
30-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	655	73,651
నిఫ్టీ ▲	203	22,327

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,379	▽ 20
డోజోన్స్	39,807	▲ 47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲ 21
డాక్స్	18,492	▲ 15
షాంఘై	3,041	▲ 30
నికాయ్	40,369	▲ 201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.95	93.97
£	బ్రిటన్ పౌండ్	104.23	106.78
€	యూరో	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	55.64	55.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	21.78	23.57
¥	చైనా యువాన్	10.42	12.49



దేశంలో ఆధ్యాత్మిక టూరిజం జోష్

రిటైల్ బ్రాండ్స్ ప్రత్యేక దృష్టి • లిస్టులో తిరుపతి, అయోధ్య, వారణాసి

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక పర్యాటకంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో బడా రిటైల్ బ్రాండ్లు ఆధ్యాత్మిక కేంద్రాలపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అందించే దిశగా తిరుపతి, అయోధ్య, వారణాసి, అమృత్‌సర్, పూరి, అజ్మీర్ వంటి నగరాల్లో గణనీయంగా విస్తరిస్తున్నాయి. 14 కీలక నగరాల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక టూరిజంతో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రిటైల్ చెయిన్స్ అనుసరిస్తున్న వ్యూహాలపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మదురై, గురువాయూర్, ద్వారకా, మథురా తదితర నగరాల్లో కూడా రిటైల్ బూమ్ కనిపిస్తున్నట్లు రిపోర్టు పేర్కొంది. పేరొందిన మాల్స్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూడా టూరిస్టులను ఆకర్షించేలా తమ బ్రాండ్లను ప్రదర్శించడంపై రిటైల్ సంస్థలు దృష్టి పెడుతున్నాయి. అయోధ్యలో మాన్యవర్, రిలయన్స్ ట్రెండ్స్, రేమండ్స్, మార్కెట్99, ప్యాంటలూన్స్, డామినోస్, పిజ్జా హట్, రిలయన్స్ స్మార్ట్ మొదలైనవి తమ రిటైల్ స్టోర్స్ ప్రారంభించినట్లు నివేదిక వివరించింది. వారణాసిలో జుడియో, షాపర్స్ స్టాప్, బర్గర్ కింగ్ తదితర సంస్థలు కూడా కార్యకలాపాలు విస్తరించినట్లు పేర్కొంది. టూరిజంను ప్రోత్సహించేందుకు, కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం లభిస్తున్నట్లు సీబీఆర్‌ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. ఫ్యాషన్, ఫుడ్ అండ్ బెవరేజెస్, హైపర్‌మార్కెట్లు మొదలైన సంస్థలన్నీ కూడా భక్తుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను అందిస్తూ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు వివరించారు. ఆధ్యాత్మిక టూరిజం ట్రెండ్‌తో ఆయా ప్రాంతాల్లో ఆతిథ్య, రిటైల్ రంగాలకు కలిసి వస్తోందని సీబీఆర్‌ఈ ఇండియా ఎండీ రామ్ చంద్నానీ తెలిపారు.

ఎఫ్‌పీఐల భారీ పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్‌మెంట్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్న నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ ఇటువైపు చూస్తున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీల్లో ఏకంగా రూ. 2 లక్షల కోట్ల పైగా ఇన్వెస్ట్ చేశారు. డెట్ మార్కెట్లో రూ. 1.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టారు. మొత్తం మీద భారత క్యాపిటల్ మార్కెట్లో రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈక్విటీల నుంచి ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. 2020-21లో ఏకంగా రూ. 2.74 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు ఆ మరుసటి సంవత్సరం రూ. 1.4 లక్షల కోట్లు, ఆ తర్వాత 2022-23లో రూ. 37,632 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 2023-24లో భారీగా ఇన్వెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సానుకూలంగా కొత్త ఏడాది..

కొత్త ఆర్థిక సంవత్సరంపై కూడా అంచనాలు కాస్త సానుకూలంగానే ఉన్నాయని భారత్‌లో మజార్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ తెలిపారు. పురోగామి పాలసీ సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాల కారణంగా దేశంలోని ఎఫ్‌పీఐల ప్రవాహం స్థిరంగా కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాల కారణంగా మధ్యమధ్యలో ఒడిదుడుకులు ఉండవచ్చన్నారు.

చిన్న షేర్ల పెద్ద ర్యాలీ

60 శాతానికి మించి రాబడులు • 2023-24లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా

న్యూఢిల్లీ: దలాల్ స్ట్రీట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023 -24)లో రిటైల్ ఇన్వెస్టర్ల హవా కొనసాగింది. దేశంలో దృఢమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య స్థాయి షేర్లను కొనేందుకు అధిక ఆసక్తి చూపారు. 2023-24లో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 62%, స్మాల్ క్యాప్ సూచీ 60% రాణించాయి. ఇదే కాలంలో బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 25% పెరిగింది.

''ఆదాయాలు గణనీయంగా పెరగడం, అధిక వృద్ధి అవకాశాలతో రిటైల్ ఇన్వెస్టర్లు చిన్న, మధ్య తరహా షేర్లను కొనుగోలుకు ఆసక్తి చూపారు. లార్జ్ క్యాప్ షేర్ల పట్ల విముఖత చూపారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నికర పెట్టుబడులు పెరగడం ఇందుకు నిదర్శనం. ఆర్థిక విస్తరణ సమయంలో చిన్న, మధ్య తరహా షేర్ల వృద్ధి వేగంగా ఉంటుందనే సంప్రదాయ సూత్రాన్ని వారు విశ్వసించారు. అంతేకాకుండా స్మాల్, మిడ్ సైజ్ కంపెనీల అద్భుతమైన త్రైమాసిక ఫలితాలు వారిని కొనుగోళ్ల వైపు ఆకర్షితం చేశాయి'' అని హెడ్జ్ ఫండ్ హెడోనోవా సీఐఓ సుమన్ బెనర్జీ తెలిపారు.



- 2023-24లో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫిబ్రవరి 8న 40,282 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. గతేడాది మార్చి 31న 23,881 వద్ద ఏడాది కనిష్ఠానికి తాకింది.
- ఇదే కాలంలో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ ఫిబ్రవరి 7న 46,821 వద్ద ఆల్‌టైం హైని నమోదు చేయగా, గతేడాది మార్చి 31న 26,692 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని తాకింది.
- సెన్సెక్స్‌తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య స్థాయి షేర్ల అత్యుత్తమ ప్రదర్శన భారత ఈక్విటీ మార్కెట్ క్రియాశీలక స్వభావాన్ని, ఇన్వెస్టర్ల అపార వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తుందని స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతి తెలిపారు.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ చిన్న, మధ్య తరహా షేర్ల ర్యాలీ కొనసాగుతుందని న్యాతి అభిప్రాయపడ్డారు. "సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వమే తిరిగి అధికారాన్ని దక్కించుకోవచ్చనే అంచనాలతో వ్యాపార అనుకూల వాతావరణం పెంపొంది స్థిరమైన వృద్ధి కొనసాగొచ్చు. దీనికి తోడు భారత వృద్ధి బలమైన అవుట్‌లుక్ అంచనాలు ఈ రంగాల షేర్లకు డిమాండ్‌ను పెంచుతాయి" న్యాతి తెలిపారు. అయితే కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు, అంతర్జాతీయ అనిశ్చితులు, లాభాల స్వీకరణ వంటి అంశాలు స్వల్పకాలిక ఒడిదుడుకులకు దారితీయొచ్చన్నారు.

ఐపీవో బాటలో ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రా

ఆఫ్కన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈ షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఐపీవోతో రూ. 7,000 కోట్లు సమకూర్చుకోనుంది.

రూ. వెయ్యి కోట్లకు జిరోధా ఫండ్ విలువ

జిరోధా, స్మాల్‌కేస్ జేవీ జిరోధా ఫండ్ హౌస్ నిర్వహణలోని ఆస్తుల విలువ కేవలం 40 రోజుల్లో రూ. 500 కోట్ల మేర ఎగిసింది. దీంతో సంస్థ ఏయూఎం రూ. 1,000 కోట్ల మార్కును దాటింది.

300 నగరాల్లో కియా కేంద్రాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కియా ఇండియా విక్రయ, సర్వీస్ కేంద్రాలను విస్తరిస్తోంది. కియా 2.0 వ్యూహంలో భాగంగా డిసెంబర్‌కల్లా 300 నగరాలు, పట్టణాల్లో అడుగు పెట్టడం ద్వారా టచ్ పాయింట్స్ సంఖ్యను 700లకు చేరుస్తామని ప్రకటించింది. ప్రస్తుతం 236 నగరాలు, పట్టణాల్లో కంపెనీకి 522 సేల్స్, సర్వీస్ సెంటర్స్ ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-3-2024 ఫామ్ ధర...	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో వాటా విక్రయం

బ్యాంక్ నుంచి వార్‌బర్గ్ పింకస్ ఔట్

న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ నుంచి పూర్తిగా వైదొలగింది. తాజాగా బ్యాంకులోగల మొత్తం 2.25 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 75.24 సగటు ధరలో 15.88 కోట్ల బ్యాంకు షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 1,195 కోట్లుకాగా.. క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా 2023 డిసెంబర్‌కల్లా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 2.25 శాతం వాటాను కలిగి ఉంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో 4.2% వాటాను వార్‌బర్గ్ పింకస్ రూ. 2,480 కోట్లకు విక్రయించిన విషయం విదితమే. కాగా.. గురువారం బీఎస్‌ఈలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు 3.1% క్షీణించి రూ. 75.4 వద్ద ముగిసింది.

హైరింగ్ ప్రణాళికల్లో స్టోరబుల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెల్ఫ్-స్టోరేజ్ టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే అమెరికన్ సంస్థ స్టోరబుల్ భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరిస్తోంది. హైదరాబాద్‌లో 15వేల చ.అ. విస్తీర్ణంలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. గతేడాదే హైదరాబాద్‌లో తమ ఏషియా జీసీసీని స్టోరబుల్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇక్కడ 60 మంది ఉద్యోగులు ఉండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 120కి పెంచుకోనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ చార్లీ మారియట్ తెలిపారు. ఇంజనీరింగ్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు.



అమెరికా జట్టులో కోరీ అండర్సన్

న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ కోరీ అండర్సన్ ఇకపై అంతర్జాతీయ క్రికెట్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్‌ఏ) జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. కివీస్ తరఫున 13 టెస్టులు, 49 వన్డేలు, 31 టి20లు ఆడిన అండర్సన్ ఆఖరిసారిగా 2018లో తన దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 2014లో వన్డేల్లో ఫాస్టెస్ట్ సెంచరీ (36 బంతుల్లో)తో వెలుగులోకి వచ్చిన అతను ఆ తర్వాత 2015లో వరల్డ్ కప్ ఫైనల్ చేరిన కివీస్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. కెనడాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం ప్రకటించిన అమెరికా టీమ్‌లో అండర్సన్‌కు చోటు దక్కింది. అయితే ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లి అక్కడి మైనర్ లీగ్‌లో భారీగా పరుగులు సాధించినా...భారత అండర్-19 విజేత జట్టు కెప్టెన్ ఉన్ముక్త్ చంద్‌కు మాత్రం జట్టులో స్థానం లభించలేదు. మరో వైపు భారత దేశవాళీ క్రికెట్‌లో రాణించిన హర్మీత్ సింగ్, మిలింద్ కుమార్, సౌరభ్ నేత్రావల్కర్‌లు కూడా టీమ్‌లో అవకాశం దక్కించుకున్నారు.

కోల్‌కతా లెక్క మార్చేసింది

- సొంతగడ్డపై బెంగళూరుకు చెక్
- 7 వికెట్లతో నైట్‌రైడర్స్ విజయం
- చెలరేగిన నరైన్, సాల్ట్, వెంకటేశ్
- కోహ్లి వీరోచిత ప్రదర్శన వృథా



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నరైన్

బెంగళూరు: కోల్‌కతా ఓపెనర్లు నరైన్ (22 బంతుల్లో 47; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), సాల్ట్ (20 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్ ముందు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి (59 బంతుల్లో 83; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) క్లాసిక్ ఇన్నింగ్స్ చిన్నదిగా మారిపోయింది. దీంతో ఈ సీజన్‌లో తొలి సారి సొంతగడ్డపై ఆతిథ్య జట్టుకు చుక్కెదురైంది. కోల్‌కతా గత తొమ్మిది మ్యాచ్‌ల సంప్రదాయాన్ని ఈ మ్యాచ్‌తో మార్చేసింది. చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ 7 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఆరంభం నుంచి కోహ్లి, ఆఖర్లో దినేశ్ కార్తీక్ (8 బంతుల్లో 20; 3 సిక్స్‌లు) మెరిపించారు. అనంతరం కోల్‌కతా 16.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు.

కోహ్లి ఒక్కడే...

తొలి బంతికే బౌండరీతో కోహ్లి బెంగళూరు ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టాడు. సహచరులంతా తక్కువ స్కోరుకే అవుటవుతున్నా... తన వీరోచిత ప్రదర్శనతో పరుగుల్ని వేగంగా పేర్చిన కోహ్లి పెద్ద భాగస్వామ్యాలతో ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. కెప్టెన్ డుప్లెసిస్ (8) రెండో ఓవర్లోనే అవుట్ కాగా, గ్రీన్ (21 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (19 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ఎంతోసేపు నిలువలేదు. కోహ్లి ఒక్కడే నిలిచి ఇన్నింగ్స్‌ను ఆఖరి దాకా నడిపించాడు. తన మార్కు క్లాసిక్ షాట్లతో, తనకు మాత్రమే సాధ్యమైన ఆటతీరుతో బెంగళూరు ప్రేక్షకుల్ని ఆద్యంతం కేరింతల్లో ముంచేశాడు. 36 బంతుల్లో విరాట్ అర్ధ సెంచరీ పూర్తయ్యింది. గత మ్యాచ్‌లో పేలవ బౌలింగ్‌లో ఒక్క వికెట్ తీయకుండా 53 పరుగులిచ్చిన మిచెల్ స్టార్క్ ఈ సారి కూడా వికెట్ తీయకుండా 47 పరుగులు సమర్పించుకున్నాడు.



కోహ్లి

'పవర్ ప్లే'లో 85/0

కోల్‌కతా ముందున్న లక్ష్యం కష్టమైంది. కానీ సులువుగా ఛేదించింది. ఓపెనర్లు సాల్ట్, నరైన్‌ల బ్యాటింగ్ సునామీ 'పవర్ ప్లే'లోనే మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తెచ్చుకుంది. ఓపెనర్లు ఇద్దరూ దంచేసే పనిలో పడటంతో సిక్స్‌లైతే మంచినీళ్ల ప్రాయంలా వచ్చేశాయి. సిరాజ్ తొలి ఓవర్‌లో సాల్ట్ రెండు సిక్స్‌లు, ఒక బౌండరీలతో ఉతికేశాడు. సునీల్ నరైన్... తానేం తక్కువ కాదని జోసెఫ్ మూడో ఓవర్లో 2 భారీ సిక్సర్లతో చాటుకున్నాడు. ఈ మెరుపుల మేనియాలో నైట్‌రైడర్స్ జట్టు కేవలం 3.3 ఓవర్లలోనే 50 పరుగుల మార్క్‌ను దాటేసింది. 6 ఓవర్లలో వికెటే కోల్పోకుండా 85 పరుగులు చేసింది. అంతలోనే చేయాల్సిన పరుగులు వందలోపే దిగొచ్చింది. ఏడో ఓవర్లో నరైన్‌ను డాగర్, ఎనిమిదో ఓవర్లో సాల్ట్‌ను వైశాక్ అవుట్ చేశారు. కానీ అప్పటికే స్కోరు 92/2. లక్ష్యంలో సగం పనైపోయింది. మిగతా సగాన్ని వెంకటేశ్ అయ్యర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (24 బంతుల్లో 39 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పూర్తి చేశారు. దీంతో 19 బంతులు మిగిలుండగానే నైట్ రైడర్స్ లక్ష్యాన్ని చేరుకుంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి నాటౌట్ 83; డుప్లెసిస్ (సి) స్టార్క్ (బి) హర్షిత్ 8; గ్రీన్ (బి) రసెల్ 33; మ్యాక్స్‌వెల్ (సి) రింకూసింగ్ (బి) నరైన్ 28; పటిదార్ (సి) రింకూసింగ్ (బి) రసెల్ 3; రావత్ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 3; దినేశ్ కార్తీక్ రనౌట్ 20; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-17, 2-82, 3-124, 4-144, 5-151, 6-182. **బౌలింగ్:** స్టార్క్ 4-0-47-0, హర్షిత్ 4-0-39-2, అనుకూల్ 2-0-6-0, నరైన్ 4-0-40-1, రసెల్ 4-0-29-2, వరుణ్ 2-0-20-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) గ్రీన్ (బి) వైశాక్ 30; నరైన్ (బి) డాగర్ 47; వెంకటేశ్ (సి) కోహ్లి (బి) యశ్ దయాళ్ 50; శ్రేయస్ నాటౌట్ 39; రింకూ సింగ్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (16.5 ఓవర్లలో 3 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1-86, 2-92, 3-167. **బౌలింగ్:** సిరాజ్ 3-0-46-0, యశ్ దయాళ్ 4-0-46-1, జోసెఫ్ 2-0-34-0, మయాంక్ డాగర్ 2.5-0-23-1, వైశాక్ 4-0-23-1, వైశాక్ 1-0-7-0.

ఐపీఎల్‌లో నేడు

లక్నో X పంజాబ్
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
చెన్నై	2	2	0	4	1.979
కోల్‌కతా	2	2	0	4	1.047
రాజస్తాన్	2	2	0	4	0.800
హైదరాబాద్	2	1	1	2	0.675
పంజాబ్	2	1	1	2	0.025
బెంగళూరు	3	1	2	2	-0.711
గుజరాత్	2	1	1	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	-0.528
ముంబై	2	0	2	0	-0.925
లక్నో	1	0	1	0	-1.000

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

నరైన్ @ 500

వెస్టిండీస్ ఆఫ్‌స్పిన్నర్ సునీల్ నరైన్ టి20 క్రికెట్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. ఆర్‌సీబీతో మ్యాచ్‌తో అతను ఈ ఫార్మాట్‌లో అతను 500 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన 4వ ఆటగాడిగా అతను నిలిచాడు. నరైన్‌కు ముందు పొలార్డ్ (660), డ్వేన్ బ్రేవో (573), షోయబ్ మలిక్ (542) అతనికంటే ముందు 500 మ్యాచ్‌లు ఆడారు. 35 ఏళ్ల నరైన్ ఈ సుదీర్ఘ కెరీర్‌లో ఏకంగా 17 టి20 జట్లకు ప్రాతినిధ్యం వహించి 537 వికెట్లు పడగొట్టాడు. వరల్డ్ కప్ సహా మొత్తం 10 టైటిల్స్ విజయాల్లో అతను భాగంగా ఉన్నాడు. ఐపీఎల్‌లో 2012నుంచి వరుసగా 13 సీజన్లుగా కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున 164 మ్యాచ్‌లు ఆడాడు. బ్యాటింగ్‌లో కూడా ఓపెనర్‌గా, పించ్ హిట్టర్‌గా బరిలోకి దిగి కేకేఆర్ పలు విజయాల్లో అతను కీలక పాత్ర పోషించాడు.

సెమీస్‌లో సిక్కి-సుమీత్ జోడి

- క్వార్టర్స్‌లో ఓడిన సింధు
- స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్



మాడ్రిడ్: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ (సూపర్ 300) టోర్నీ స్పెయిన్ మాస్టర్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో స్టార్ ప్లేయర్ పీవీ సింధు ఓడగా...మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి - సుమీత్ రెడ్డి జోడి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో, పురుషుల డబుల్స్‌లో కూడా భారత జోడీలు క్వార్టర్స్‌లో వెనుదిరిగాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో సింధు పోరాడి ఓడింది. ఈ మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన ఆరో సీడ్ సుపనిద కేట్‌టాంగ్ 24-26, 21-17, 22-20తో రెండో సీడ్ సింధును ఓడించింది. 77 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ఇద్దరు షట్లర్లూ ఒక్కో పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. తొలి గేమ్‌లో 4-8తో వెనుకబడిన తర్వాత వరుస 7 పాయింట్లతో సింధు 11-8కి వెళ్లింది. అయితే ఆ తర్వాత సుపనిద కోలుకుంది. దాంతో స్కోరు 17-17, 20-20, 24-24 వరకు సమంగా సాగగా, చివరకు గేమ్ సింధు గెలుచుకుంది. రెండో గేమ్‌లో 8-11తో వెనుకబడి కూడా సుపనిద పోరాడి గేమ్‌ను సొంతం చేసుకోగలిగింది. చివరి గేమ్‌లో 8-4తో సింధు ముందంజ వేసింది. అయితే భారత షట్లర్ వరుస తప్పిదాలతో ప్రత్యర్థికి అవకాశం కల్పించింది. ఒక దశలో వరుస 10 పాయింట్లలో 9 సుపనిద ఖాతాలోకే చేరాయి. 15-20తో ఓటమి దాదాపు ఖాయమైన దశలో సింధు వరుసగా 5 మ్యాచ్ పాయింట్లు సాధించి 20-20 వరకు తీసుకొచ్చింది. అయితే వరుస రెండు పాయింట్లతో సుపనిద ఆట ముగించడంతో రాకెట్ విసిరేసి సింధు కోర్టులోనే కుప్పకూలిపోయింది.

డబుల్స్ జోడీల పరాజయం...

41 నిమిషాల పాటు సాగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సుమీత్ - సిక్కి జోడి 14-21, 21-11, 21-17 స్కోరుతో ఇండోనేసియాకు చెందిన రేహన్ నౌఫల్ - లిసా అయు ద్వయంపై విజయం సాధించింది. తొలి గేమ్‌ను కోల్పోయినా...పట్టుదలగా ఆడిన భారత జంట తర్వాతి రెండు గేమ్‌లలో సత్తా చాటి సెమీస్‌లోకి అడుగు పెట్టింది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన మూడో సీడ్ అశ్విని పొన్నప్ప - తనీషా క్రాస్టోకు ఓటమి ఎదురైంది. ఆరో సీడ్ లీ చియా సిన్ - టెంగ్ చున్ సున్ (చైనీస్ తైపీ) వరుస గేమ్‌లలో 21-12, 21-10తో అశ్విని - తనీషాలను చిత్తు చేశారు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లోలో భారత్‌కు చెందిన ఎనిమిదో సీడ్ ధ్రువ్ కపిల - ఎంఆర్ అర్జున్ 19-21, 23-21, 17-21 తేడాతో మలేసియాకు చెందిన జునేదీ ఆరిఫ్ - రాయ్ కింగ్ చేతిలో పరాజయంపాలయ్యారు.

కోచ్‌గా స్టిమాక్ కొనసాగింపు!



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు మైదానంలో నిరాశాజనక ఫలితాలు సాధిస్తున్నప్పటికీ... కోచ్‌గా ఐగర్ స్టిమాక్ కొనసాగనున్నారు. 2026 ఫిఫా ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో అఫ్గానిస్తాన్ లాంటి చిన్న జట్టుతో ఓటమి పాలవడం ఆయన కోచ్ పదవికి ఎసరు తెచ్చింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) సాంకేతిక కమిటీ కూడా హెడ్ కోచ్‌ను తప్పించాలనే సిఫార్సు చేసింది. అయితే ఒప్పంద నిబంధనలు ఆయన్ని ఉన్న పళంగా తప్పిస్తే భారీ మూల్యం చెల్లించేలా ఉన్నాయి. దీంతో వేటు కంటే కొనసాగించడమే మేలని ఏఐఎఫ్‌ఎఫ్ భావిస్తోంది. 'ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టిమాక్ ఇన్‌చార్జ్‌గా జూన్ వరకు జట్టుతో కలిసి పనిచేస్తారు' అని ఏఐఎఫ్‌ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. జూన్‌లో ఆసియా క్వాలిఫయర్స్‌కు సంబంధించిన రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. గ్రూప్ 'ఎ'లో భారత్... కువైట్, ఖతర్‌లతో తలపడాల్సివుంటుంది. ఈ ఫలితాలను బట్టే తదుపరి మూడో రౌండ్‌కు అర్హత సాధించేది లేనిది తేలుతుంది. అఫ్గానిస్తాన్‌తో ఇంటా బయటా జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ నిరాశపరిచింది. అఫ్గాన్‌కు సంబంధించిన హోమ్ మ్యాచ్ సౌదీలో జరగ్గా భారత్ డ్రా చేసుకుంది.

సిలువను మోసి.. సత్య సందేశాన్ని చాటి..

సకల మానవుల పాప ప్రక్షాళన కోసం సిలువపై అసువులు బాసిన జీసస్‌ను స్మరిస్తూ.. శుక్రవారం నగరంలోని క్రైస్తవులు 'గుడ్ ఫ్రై డే'ను జరుపుకున్నారు. మియాపూర్‌లోని కల్వరి టెంపుల్, అబిడ్స్‌లోని మెథడిస్ట్, సెయింట్ జోసెఫ్ చర్చిలు, సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ, న్యూబోయిన్‌పల్లిలోని అవర్ లేడీ ఆఫ్ మౌంట్ కార్మెల్ తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు వేషధారణల్లో సిలువ మోసి ఆయన త్యాగాలను కళ్లకు కట్టారు. జీసస్ సత్య సందేశాన్ని సమస్త మానవాళికి చాటిచెప్పిన విధానాన్ని ప్రదర్శించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడుతూ కనిపించాయి.


సికింద్రాబాద్ సెయింట్ మేరీ చర్చిలో..


మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో..


అవర్ లేడీ ఆఫ్ మౌంట్ కార్మెల్ చర్చిలో..

సిలువతో భక్తురాలు


అబిడ్స్ సెయింట్ జోసెఫ్ చర్చిలో..


న్యూ బోయిన్‌పల్లిలో..

భవనం ఖాళీ చేసేందుకు డబ్బులు డిమాండ్

- అగ్రిమెంట్ ముగిసినా ఖాళీ చేయని ముగ్గురు వ్యక్తులు
- త్రిపుర విశ్రాంత డీజీపీ ఫిర్యాదుతో క్రిమినల్ కేసు నమోదు

బంజారాహిల్స్: లీజు అగ్రిమెంట్ ముగిసినా భవనం ఖాళీ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తూ త్రిపుర విశ్రాంత డీజీపీని ఇబ్బందులకు గురిచేస్తున్న ముగ్గురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ నవ నిర్మాణ నగర్‌లో నివసించే కె.నాగరాజు త్రిపురలో డీజీపీగా చేసి పదవీ విరమణ పొందారు. ఆయనకు బంజారాహిల్స్ రోడ్డు నంబరు 2, హుడా రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల భవనం ఉంది. ఆ భవనాన్ని 2017లో హబీబ్ నగర్‌కు చెందిన కిషోర్‌కుమార్‌కు లీజుకు ఇచ్చారు. పలు నిబంధనలతో కూడిన ఐదు సంవత్సరాల ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. గతేడాది జనవరితో లీజు అగ్రిమెంట్ ముగిసింది. భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు నాగరాజు తన కుమారుడితో కలిసి అక్కడకు వెళ్లారు. లీజు అగ్రిమెంట్‌లోని నిబంధనలను అధిగమిస్తూ కిషోర్ భవనాన్ని అబ్దుల్ రహీం, దామోదర్ దాస్ బజాజ్‌కు సబ్ లీజుకు ఇచ్చారు. సబ్ లీజుకు తీసుకున్న రహీం, దామోదర్ దాస్‌లు భవనంలోని సరిహద్దులను చెరిపివేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు సర్వెంట్ గదిని పడగొట్టారు. దీనిపై భవన యజమాని నాగరాజు తీవ్ర స్థాయిలో కిషోర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే భవనాన్ని ఖాళీ చేసి లీజు అగ్రిమెంట్ ప్రకారం బకాయి ఉన్న అద్దెను, నిర్మాణాల వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని సూచించారు. కానీ.. కిషోర్, రహీం, దామోదర్ పట్టించుకోలేదు. నిర్లక్ష్య ధోరణితో నాగరాజును ఏడాది కాలంగా ఇబ్బంది పెడుతూ వచ్చారు. అద్దె కూడా కట్టలేదు. నాగరాజు వాకబు చేయగా కిషోర్ ఇన్‌కంట్యాక్స్ టీడీఎస్ కూడా కట్టలేదని తేలింది. దీంతో ఉద్దేశపూర్వకంగా కిషోర్, రహీం, దామోదర్ తన ఇంటిని ఆక్రమించుకోవడమే కాకుండా అద్దె చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ నాగరాజు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై ఐపీసీ 420, 448, 427, 109 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువతిపై లైంగిక దాడి

ఫుడ్ డెలివరీ బాయ్ అరెస్ట్

బంజారాహిల్స్: మాట్లాడే పని ఉందని చెప్పి హోటల్‌కు పిలిచి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ఫుడ్ డెలివరీ బాయ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మల్లేపల్లికి చెందిన ఒబేదుల్లాఖాన్ (23) ఫుడ్ డెలివరీ బాయ్. ఎనిమిది నెలల క్రితం లక్డీకాపూల్‌లో ఓ సెమినార్‌కు హాజరైన ప్రైవేటు ఉద్యోగిని (22) ఫుడ్ ఆర్డర్ చేయడంతో ఒబేదుల్లా ఆమెకు అందజేశాడు. ఆమె డబ్బులను గూగుల్ పే చేయడంతో ఆ నంబర్ తీసుకున్న ఒబేదుల్లా ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ పరిచయం పెంచుకున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉండే సదరు యువతి ఒబేదుల్లాకు సన్నిహితమైంది. ఇదే అదనుగా భావించినన ఒబేదుల్లా గురువారం రాత్రి మాట్లాడే పని ఉందని ఆమెను తన బైక్‌పై తీసుకుని బంజారాహిల్స్‌లోని ఓయో రూమ్‌కు వచ్చాడు. రాత్రి ఒంటి గంట తర్వాత ఆమె నిద్ర మత్తులో ఉండగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై ఐపీసీ 376, 354, 354 (ఏ), డి, 376, 66 (ఇ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

నిర్మాణ సంస్థలో పేలుడు

కార్మికుడి దుర్మరణం
మరొకరికి గాయాలు

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఓ నిర్మాణ సంస్థలో పేలుడు కారణంగా ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. మరో కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఐడీఎల్ కంపెనీ సమీపంలో 'ఆనర్' సంస్థలో విల్లాలు, బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారు. బహుళ నిర్మాణ సంస్థ కావటంతో వివిధ విభాగాల్లో కూలీలు పని చేస్తున్నారు. పేలుళ్లతో పెద్ద పెద్ద రాళ్లను పగులగొడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వేరే చోట పనులు చేసి పేలుడు ప్రాంతానికి సమీపం నుంచి భోజనం చేయటానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పేలుడు సంభవించటతంతో ఇద్దరు కూలీలపై రాళ్లు పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వెస్ట్ బెంగాల్‌కు చెందిన హరిలాల్ మహనాతో (54) మృతి చెందాడు. బిహార్‌కు చెందిన పంకజ్ ఆలం (32) చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.2.86 కోట్ల నగదు సీజ్

- ఇప్పటివరకు పట్టుబడిన మొత్తం ఇది..
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా హైదరాబాద్ పరిధిలో ఇప్పటివరకు రూ.2,86,98,700 నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. నగదుతో పాటు రూ.51,76,835 విలువైన వస్తువులను పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో రూ. 6,00,700 నగదుతో పాటు, రూ.4 వేల విలువైన వస్తువులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టివేతలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు రాగా పరిష్కరించినట్లు తెలిపారు. ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 1517.47 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడంతోపాటు 109 కేసులు నమోదు చేసి 110 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నగదు స్వాధీనం కేసుల్లో గ్రీవెన్స్ కమిటీకి అందిన ఫిర్యాదుల్లో సరైన ఆధారాలు చూపించిన తొమ్మిది కేసులకు సంబంధించి రూ.20,74,590 నగదు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రూ.10 లక్షలకు మించి నగదు స్వాధీనం చేసుకున్న రెండు కేసులను ఆదాయ పన్ను శాఖ పరిశీలనకు పంపినట్లు తెలిపారు. అత్యవసరమైన కేసులకు (పర్యాటకులకు) సంబంధించిన కేసుల్ని వెంటనే పరిశీలించి నగదు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సహాయం అవసరమైన వారు జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్‌ను 96188 88110లో, కమిటీ కన్వీనర్‌ను 91778 72240లో సంప్రదించవచ్చని రోనాల్డ్ రాస్ సూచించారు.

నేడు అంబర్‌పేట్‌కు కేటీఆర్


పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: అంబర్‌పేట్ నియోజకవర్గంలో శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేటీఆర్ పర్యటనపై చర్చించారు. నియోజకవర్గంలోని అంబర్‌పేట్ డివిజన్‌లో కేటీఆర్ పర్యటన ఖరారయిందని ఆయన వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు చేపట్టే పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, మేడిప్రసాద్, సిద్ధార్థ ముదిరాజ్, భీష్మ తదితరులు పాల్గొన్నారు.

ముప్పు లేదు!

పార్టీ మారినా.. నో ఫియర్!!

- మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు పదిలం
- జీహెచ్ఎంసీలో నాలుగేళ్ల వరకు అవిశ్వాసానికి నో చాన్స్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నా ఆమె పదవికి ఢోకా లేదు. అలాగే డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నా ఆమె పదవికీ నష్టం లేదు. ఎన్నికైన పార్టీ నుంచి ఎమ్మెల్యేలు వేరే పార్టీకి మారితే అనర్హత వేటుపడే ప్రమాదం ఉన్నా మేయర్, డిప్యూటీ మేయర్‌లకు మాత్రం పదవులు పోయే ప్రమాదం లేదు. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీలు మారినా వారి పదవులు పోయే అవకాశం లేదు. మొత్తం పాలక మండలిలో మెజార్టీ సభ్యుల అవిశ్వాస తీర్మానం ద్వారా మాత్రమే వారి పదవులు పోయే ప్రమాదం ఉన్నా, బాధ్యతలు చేపట్టాక నాలుగేళ్ల వరకు కూడా అలాంటి అవకాశం లేదు. అందుకే వారు ఏ పార్టీకి మారినా దాదాపు మరో ఏడాది వరకు వారి పదవులకు వచ్చిన నష్టం ఏమీ లేదు. ప్రస్తుత పాలకమండలిలో మేయర్‌గా విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా శ్రీలత బాధ్యతలు స్వీకరించింది 2021 ఫిబ్రవరి 11న. 2025 ఫిబ్రవరి 10 వరకు వారి పదవులకు వచ్చిన ముప్పు ఏమీ లేదు. ఒకవేళ వారి పనితీరు బాగాలేదనో, మరో కారణంతోనో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలనుకున్నా అప్పటి వరకు ఆగాల్సిందే. కాబట్టి.. ఇప్పుడు జీహెచ్ఎంసీలో పార్టీల బలాబలాలు, అవిశ్వాస తీర్మానాలు అనేవి అసలు అంశమే కాదని అటు అధికారులతో పాటు ఇటు రాజకీయ నేతలు సైతం చెబుతున్నారు. నాలుగేళ్ల గడువు తర్వాత అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా వారి పదవులకు మిగిలి ఉండేది స్వల్ప సమయం మాత్రమే. అప్పటికి పార్టీల బలాబలాల్లో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయి.

మారనున్న బలాబలాలు

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మేయర్ పార్టీ మారుతుండగా, ఇదివరకే మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, డిప్యూటీ మేయర్ దంపతులు శ్రీలత, శోభన్ రెడ్డిలు సైతం కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. ఇదే వరుసలో దాదాపు ఇరవైమంది కార్పొరేటర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి సైతం కొందరిని లాగే ప్రయత్నాల్లో కాంగ్రెస్ ఉన్నట్లు తెలిసింది.

ఫలించిన కాంగ్రెస్ వ్యూహం



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే జీహెచ్ఎంసీ మేయర్‌గా ప్రతిపక్ష పార్టీ వారుండరాదనే పట్టుదలతో ఉంది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేసేది తమ ప్రభుత్వమే అయినందున మేయర్, డిప్యూటీ మేయర్‌లు కూడా తమ పార్టీ వారే ఉండాలనే వ్యూహంతో పనిచేసింది. ఆ దిశగా సఫలమైన కాంగ్రెస్ ఇక కార్పొరేటర్లపైనా వల వేయనుంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ సభ్యులు గెలిచింది ఇద్దరే అయినప్పటికీ, ప్రస్తుతం ఆ సంఖ్య డజనుకు చేరింది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి దాదాపు 30 మంది వరకు కాంగ్రెస్‌లో చేరతారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని, ఎమ్మెల్యేలు పార్టీలు మారితే వారి అనుయాయులు, అనుచరులుగా ఉన్న కార్పొరేటర్లు కూడా పార్టీ మారతారని చెబుతున్నారు. తమ డివిజన్లలో ఎక్కువ అభివృద్ధి పనులు జరగాలంటే, అందుకు అవసరమైన నిధులు పొందాలంటే అధికార పార్టీలో ఉంటేనే సాధ్యమని కార్పొరేటర్లు సైతం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల నాటికే కాంగ్రెస్ సభ్యుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే అభిప్రాయాలున్నాయి.

రికార్డ్ బ్రేక్!

- మే నెలలో నమోదు కావాల్సిన రికార్డు మార్చిలోనే..
- గత ఏడాది మే 19న 79.33 ఎంయూలు
- తాజాగా మార్చి 28న 79.48 ఎంయూలు

గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం పైపైకి

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్‌లో నమోదవుతున్న విద్యుత్ వినియోగం ఇంజినీర్లకు ముచ్చెమటలు పట్టిస్తోంది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో నగర వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. ఒకప్పుడు విలాసవంతమైన భవంతుల్లో మాత్రమే దర్శనమిచ్చే ఏసీలు.. ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి గృహాల్లోనూ కన్పిస్తున్నాయి. రోజంతా వీటిని ఆన్ చేసి ఉంచుతుండటంతో కరెంట్ వినియోగం రెట్టింపు నమోదవుతోంది.

సామర్థ్యానికి మించిపోవడంతో..

- సాధారణంగా ఏప్రిల్/మే మాసాల్లో రికార్డు స్థాయిలో వినియోగం ఉండేది. కానీ ఈ ఏడాది మార్చి చివరి వారంలోనే నమోదు కావడం ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది. గ్రేటర్‌లో గత ఏడాది మే 19న రికార్డు స్థాయిలో 79.33 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా గురువారం (మార్చి 28న) 79.48 ఎంయూలు నమోదు కావడం గమనార్హం. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఆయిల్ లీకేజీలకు అధిక ఉష్ణోగ్రతలు తోడవడంతో షార్ట్‌సర్క్యూట్‌లతో డీటీఆర్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

నిరంతర పర్యవేక్షణ

- 2023 మార్చిలో అత్యధిక విద్యుత్ వినియోగం 67.97 మిలియన్ యూనిట్లు మాత్రమే. గత మార్చిలో సరాసరి విద్యుత్ వినియోగం 57.84 మిలియన్ యూనిట్లు. అదే ఈ ఏడాది మార్చిలో సరాసరి విద్యుత్ వినియోగం ఏకంగా 70.96 మిలియన్ యూనిట్లు నమోదైంది. గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 22.7 శాతం రికార్డు అయింది. ఈ వేసవిలో 90 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేసింది.
- వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలకు ఆస్కారం ఇవ్వకుండా సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే లైన్ల పునరుద్ధరణ, నిర్వహణ పనులు పూర్తి చేయించారు. సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఆర్టిజన్లు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు ఉదయం 8.30 గంటలకు జోన్లు, సర్కిళ్ల వారీగా టెలీకాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నారు. డిమాండ్ సరఫరాపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ఒత్తిడికి లోనవుతున్న ఫీడర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. లోడ్ మానిటరింగ్ చేస్తు..సబ్‌స్టేషన్లు దెబ్బతినకుండా చూస్తున్నారు.
- సమస్యాత్మక ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి కరెంట్ పోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయాల బలోపేతం కోసం, సీబీడీ, లైన్స్ వంటి ఇతర విభాగాలను ఏకీకరణ చేసి ఆపరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ పరిధిలోని 212 సెక్షన్ స్థాయి ఎఫ్ఓసీల్లో దాదాపు 800 మంది సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.



టీడీఆర్‌లపై తప్పుదోవ!

హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారుల వివరణకు కమిషనర్ ఆదేశాలు

- ఇద్దరు అధికారులకు మెమోలు
- ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన ఏపీఓ కృష్ణకుమార్

సాక్షి, హైదరాబాద్: హెచ్ఎండీఏలో టీడీఆర్‌లపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన ఉదంతంపై ప్లానింగ్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులకు హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. శంకర్‌పల్లి జోన్ పరిధిలో జారీ అయిన టీడీఆర్‌లపై ఎలాంటి విచారణ జరపకుండా సదరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్లానింగ్ విభాగానికి చెందిన ఓ డైరెక్టర్‌తో పాటు మరో ప్లానింగ్ అధికారి నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరించారో తెలియజేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు ఇలాంటి తప్పిదాలు మరోసారి పునరావృతం కాకుండా ఉండేందుకే కఠినంగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. టీడీఆర్‌లపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన సహాయ ప్లానింగ్ అధికారి కృష్ణకుమార్‌ను ఇప్పటికే సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన ద్వారా వచ్చిన ఫైళ్లను సమగ్రంగా పరిశీలించకుండాపై స్థాయిలో నిర్లక్ష్యం వహించినట్లు కమిషనర్ గుర్తించారు. ఈ మేరకు క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

జోన్‌ల బదిలీ..

టీడీఆర్‌ల జారీ ఉదంతం వెలుగులోకి వచ్చిన అనంతరమే ప్లానింగ్ విభాగానికి చెందిన ఇద్దరు డైరెక్టర్‌ల మధ్య జోన్‌లను కూడా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి వరకు శంషాబాద్, శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్‌ల బాధ్యతలను నిర్వహించిన విద్యాధర్ నుంచి శంకర్‌పల్లి, శంషాబాద్ జోన్‌లను తప్పించారు. ఘట్‌కేసర్, మేడ్చల్ జోన్‌లకు పరిమితం చేశారు. కేవలం ఘట్‌కేసర్ జోన్‌కే పరిమితమైన ప్లానింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు శంకర్‌పల్లి, శంషాబాద్ జోన్‌ల బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలోనే తాజాగా నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులకు మెమోలను ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు అప్పటి డైరెక్టర్ బాలకృష్ణ అండతో అక్రమాలకు పాల్పడిన కృష్ణకుమార్ నిర్వాకం కారణంగా నిజాయతీగా పని చేసే ఒకరిద్దరి అధికారులు సైతం బాధ్యత వహించాల్సిన దుస్థితి దాపురించిందని హెచ్ఎండీఏ అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు భవన నిర్మాణాలు, లే అవుట్‌లు, హైరైజ్ బిల్డింగులకు అనుమతులను ఇచ్చే క్రమంలో ప్లానింగ్ విభాగానికి చెందిన కొందరు అధికారులు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

విచారణ వేగవంతం..

- గ్రోత్ కారిడార్‌లో పలుచోట్ల హైరైజ్ బిల్డింగ్‌లకు అక్రమంగా అనుమతులను ఇవ్వడంలో కృష్ణకుమార్ కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. సాధారణంగా ఐదు అంతస్తుల కంటే ఎక్కువగా అనుమతులను ఇచ్చినప్పుడు హెచ్ఎండీఏ కమిషనర్ చైర్మన్‌గా, వివిధ విభాగాలతో కూడిన హైరైజ్ బిల్డింగ్స్ కమిటీ సమావేశంలో చర్చించిన అనంతరమే అనుమతులను ఇవ్వాల్సి ఉంటుంది. కానీ.. మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ మద్దతు పుష్కలంగా ఉండడంతో కృష్ణకుమార్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే టీడీఆర్‌లపై కూడా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించినట్లు సమాచారం.
- ప్రస్తుతం ఈ అంశంపైన కమిషనర్ విచారణను వేగవంతం చేశారు. అప్పట్లో అక్రమంగా అనుమతులు పొందిన బడా బిల్డర్‌లకు అప్పటి ప్రభుత్వ పెద్దలతో సంబంధాలు ఉండడంతో శివబాలకృష్ణతో పాటు ఏపీవో కృష్ణకుమార్ వంటి అధికారులు బాహాటంగానే నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారు. రూ.కోట్లలో అక్రమార్జనకు తెరతీశారు. ఈ నేపథ్యంలోనే శివబాలకృష్ణ అక్రమ ఆస్తులపై ఏసీబీ దాడులు జరగడం, ఆ మరుసటి రోజే కృష్ణకుమార్ అమెరికాకు వెళ్లిపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. రూ.కోట్ల విలువైన టీడీఆర్‌ల జారీలో అక్రమాలకు పాల్పడినట్లు కృష్ణకుమార్‌పై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతోనే హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్ ఆయనపైన సస్పెన్షన్ వేటు విధించారు.

హైదరాబాద్ మెట్రో అద్భుతం

ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ

- హెచ్ఎంఆర్ఎల్‌ను సందర్శించిన ఫ్రెంచ్ ప్రతినిధుల బృందం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థ పని తీరు అద్భుతంగా ఉందని భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ ప్రశంసించారు. మెట్రో రైల్ వ్యవస్థ తనను ఎంతో ప్రభావితం చేసిందన్నారు. నగర ప్రజారవాణా వ్యవస్థలో మెట్రో రైల్ సాంకేతికత, వినూత్నమైన పనితీరు తనను విశేషంగా ఆకట్టుకుందన్నారు. డాక్టర్ మాథ్యూతో పాటు ఫ్రాన్స్ కాన్సూల్ జనరల్ థియెరీ బెర్తెలాట్, బ్యూరో డీ ఫ్రాన్స్‌లో డిప్యూటీ కాన్సూల్ పాస్కల్ లోరో, రీజినల్ ఎకనమిక్ సర్వీస్ కౌన్సిలర్ బెర్ట్రాండ్ డెలా ఫారెస్ట్ డివోన్ తదితరులతో కూడిన ఫ్రాన్స్ ప్రతినిధుల బృందం శుక్రవారం హైదరాబాద్ మెట్రో రైల్ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ)ను సందర్శించింది.

ఈ సందర్భంగా హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీబీ రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ అధికారి సుధీర్ చిప్లుంకర్, కియోలిస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌పీ మిశ్రాలు ఫ్రాన్స్ రాయబారి ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికారు. హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్)కు ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) భాగస్వామిగా వ్యవహరిస్తున్న ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్, కియోలిస్ సంస్థలు ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మెట్రోరైల్ వ్యవస్థ పనితీరును వివరించాయి. హైదరాబాద్ మెట్రో రైల్ నెట్‌వర్క్, రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, రియల్ టైమ్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలన్నింటికీ సెంట్రల్ హబ్‌గా వ్యవహరించే ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ పని తీరును ఫ్రాన్స్ ప్రతినిధులు పరిశీలించారు. హెచ్ఎఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో కలిసి పని చేసేందుకు, సుస్థిరమైన అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు మాథ్యూ బృందం పర్యటన దోహదపడుతుందన్నారు. హెచ్ఎంఆర్ కంట్రోల్ సెంటర్ సాంకేతిక సామర్థ్యాలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుందనేందుకు ఈ సందర్శన నిదర్శనంగా నిలుస్తుందని కేవీబీ రెడ్డి పేర్కొన్నారు.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.